- స్మృత్యంజలి
- అసాధారణ ప్రజ్ఞాశాలి, అత్యంత వినయశీలి
- నిరుపమాన సాహితీమూర్తి
- ఆత్మీయాం మతిమాదాయ కురు సజ్జన రంజనమ్
- శ్రీహరి కవివరేణ్యుల సంస్కృత సాహితీ సౌరభం
- ఆప్తమిత్రులు రవ్వా శ్రీహరి
- భాషాపరశేషభోగి ఆచార్య రవ్వా శ్రీహరి
- భాషా సాహిత్య పథ నిర్దేశకులు ఆచార్య రవ్వా శ్రీహరి

# మూసీ
# MUSI

◆ Samputi : 26 ◆ Sanchika : 08 ◆ Pages : 64 ◆ Rs. 20
◆ June 2023

UGC Care List
Approved Journal





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి
సంపుటి : 26 సంచిక : 8
జూన్ - 2023
'శోభకృత్' జ్యేష్ఠ మాసం
సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. Anantha Laxmi
*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796
UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక
చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

స్మృత్యంజలి ... డా. కూరెళ్ళ విఠలాచార్య 5
అసాధారణ ప్రజ్ఞాశాలి, అత్యంత వినయశీలి ... డా. భాగవతం రామారావు 6
నిరుపమాన సాహితీమూర్తి ... డా. సి.హెచ్. యాదగిరి 7
ఆత్మీయాం మతిమాదాయ కురు సజ్జన రంజనమ్ ... ఆచార్య కె. నీలకంఠం 12
శ్రీహరి కవివరేణ్యుల సంస్కృత సాహితీ సౌరభం ... డా. కూరెళ్ళ అహల్య 13
మననాటి పతంజలి ... డా. శ్రీరంగాచార్య 17
ఆప్తమిత్రులు రవ్వా శ్రీహరి ... యోగాచార్య సుదర్శన్ రెడ్డి 20
భాషా సాహిత్య పథ నిర్దేశకులు ఆచార్య రవ్వా శ్రీహరి గారు 21
భాషాపరశేషభోగి ఆచార్య రవ్వా శ్రీహరి ... ఆచార్య వెలుదండ నిత్యానందరావు 23
ఆచార్య రవ్వా శ్రీహరిగారి వ్యక్తిత్వం - బోధనా రీతులు ... ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు 25
రవ్వా శ్రీహరిగారు - నేను ... ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య 28
ఆదర్శనీయం - ఆచార్య రవ్వా శ్రీహరి గారి వ్యక్తిత్వం ... డా. విస్తాలి శంకర రావు 29
భారతీయ సంస్కృత విద్వాంసులలో ఒక రవ్వ ... ఆచార్య పరిమి రామనరసింహం 34
సమున్నత వ్యక్తిత్వ శిఖరం - ఆచార్య రవ్వా శ్రీహరి ... ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు 35
దివికేగిన ఉభయ భాషా పండితుడు ... ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య 38
శబ్దసాధన తపస్సంపన్నులు శ్రీహరి గారు ... ఆచార్య కె. యాదగిరి 39
పుంభావ సరస్వతి ఆచార్య రవ్వా శ్రీహరి ... డా. వెల్దండి శ్రీధర్ 41
ఆదర్శ ఆచార్యులు - రవ్వా శ్రీహరి గారు ... డా. కోయి కోటేశ్వర రావు 43
వినయం, విద్వత్తు కలగలిసిన మూర్తిమత్వం ... సంగిశెట్టి శ్రీనివాస్ 45
నా పరిష్కరణ గ్రంథాలను ఆవిష్కరించిన శ్రీహరి గారు ... ఆచార్య వంగరి త్రివేణి 47
రవ్వా శ్రీహరి గారి సంస్కృత అనువాదాల వైలక్షణ్యం ... డా. గంగిశెట్టి లక్ష్మీనారాయణ 50
అజరామర నిఘంటువు ఆచార్య రవ్వా శ్రీహరి ... డా. మహేందర్ కట్నూరి 55
మహామహోపాధ్యాయులు ఆచార్య రవ్వా శ్రీహరి ... ఆచార్య కరిమిండ్ల లావణ్య 58
నాన్నతో నా జ్ఞాపకాలు ... రవ్వా రమేశ్ కుమార్ 59
సంస్కృతంలో లేని శాస్త్రం లేదు ... ఆచార్య రవ్వా శ్రీహరిగారితో ముఖాముఖి..
నిర్వహణ : ఆచార్య పిల్లలమర్రి రాములు 60

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by :* **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

సంపాదకీయం



వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

## యశోభూషణుడు

ఆచార్య రవ్వా శ్రీహరి గారు మూర్తీభవించిన పాండితీ స్వరూపం. కృషితో అంచెలంచెలుగా ఎదిగిన సౌజన్యమూర్తి. పరాశక్తి భాషాసేవ చేయదలచుకున్నప్పుడు ఎన్నుకున్న శరీరమే శ్రీహరి గారు. భాషా సాహిత్యాల విషయంలో ప్రస్తుతకాలంలో మనకు ప్రాతః స్మరణీయులు వారు. నిగర్వి. నిర్మల హృదయుడు. భారతీయ సంప్రదాయ విలువలను పరిపూర్ణంగా అధ్యయనం చేసి వాటిని వందశాతం నిర్వహించిన తేజోమయుడు. గురుమార్గంలోని ఆనందాన్ని అవగాహన చేసుకుని గురువుల వెంట నడిచి అధ్యయన సౌశీల్యాలు పెంచుకున్న ధీశాలి. నిక్కచ్చి అయిన జాతీయవాది. నిరంతర ఆనంద స్వరూపుడు. పరిశోధనే ప్రాణంగా భావించి కొత్తమార్గాల్లో తన పరిశోధన కొనసాగించినవాడు. నిఘంటునిర్మాణ వేత్త. ఉత్తమ అనువాదకుడు. తెలుగువారి పాణిని. ప్రశాంత పరిపాలనావేత్త. సహకారశీలి. నిర్ణయాల అమలులో కటువుగా ఉండేవారు. బోధనను ప్రశాంతంగా చేయగలిగినవారు. నూతన అధ్యయనవేత్తల కోసం ఒకటికి రెండుసార్లు పాఠాలు చెప్పగలిగినవాడు. భాషా సాహిత్య పరిశోధకుల పాలిటి కల్పతరువు వారు.

ఆచార్య శ్రీహరి గారు మా దంపతులకు కూడా గురువే. తెలుగు విశ్వవిద్యాలయంలో పూర్వం కొద్ది కాలంపాటు డా. తిరుమల రామచంద్రగారి నేతృత్వంలో ప్రాకృతంలో పి.జి.డిప్లొమా కోర్సు నిర్వహించబడింది. చివరి బ్యాచ్‌లో మేము కూడా అధ్యయనం చేసినాము. ఆ సందర్భంలో రామచంద్రగారితో పాటు, ఆచార్య కప్పగంతుల కమల, ఆచార్య నళినీ సాధలే గార్లు ప్రాకృత పాఠాలు చెప్పేవారు. శ్రీహరి గారు మాకు ప్రాకృత వ్యాకరణం (ప్రాకృత ప్రకాశం) బోధించేవారు. వారు చెప్పిన ఎన్నో సూత్రాలు ఇంకా మనస్సులో నిలిచే ఉన్నాయి. పదాల వ్యుత్పత్తికి సంబంధించి చర్చలు అప్పుటి తరగతుల్లో బాగా వచ్చేవి. ఈ చర్చల్లో తిరుమల రామచంద్రగారు కూడా పాల్గొనే వారు. కొన్ని పదాల కొరకు వారిని మరీ వెంటబడి విసిగిస్తే 'శర్మగారూ! అన్ని పదాలకూ మూలాలు దొరకడం కష్టం. మీరు కూడా ప్రయత్నం చేస్తుండండి. ఎప్పుడో, ఎక్కడో, సందర్భ వశాత్తు దొరకుతుంటాయి' అంటూ సమాధానం ఇచ్చేవారు. మాకు భాషాపరమైన అనుమానాలు తీర్చుకునే సన్నిధి, పెన్నిధి వారు.

వారి పెద్ద కుమారుడు చి.రమేశ్ వివాహం నేనే చేయించినాను. అప్పట్లో వైదిక కార్యక్రమాలు చేయించే వాణ్ణి కాబట్టి తమ కుమారుని వివాహం చేయించుమని వారు నన్ను కోరారు. సంప్రదాయ పరంగా వివాహం నిర్వహించడంలో వారి శ్రద్ధ గణనీయమైనది.

వారికి మూసీ మాస పత్రిక, వేద సంస్కృతి పరిషత్ తరఫున 'బి.ఎన్.శాస్త్రి స్మార పురస్కారం' ఇవ్వడం జరిగింది. అంతే కాకుండా వారి జీవితం – సాహిత్యం అంశంపై ఉస్మానియా విశ్వ విద్యాలయంలో నా పర్యవేక్షణలో పిహెచ్.డి. పూర్తి అయింది. నా దగ్గర మొట్టమొదట రిజిస్టర్ అయిన టాపిక్ కూడా ఇదే. అది పుస్తక రూపంలో కూడా వచ్చి ఆవిష్కరణ కూడా అయింది. ఆ సందర్భంలో వారు చాలా ఆనందించినారు. ఒకటి రెండుసార్లు ఇంటికి కూడా వచ్చి మా దంపతులను ఆశీర్వదించినవారు. మూసీ నిర్వహణలో సాధక బాధకాలను అప్పుడప్పుడు అడిగి తెలుసుకునేవారు. ఆచార్య లక్ష్మణ మూర్తి గారు, డా. శ్రీరంగాచార్య గార్లు ఎప్పుడు కలిసినా వీరి ప్రస్తావన లేని ప్రసంగాలు ఉండవు.

తమ కృషి ద్వారా, పట్టుదల ద్వారా ఎన్నో పరిశోధక గ్రంథాలను రచించి, భావి తరాలకు తానే ఒక రిఫరెన్స్‌గా మారిన ఆచార్య రవ్వా శ్రీహరిగారు, అజరామరుడు, యశోభూషణుడు. వారికి మూసీ మాస పత్రిక సవినయంగా శ్రద్ధాంజలి ఘటిస్తూ ఈ పత్రికను అంకితం చేస్తున్నది.







# స్మృత్యంజలి

ఆయన గొప్ప పండితుడు, ఆయన మా తెలంగాణ బిడ్డ, మా
కాయన మంచి మిత్రుడు, మహాకవి జాష్వ కవిత్వకీర్తి జా
తీయపరంగ చాటిన సుధీతిలకంబు, నిఘంటుకర్త ఆ
త్మీయులు రవ్వ పోయె మనసెంతొ కకావికలంబునయ్యెనే

కఠినాతి కఠిన నిఘంటువుల రచించి
తెలగాణకే కీర్తి తెచ్చినావు
ఆకాశవాణిలో ఆకట్టుకొనునట్లు
సంస్కృతబోధన సలిపినావు
పండితులందు నుద్దండ పండితునివై
నిలువెత్తు శిఖరమై నిలిచినావు
ద్రవిడ విద్యాలయ వివిధ భాషలనెల్ల
ఉన్నతస్థాయిలో నుంచినావు
ఓ మహామహోపాధ్యాయ! ఓ వినమ్ర
మూర్తి! శ్రీహరీ! తెలగాణ ముద్దుబిడ్డ!
సాహితీరమ్య! గగన భాస్వత్ శశాంక!
ఆర్య! ఆచార్యవర్య! స్మృత్యంజలిదిగొ!

మా కర్త శ్రీహరి మాకికలేదని
పదకోశములు నెల్ల వగచుచుండె
మా పండితుడు రవ్వ మాకిక లేదని
అన్నమాచార్యులు నదిరిపడియె
మా మహారచయిత మాకిక లేదని
శ్రీహరి పదనిధి చిన్నబోయె
మా మహోపాధ్యాయ మాకిక లేదని
విద్యార్థి లోకము విస్తుపోయె
తెలుగు సంస్కృత భాషల వెలుగురవ్వ
మరలిరాని లోకాలకు తరలిపోయె
బాధపడుచుండె సాహిత్య బంధుజనము
ఆర్య! శ్రీహరి మాదు స్మృత్యంజలిదిగొ!

డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య
ఫోన్ : 939 864 2537

ISSN 2457-0796

UGC Care List Approved Journal

మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2023

# అసాధారణ ప్రజ్ఞాశాలి, అత్యంత వినయశీలి "ఆచార్య రవ్వా శ్రీహరి"

డా॥ భాగవతం రామారావు, ఫోన్ : 9440 915 210




సికింద్రాబాద్ రాణిగంజ్ దగ్గరనున్న లాలాగుడిలో మున్నాలాల్ సంస్కృత కళాశాల అనుమల రాఘవశర్మగారు, బద్రీనాథ్, బాలయ్య అనేవారి నిర్వహణలో కొన్ని సంవత్సరాలు వెలిగింది. అక్కడ నాకు 1957 ప్రాంతంలో శ్రీహరితో పరిచయం కలిగింది. యాదగిరిగుట్ట లోని సంస్కృత పాఠశాలలోని ఉపాధ్యాయులు కేరళ సుబ్రహ్మణ్య శాస్త్రి గారు మున్నాలాల్ సంస్కృత కళాశాలలో చేరినారు. వారితోపాటు శ్రీహరి ఇంకొక ఇద్దరో, ముగ్గురో విద్యార్థులు కూడా వచ్చి చేరినారు. నేను అక్కడ ప్రధానాచార్యులుగా నున్న మా బావగారు శాస్త్రుల విశ్వనాథశాస్త్రిగారి వద్ద ఉండి ఆయుర్వేద కళాశాలలో చదువుకొనే వాడిని. అప్పటినుండి మా స్నేహం అవిచ్ఛిన్నంగా సాగింది. లక్ష్మణ మూర్తి కూడా మాతో చేరి ముగ్గురం కలిసి ఉండేవారం. మున్నాలాల్ కళాశాలలో పాఠాలు ఉదయం సాయంత్రం జరిగేవి. అందుకని నేను పాఠాలు వినేవాడిని. నాకు శ్రీహరికి వ్యాకరణంపై అభిరుచి ఉండి తొందరగా గ్రహించి గురువుల అభిమానానికి పాత్రులమైనాం.

శ్రీహరి తల్లి చిన్నపుడే గతించింది. తండ్రి ఊరూరు తిరుగుతూ వ్యాపారం చేసేవాడు. ఆర్థికమైన ఆధారం ఉడేది కాదు. కాబట్టి శ్రీహరి సెలవుల్లోను ఎక్కువగా నగరంలోనే ఉంటూ ట్యూషన్లు చెప్పుకుంటూ ఉండేవాడు. మున్నాలాల్ తర్వాత వేదాంత వర్ధినిలో శ్రీహరి చేరినాడు. నేను ఆయుర్వేదం చదువుతూ అద్వైత వేదాంతంలో బి.ఓ.ఎల్. చేసినాను. మున్నాలాల్ తర్వాత ఒకచోట లేకున్నా చాలా కలుసుకొనేవారం.

చదువు తర్వాత నేను ఉస్మానియా కళాశాల చరిత్ర విభాగంలోను శ్రీహరి వివేకవర్ధినిలో పనిచేసేవారం. ప్రతిరోజు సాయంత్రం కలిసి శ్రీహరి ఉండే నల్లకుంటవరకు నడచి నేనక్కడినుండి రైల్లో యాకుత్పురాకు వెళ్లేవాడిని. అదేమిటో గాని మా మాటల్లో ఎప్పుడూ చదువుల విషయాలే వచ్చేవి. ఇతర విషయాలేవీ వచ్చేవి కావు. సినిమాలు మొదలైనవాటికి ఆర్థికపరమైన వెసులుబాటు ఉండేది కాదు కాబట్టి. వివేకవర్ధిని నుండి మారిన తర్వాత రోజూ కలవడం తగ్గింది.

నా వివాహం శ్రీహరి లక్ష్మణమూర్తుల కంటె చాలా ముందు జరిగింది. ఇంచుమించు ప్రతి సెలవుల్లో మా ఇంట్లో కలిసికొని సాహిత్యపరమైన కాలక్షేపం చేస్తుండేవారం. అది ఎంతగానో విజ్ఞానదాయకంగా ఉండేది. నా భార్య శ్రోత్రియుల వేదపండితుల సనాతనాచారపరుల బిడ్డ. తెలుగు వ్రాయటం, చదవటం తప్ప ఇప్పటికి (75) ఇంగ్లీషు అక్షరాలు కూడ రావు కాని ప్రతి సెలవులలో మా చర్చలు, మాటలు విని విని మన సాహిత్య సంస్కృతి సంప్రదాయాలపై ఎంతో అవగాహన, తెలివిడి కలిగింది. ఇది గొప్పకు వ్రాయటంలేదు. తర్వాత తర్వాత వీరిద్దరు మా ఇంటికి వచ్చినప్పుడు నా కంటె నా భార్యతోనే ఎక్కువగా మాట్లాడేవారు. ఉద్యోగ బాధ్యతలు పెరిగన తర్వాత మేం కలుసుకోవటం తగ్గింది.

శ్రీహరిలో ఇతరులకు సాహాయ్యం చేసే గుణం గొప్పది. బంధువులకు, స్నేహితులకు, ఇతరులకు తన చేతనయినంత సాహాయ్యం చేసేవాడు. ఎందరో బంధువులను ఇంట్లో ఉంచుకొని చదువుకు సాహాయ్యం చేయటం, ఉద్యోగాలు ఇప్పించటం నాకు తెలుసు. అందులో కొందరు కృతజ్ఞత చూపనివారు కూడా ఉన్నారు. తర్వాత ఒక్కనాడు కూడా వచ్చి కలియనివారెందరో. అయినా పట్టించుకునే వాడు కాదు. ఇక తాను రచించి ప్రకటించిన అన్ని పుస్తకాలు కూడ తాను స్వయంగా తన చేతులతో వ్రాసినవే కాని ఎవరితోను ఇసుమంత పని చేయించుకోలేదు. నేనేదైనా చేస్తానంటే నాకు కూడా ఇవ్వలేదు. అహర్నిశలు పరిశోధన రచనల మీదే దృష్టి. అందుకే ఇన్ని రచనలు చేయటం జరిగింది. ఇంతటి మేధావి అయిన శ్రీహరికి ఎందుకో అప్పకవీయం అంతుపట్టలేదు. నేను కొన్ని భాగాలను వివరించి చెప్పటం జరిగింది. దానిని నా పుస్తకావిష్కరణ (ద్రవ్య రత్నావళి) సభలో గుర్తు చేసినారు.

ఇక అతనికి గురుభక్తి అపారం. ఎప్పుడూ గురువులను స్మరిస్తుండేవారు. తనను శిష్యునిగా అంగీకరించి వ్యాకరణశాస్త్రాన్ని బోధించిన శ్రీమాన్ శఠగోప రామానుజస్వామివారికి ఘనమైన రీతిలో సన్మానాన్ని నిర్వహించటం అసాధారణం. తెలంగాణాలో వందల్లోనున్న శఠగోప రామానుజస్వామి వారి శిష్యులలో ఎవరికి రాని ఆలోచన శ్రీహరికి రావటం అద్భుతంగా నిర్వహించటం అతనిలో మూర్తీభవించిన గురుభక్తికి నిదర్శనం. శ్రీహరి చేసిన ఇన్ని ఘనమైన, అద్భుతమైన, అసాధారణమైన కార్యాలలో అతని ఇల్లాలు శ్రీమతి అనంతలక్ష్మి పాత్రను మనం మరచిపోకూడదు.

# నిరుపమాన సాహితీ మూర్తి – ఆచార్య రవ్వా శ్రీహరి

డా. సిహెచ్. యాదగిరి, ఫోన్ : 967 630 1109

తెలంగాణలోని ఒక మారుమూల పల్లె నుండి వచ్చిన ఒక నిరుపేద విద్యార్థి భారతదేశం గర్వించే మహామహోపాధ్యాయుడవుతాడని, అన్నంపెట్టి చదువు చెప్పిన విద్యాసంస్థకు గాని, గురువులకు గాని తెలియదు. అపశబ్ద మాలిన్యం సోకని ఒక నిఘంటుకర్త, వ్యాకరణ వ్యాఖ్యాత అతనిలో ఉన్నాడని ఎవరూ ఊహించలేదు. అతడే ఆచార్య రవ్వా శ్రీహరిగారు.

శ్రీహరిగారు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రామన్నపేట తాలూకా మునిపంపుల గ్రామంలో నిరుపేద, నిర్విద్య చేనేత కుటుంబంలో 1943 సెప్టెంబర్ 7న జన్మించారు. వీరి తల్లి రవ్వా వెంకట నర్సమ్మ, తండ్రి నరసయ్య. మునిపంపుల శ్రీహరిగారి అమ్మమ్మ ఊరు. వీరి సొంత ఊరు వెలువర్తి. కుటుంబంలో ప్రథమ సంతానమైన శ్రీహరి గారికి ఒక తమ్ముడు, ఒక చెల్లెలు ఉన్నారు. తాను చదువుకోకపోయినా తన పిల్లలు ఉన్నత చదువులు చదవాలని ఆరాటపడే తల్లి శ్రీహరిగారిని మునిపంపులలో ప్రాథమిక విద్యను నేర్చుకోడానికి చేర్పించింది. శ్రీహరిగారి తాత మిరియాల కనకయ్య. ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులు.

1952లో ఐదవ తరగతి చదివే ఆర్థిక స్థోమత లేకపోవడంతో శ్రీహరి తండ్రి చదివించడానికి ఇష్టపడలేదు. కాని తల్లి తాతల ప్రోత్సాహంతో నల్లగొండ జిల్లాలో ఉన్న మూడు పాఠశాలలో ఒకటయిన భువనగిరిలో చేరి ఐదవతరగతి పూర్తి చేశారు. అదే వేసవి కాలంలో వారి తల్లిగారు అనారోగ్యంతో కన్నుమూశారు.

చదువుమీద దృష్టిపెట్టిన శ్రీహరికి తల్లి మరణం, ఆర్థిక పరిస్థితులు అగమ్య గోచరంగా మారినాయి. అటువంటి సందర్భంలో అమ్మమ్మ గారింట్లో ఉన్నప్పుడు దినపత్రికలో యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన విద్యాపీఠంలో ఉచిత భోజన సౌకర్యంతో ఫీజులు లేకుండా సంస్కృతం చదువు చెబుతారని పత్రికా ప్రకటన చూసి వెళ్ళి ఆ పాఠశాలలో చేరారు శ్రీహరి.

యాదగిరి విద్యాపీఠంలో ఇరవైఐదు మంది విద్యార్థులు ఉండేవాళ్ళు. అందరూ అడ్డ పంచె, ఉత్తరీయం వేసుకొని తిరునామాలు, భస్మరేఖలు పెట్టుకొని ఉండేవారు. శ్రీహరికి ఆ వాతావరణం కొత్తగా ఉండేది. అప్పుడు చదువు చెప్పే గురువుగారిని శాస్త్రిగారు అని పిలిచేవారు. శ్రీహరి ఆ వాతావరణంలో ఇమిడిపోయినారు కాని కొంత సమయం పట్టింది.

విద్యాపీఠంలో శ్రీహరి మొట్టమొదటి గురువు కేరళ సుబ్రహ్మణ్య శాస్త్రి. వారివద్ద రామశబ్దంతో సంస్కృత విద్యను ప్రారంభించారు. ఒక సంవత్సరం గడిచేసరికి శబ్దాలు, ధాతువులు, అమరకోశంలోని రెండు కాండలు, రఘువంశంలోని కొన్ని శ్లోకాలు, సంప్రదాయ పద్ధతిలో క్షుణ్ణంగా నేర్చుకున్నారు. రఘువంశం, కుమారసంభవం, కిరాతార్జునీయం, మేఘసందేశం, మాఘకావ్యం, చంపూ రామాయణం వంటి శాస్త్రగ్రంథాలతో పాటు అనేక కావ్యాలను చదువుకోవడం వల్ల భవిష్యత్తులో నిఘంటు రచనలకు, పరిశోధనలకు మంచి పునాది ఏర్పడింది.








యాదగిరి సంస్కృత విద్యాపీఠంలో విద్యాభ్యాసం పూర్తి చేసిన తర్వాత ప్రవేశ పరీక్ష ద్వారా సీతారాంబాగ్ మున్నాలాల్ సంస్కృత కళాశాలలో డి.ఓ.ఎల్., బి.ఓ.ఎల్., వ్యాకరణం చదువుకున్నారు. అక్కడ శ్రీ శఠగోపం రామానుజాచార్యులు, శ్రీ ఖండవల్లి నరసింహ శాస్త్రి, శ్రీ అమరవాది కృష్ణమాచార్యుల వద్ద మహాభాష్యాంతం, వ్యాకరణం చదువుకున్నారు. శ్రీహరి చదువుకునే రోజుల్లోనే సైకిల్మీద వెళ్ళి ట్యూషన్ చెప్తూ తన ఖర్చులకు తానే సంపాదించుకునే వారు. డి.ఓ.ఎల్లో సాహిత్యాన్ని ప్రధానాంశంగా తీసుకున్నప్పటికీ శ్రీహరికి వ్యాకరణంపైన ఉన్న శ్రద్ధను గమనించి ఎంట్రెన్స్లో వ్యాకరణం ప్రధానాంశంగా తీసుకోకపోయినా మినహాయింపును ఇచ్చి వ్యాకరణతో డి.ఓ.ఎల్లో ప్రవేశాన్నిచ్చారు. ఎంట్రెన్స్లో చదువుకోవాల్సిన సిద్ధాంత కౌముదిలోని చాలా భాగాలను స్వయంగానే చదువుకున్నారు శ్రీహరి. ప్రౌఢ మనోరమ, పరమలఘు మంజూష, సిద్ధాంతకౌముదిలోని కొన్ని ప్రకరణాలు, ముక్తావళి, మీమాంసాన్యాయం ప్రకారం మొదలైనవాటిని డి.ఓ.ఎల్లో చదివారు. 1960లో డి.ఓ.ఎల్ పాసై బి.ఓ.ఎల్.,లో చేరారు. ఇక్కడే వ్యాకరణంలో ఘనపాఠిగా తీర్చిదిద్దబడ్డారు.

## ఉద్యోగ బాధ్యతలు

1962లో బి.ఓ.ఎల్., వ్యాకరణంలో పాస్ అయిన తర్వాత వివేకవర్ధిని హైస్కూల్లో తెలుగు పండితునిగా చేరారు. ఆ రోజుల్లో సంస్కృతం చదువుకునే వాళ్ళందరూ చాలావరకు స్కూళ్ళల్లో తెలుగు పండితులుగా చేరేవారు. శ్రీహరిగారు కూడా తెలుగు పండితునిగా చేరారు. అప్పుడు 80–150 రూపాయల గ్రేడు జీతం. ఉద్యోగ స్థిరత్వం కోసం తెలుగు పండిత శిక్షణ చేశారు. కళాశాల లెక్చరర్ కావాలన్న కోరికతో 1967లో ఎం.ఏ సంస్కృతం ప్రైవేటుగా చేసి అందులో సర్వ ప్రథములుగా ఉత్తీర్ణులై ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి 'మెల్కోటే' యస్. నారాయణరావు స్మారక బంగారు పతకాన్ని పొందడం శ్రీహరికి సంస్కృతంపై ఉన్న పట్టు ఎలాంటిదో తెలుస్తుంది.

తెలుగు పండిత శిక్షణ పూర్తి చేయడం, తెలుగు పండితునిగా ఉద్యోగం చేస్తుండడం వలన 1970లో ఎం.ఏ తెలుగులో ప్రథమ శ్రేణి ఉత్తీర్ణతను సాధించారు. భాషను ఆదునిక దృష్టితో పరిశీలించా లంటే భాషాశాస్త్ర దృక్పథం అవసరం అని భావించి సాయంకాలపు కోర్సులో చేరి అప్లైడ్ లింగ్విస్టిక్స్లో పి.జి.డిప్లొమాను చేశారు. శ్రీహరి 1967లో ఆంధ్రసారస్వత పరిషత్లోని ప్రాచ్య కళాశాల లెక్చరర్గా చేరారు. అక్కడ విద్యార్థులకు సంస్కృతం, తెలుగు రెండూ ఆరు సంవత్సరాలు బోధించారు.

1973లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు లెక్చరర్గా చేరారు. అక్కడ తెలుగు శాఖాధ్యక్షులు బిరుదురాజు రామరాజుతో సాన్నిహిత్యం ఏర్పడింది. శ్రీహరి అప్పటితో సంస్కృతంలో **'అగస్త్య పండితుని కృతుల'**పై పరిశోధన చేయడానికి పిహెచ్.డి., రిజిస్టర్ కూడా చేసుకున్నారు. కాని బిరుదురాజు రామరాజుగారి సలహాతో తెలుగులో భాస్కర రామాయణంపై పరిశోధన చేసి 1981లో డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నారు. ఉద్యోగరీత్యా తెలుగు సాహిత్యంవైపు మొగ్గు చూపిన శ్రీహరిగారు తెలుగు సాహిత్యానికి పూర్తిగా వచ్చారు.

ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో ఎం.ఏ., విద్యార్థులకు వ్యాకరణం, సంస్కృతం, అప్పుడప్పుడు భాషా శాస్త్రం బోధించేవారు. విద్యార్థులు మంచి మార్కులతో పాసై, కష్టతరంగా కనిపించే ఆ సబ్జెక్టులు సులభ సాధ్యాలని నిరూపించేవారు. రామరాజుగారి ప్రేరణతో నిరంతర పరిశోధనా వ్యసనాన్ని శ్రీహరిగారు అలవరచుకున్నారు.

ఆచార్య రవ్వా శ్రీహరిగారు 43 సంవత్సరాల విశేష బోధనానుభవంతో సీనియర్ తెలుగు పండితుని నుంచి ప్రొఫెసర్ దాకా వివిధ స్థాయిలలో ఎంతో నాణ్యమైన, ఆదర్శవంతమైన బోధన చేశారు. వివేకవర్ధిని పాఠశాలలో సీనియర్ తెలుగు పండితునిగా చేరి 1962 నుండి 1967 వరకు 5 సంవత్సరాలు బోధించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఓరియంటల్ కళాశాలలో 1967లో ఉపన్యాసకులుగా చేరి 1973 వరకు ఐదున్నర సంవత్సరాలు బోధన చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1973లో చేరి 1981 వరకు ఎనిమిది సంవత్సరాలు సహాయ ఆచార్యులుగా పనిచేశారు. 1981 నుంచి 1988 వరకు ఏడు సంవత్సరాలు అసోసియేట్ ప్రొఫెసర్గా పనిచేశారు. ఆ తర్వాత హైద్రాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఆచార్యులుగా 1988 నుండి 2005 వరకు సుదీర్ఘకాలం పనిచేశారు.

## పరిపాలనా దక్షత

శ్రీహరిగారు హైద్రాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా తొమ్మిది సంవత్సరాలు పని చేశారు. అదేవిధంగా ద్రావిడ విశ్వవిద్యాలయం (కుప్పం)కి అక్టోబర్ 2001 నుండి మే 2005 వరకు నాలుగు సంవత్సరాలు ఉపాధ్యక్షులుగా పనిచేశారు. ఆ తర్వాత హైద్రాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి కొంతకాలం (దాదాపు ఆరు నెలలు) ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు. అధ్యాపకవృత్తితో పాటు 23 సంవత్సరాలు పరిశోధనా పర్యవేక్షకులుగా పనిచేశారు.




## వివిధ విశ్వవిద్యాలయాలలోని విద్యాసంఘాలలో నిర్వహించిన పదవులు :

హైద్రాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని తెలుగుశాఖ పాఠ్య ప్రణాళికా సంఘం అధ్యక్షులుగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికాసంఘం సభ్యులుగా, ఉస్మానియా ఓరియంటల్ విద్య పాఠ్య ప్రణాళికా సంఘ సభ్యులుగా, హైద్రాబాద్ విశ్వవిద్యాలయం స్టాండింగ్ కమిటీ సభ్యునిగా, వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో నాలుగు పర్యాయాలు విజిటింగ్ ఫెలోగా, తిరుపతి శ్రీ వేంకటేశ్వర వైదిక విశ్వవిద్యాలయం అకడమిక్ కౌన్సిల్ సభ్యునిగా, తెలుగు అకాడమీ (స్టాండింగ్ కమిటీ ఫర్ అకడమిక్ మాటర్స్ 2013) ఛైర్మన్‌గా పనిచేశారు.




## సాహిత్య సంఘాలలో నిర్వహించిన పదవులు

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల సంఘంలో సభ్యునిగా, హైద్రాబాద్ ప్రెస్ అకాడమీ సలహాసంఘం సభ్యునిగా, కె.కె. బిర్లా ఫౌండేషన్, న్యూఢిల్లీ వారి సరస్వతి సమ్మాన్ భాషాసమితి సభ్యునిగా, హైద్రాబాద్ తెలుగు అకాడమీలో ఇంగ్లీషు నిఘంటువు, తెలుగు నిపుణుల కమిటీ సభ్యునిగా, తెలుగు నిఘంటు నిపుణుల కమిటీ సభ్యునిగా చేశారు. తెలుగు అకాడమీ పాలనాసంఘ సభ్యునిగా, కేంద్ర సాహిత్య అకాడమీ, ఢిల్లీ తెలుగు సలహాసంఘం సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్య, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సభ్యునిగా, తి.తి.దే. కేంద్ర ధార్మిక సలహాసంఘం సభ్యులుగా... ఈవిధంగా ఎన్నో సంఘాలలో వేరు వేరు బాధ్యతలు తీసుకొని ఆ పదవులకే వన్నె తెచ్చినారు రవ్వాశ్రీహరిగారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎన్నో సాహిత్య సదస్సులు నిర్వహించారు. అదేవిధంగా వారు అనేక సాహిత్య సదస్సులలో పత్ర సమర్పణ చేసి ఆయా సదస్సులలో ప్రత్యేకతను తెలియజేశారు. వివిధ పత్రికలలో తెలుగు భాష సాహిత్యం 50 పరిశోధనాపత్రాలు ప్రచురించారు. సంస్కృతభాషా సాహిత్యంపై 25 పత్రాలు ప్రచురించారు. రవ్వా శ్రీహరిగారి వద్ద తొమ్మిదిమంది పరిశోధక విద్యార్థులు పిహెచ్.డి. పూర్తిచేసినారు.




## పురస్కారాలు

తెలంగాణ ఎన్.ఆర్.ఐ. అసోసియేషన్‌వారు జనవరి 12, 2017న జీవన సాఫల్య పురస్కారం అందచేశారు. 20 డిసెంబర్ 2017న పరవస్తు విద్యాపీఠం విశాఖపట్నం వారు తెలుగు తిరునాళ్ళు సందర్భంగా "పరవస్తు చిన్నయసూరి జాతీయ పురస్కారం" అందజేశారు. శ్రీకృష్ణదేవరాయ భాషా నిలయం, హైదరాబాద్‌వారు డా.ఎం.ఎల్. నరసింహారావు సాహితీ సేవా పురస్కారాన్ని 7 నవంబర్ 2016న ప్రదానం చేశారు. కాళోజీ ఫౌండేషన్, వరంగల్‌వారు కాళోజీ మెమోరియల్ అవార్డును నవంబర్ 2015 సంవత్సరంలో ప్రదానం చేశారు. తెలుగు విశ్వవిద్యాలయంవారు 1993 సం॥లో 'ఉత్తమ సంస్కృత పండితుడు' పురస్కారం అందజేశారు. 'ప్రపంచపదీ' సంస్కృత అనువాదానికిగాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2001లో ప్రదానం చేశారు. శ్రీహరి నిఘంటువుకు తెలుగు

విశ్వవిద్యాలయంవారు 2007లో సాహిత్య పురస్కారం అందజేశారు. డా. భూతపురి సుబ్రహ్మణ్యశర్మ మెమోరియల్ ట్రస్ట్, కడపవారి పురస్కారం, యువభారతివారి ఇరివెంటి పురస్కారం, పాములపర్తి సదాశివరావు మెమోరియల్ ఫౌండేషన్ వారి సాహిత్య పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉగాది పురస్కారం, శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారిచే స్వర్ణకంకణ పురస్కారం, శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయంవారిచే 2010లో బూర్గుల రామకృష్ణారావు స్మారక పురస్కారం, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠ్ (డీమ్డ్ యూనివర్సిటి), తిరుపతి, కాన్వొకేషన్‌లో (18 అక్టోబర్, 2011) "మహామహో పాధ్యాయ" బిరుదుతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే 21 సెప్టెంబర్, 2012లో గురజాడ ప్రతిభా పురస్కారం .... ఇట్లా ఎన్నో పురస్కారాలు శ్రీహరిగారిని వరించాయి.

## నిఘంటు నిర్మాణ సేవ

భాషాభివృద్ధికి నిఘంటువులు గీటురాళ్ళు. సమాజంలో అభివృద్ధి చెందిన రంగాల విస్తృతిని గమనించడానికి ఆయా రంగాలలో వస్తున్న శబ్ద సముదాయాన్ని పరిశీలించడానికి భాష ఒక మార్గం. అట్లాంటి పరిశీలన చేసి వేరువేరు నిఘంటువులను నిర్మించారు రవ్వా శ్రీహరిగారు. సూర్యరాయాంధ్ర నిఘంటు కర్తలు స్పృశించని ఎన్నో కావ్యాలను పరిశీలించి, అదేవిధంగా అన్నమయ్య కీర్తనలు, క్షేత్రయ్య పదాలు, సారంగపాణి పదాలు, జానపద సాహిత్యానికి సంబంధించిన గ్రంథాలయిన రాయవాచకం, సిద్ధేశ్వర చరిత్ర, వచన గ్రంథాలయిన యక్షగాన సాహిత్యం, కాశీయాత్ర చరిత్ర, సాక్షి మొదలైన గ్రంథాలు పరిశీలించారు. అదేవిధంగా ఆధునిక సాహిత్యం నుండి పదాలను, వాడుక పదాలు సేకరించి శ్రీహరి నిఘంటువు నిర్మించారు.

సంఖ్యలను సూచించే పదాల సమూహంచే కూర్చబడిన గ్రంథం సంకేత పదకోశం. ఈ గ్రంథంలో పదాలు అకారాది క్రమంలో కాక ఏక, ద్వి, త్రి, చతుర్ అని సంఖ్యల క్రమంగా ఇవ్వబడినాయి. ఈ సంకేత పదకోశంలో 2200 పదాలు చేర్చారు. ఇది శాస్త్రీయంగా నిర్మించబడిన నిఘంటువు.

వ్యాకరణ శాస్త్రంలో మనం కావ్యాలలో ఉపయోగించిన భాషను వ్యాకరించి చెప్పడం జరుగుతుంది. చిన్నయసూరి బాలవ్యాకరణం, బహుజనపల్లి సీతారామయ్య ప్రౌఢవ్యాకరణం వంటి వాటిలో తెలియని పదాలుంటాయి. ఆ పదాలకు అర్థవంతమైన వివరణ **'వ్యాకరణ పదకోశం'**. దీనిని తెలుగు అకాడమీవారు 1978లో, 1997లో రెండుసార్లు ముద్రించారు.

నల్లగొండ జిల్లాలో ప్రధానంగా మాట్లాడే భాష తెలుగు. దీనితో పాటు లంబాడీ, ఉర్దూ మాండలికాలు కూడా వాడుకలో ఉన్నాయి. నల్లగొండ జిల్లాలోని ప్రజలు మాట్లాడే భాషలోని మాండలిక పదాలు సేకరించి జిల్లా మాండలిక పదకోశం రవ్వా శ్రీహరిగారు 1986లో గ్రంథరూపంలో మనకందించారు. అదేవిధంగా నల్లగొండ జిల్లాలోని ప్రజలు మాట్లాడే భాషను వ్యాకరణ విశ్లేషణలతో వివరిస్తూ **'నల్లగొండ జిల్లా భాష'** అనే మరో గ్రంథాన్ని అందించారు.

తెలంగాణ మాండలికాలను ప్రాచీన కావ్యాలలో ఎక్కడెక్కడ వాడారు, ఎలా వాడారు, ఏ ఏ కవులు వాడారు అనే అంశాలను ఉదాహరణలతో సహా **తెలంగాణ మాండలికాలు - కావ్య ప్రయోగాలు** అనే పేరుతో గ్రంథాన్ని ప్రచురించారు రవ్వా శ్రీహరిగారు.

అన్నమయ్య వాడిన పదాలలో అచ్చతెలుగు పదాలు, జన వ్యవహారంలో ఉండే పదాలు ఎక్కువగా వాడడం జరిగింది. అలాంటి పదాలన్నింటిని సేకరించి శ్రీహరిగారు అన్నమయ్య పదకోశం గ్రంథాన్ని వెలువరించారు.

## వ్యాకరణ సేవ

సంస్కృత వాఙ్మయంలో వ్యాకరణ విభాగం చాలా పెద్దది. అలాంటి వ్యాకరణంలో పాణినీయ వ్యాకరణం ప్రాచుర్యంలో ఉంది. పాణిని రచించిన అష్టాధ్యాయి ఎనిమిది అధ్యాయాలలో సుమారు నాలుగువేల సూత్రాలలో రచించాడు. అలాంటి అష్టాధ్యాయిని శ్రీహరిగారి తెలుగు అనువాదాన్ని తెలుగు అకాడమీవారు రెండు సంపుటాలుగా వెలువరించారు.

అలాగే లఘుసిద్ధాంత కౌముదీ అనే పేరుతో సంజ్ఞా, సంధి, కృత్, తద్ధిత, కారక, సమాస ప్రకరణాలుగా బాల వ్యాకరణకర్త అయిన పరవస్తు చిన్నయసూరి రచనలను అనువదించి అందించినారు.

## తెలుగు సాహిత్య విమర్శ - పరిశోధన

ఆచార్య రవ్వా శ్రీహరిగారు భాషా సాహిత్యానికి సంబంధించిన 25 వ్యాసాల సంపుటిని ఉభయభారతి పేరుతో వెలువరించారు. తెలుగు కవుల సంస్కృతానుకరణలు పేరుతో తెలుగు కవులు సంస్కృత కవులను ఎలా అనుకరణ చేస్తున్నారో తెలియజేశారు. అలాగే మన ప్రాచీనసాహిత్యంలో ఎన్నో గ్రంథాలు అలభ్యంగా మిగిలిపోయాయి. అలబ్ధంగా ఉన్న గ్రంథాలనుండి పద్యాలు సేకరించి గ్రంథరూపంలో వెలువరించారు.

**'భాస్కర రామాయణము విమర్శనాత్మక పరిశీలనము'** అనే అంశంతో వివిధ గ్రంథాలయాలను సందర్శించి వివిధ గ్రంథాలను అధ్యయనం చేసి ఉత్తమమైన పరిశోధనాగ్రంథాన్ని తీసుకువచ్చారు రవ్వా శ్రీహరిగారు. అలాగే భాష, సాహిత్యం, సంస్కృతి సంబంధమైన వ్యాసాల సంకలనం 13 వ్యాసాలతో **సాహితీ నీరాజనం** పేరుతో గ్రంథాన్ని వెలువరించారు.

## సంపాదకత్వం




గ్రంథ సంపాదకత్వం అనేది పెద్ద బాధ్యత. పరిశోధనారంగంలో క్లిష్టమైన విషయాలపై వివిధ వ్యక్తుల అభిప్రాయాలు, వారి వ్యాసాలను ఒక సంకలనంగా సమన్వయపరచడం, కొన్ని ప్రత్యేక అంశాలను సేకరించి వాటికి సరైన నిర్ణయం చేసి సంపాదకులుగా వ్యవహరిం చడం అటువంటి కష్టమైన కార్యాన్ని నిర్వహించారు రవ్వా శ్రీహరి గారు. **అలబ్ధ కావ్య పద్యముక్తావళి** పేరుతో అలబ్ధకావ్యాలలోని పద్యసాహిత్యాన్ని సేకరించి గ్రంథంగా వెలువరించారు. వ్యాకరణాది శాస్త్రాలలోను, సాహిత్యంలోను ఆయా విషయాలను నిరూపించే టప్పుడు న్యాయాలను వాడడం జరుగుతుంది. అలాంటి న్యాయాలు సేకరించి **సంస్కృత న్యాయదీపిక** పేరుతో గ్రంథాన్ని ప్రచురించారు. అలాగే సంస్కృతంలోని సూక్తులను సేకరించి **సూక్తి రత్నాకరం** పేరుతో గ్రంథాన్ని వెలువరించారు. అలాగే కాణాదం పెద్దన సోమయాజి (18వ శతాబ్దివాడు)కి సంబంధించిన రచనలు సేకరించి **ముకుంద విలాసం** పేరుతో గ్రంథం వెలువరించారు.

## అన్నమయ్య సాహిత్య సేవ




అన్నమయ్య సృష్టించిన సాహిత్యంలోని అచ్చతెలుగు పదాలు విరివిగా వాడాడు. సాధారణ ప్రజానీకం వాడుకునే దేశీయ తెలుగుకు తన సంకీర్తలల్లో స్థానం కల్పించాడు. అలాంటి పదాలు సేకరించి **'అన్నమయ్య అచ్చతెలుగు'** పేరుతో గ్రంథం రచించారు.

అన్నమయ్య ప్రయోగించిన వివిధ రకాల నవ్వులను, సిగ్గులను, వలపులను, చేతలను, ఆశలను, సరసాలను గమనించి సేకరించి వాటిని అన్నమయ్య ఎన్ని రకాలుగా వాడాడో తెలుపుతూ **'అన్నమయ్య నవ్వులు'** అనే పేరుతో గ్రంథాన్ని అందించారు శ్రీహరిగారు.

**'అన్నమయ్య భాషా వైభవం'** 15 వ్యాసాలను అన్నమయ్య భాషపై, వారి సంకీర్తనలపై పరిశీలించి వ్యాస సంపుటిని వెలువరించారు. అలాగే అన్నమయ్య వివిధ సందర్భాలలో వాడిన సూక్తులు సేకరించి **అన్నమయ్య సూక్తి వైభవం** పేరుతో సూక్తులను వివరణాత్మకంగా తెలియజేశారు.

## సంస్కృత సేవ




శ్రీహరిగారు తెలుగులోనే కాక సంస్కృతంలోను ఎంతో సేవ చేశారు. శ్రీహరిగారు రచించిన సంస్కృత గ్రంథాలు మాతృగీతమ్, ఫిరదౌసి, తైలపాయికా, ప్రపంచపదీ, అన్నమాచార్య సూక్తిసుధా, వేమన శతకమ్, సంస్కృత వైజయంతీ, నరసింహ శతకమ్ వంటి గ్రంథాలను రచించారు. వీటిలో మాతృగీతమ్, సంస్కృత వైజయంతీ తప్ప మిగతావి తెలుగునుండి అనువదించిన సంస్కృత గ్రంథాలు ఆచార్య సి. నారాయణరెడ్డిగారి తెలుగు ప్రపంచపదులకు సంస్కృతానువాదం. ఈ అనువాదానికి కేంద్ర సాహిత్య అకాడమీవారి అవార్డు 2007లో లభించింది. ఢిల్లీ విశ్వవిద్యాలయం సంస్కృత విభాగంలో దీనిని పాఠ్యగ్రంథంగా నిర్ణయించడం విశేషం.

ఈవిధంగా తెలుగు, సంస్కృత భాషలలో విశేషమైన సేవ చేసి, ఒక సంస్థ చేయవలసిన పనిని ఒక వ్యక్తి మాత్రమే చేసి తనకంటూ ఒక ప్రత్యేకతను నిలుపుకొన్న నిలువెత్తు సాహితీమూర్తి మరణం తెలుగు, సంస్కృత భాషలకు, ఉభయ తెలుగు రాష్ట్రాలకే కాకుండా జాతీయ స్థాయిలో కూడా సాహిత్యానికి తీరని లోటు.... వారికివే అక్షరాంజలులు.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8 12 హైదరాబాద్ జూన్ : 2023

# ఆత్మీయాం మతిమాదాయ కురు సజ్జన రంజనమ్

**ఆచార్య కె. నీలకంఠం,** ఫోన్ : 98660 38754

నిరంతరాధ్యయన, అనుశీలన తత్పరులు, విద్యా వినయ సంపన్నులు ఆత్మీయతకు ప్రతిరూపం ఆచార్య రవ్వా శ్రీహరి మహాశయులు. అది 1980వ సంవత్సరం. నేను యం.ఏ., సంస్కృతం మొదటి సంవత్సరంలో ఉన్నాను. అస్మద్ గురుచరణులు మహామహోపాధ్యాయ పద్మశ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడుగారు సురభారతి సమితికి ప్రధాన కార్యదర్శిగా, మహామహోపాధ్యాయ ఆచార్య రవ్వా శ్రీహరిగారు సహాయ కార్యదర్శిగా ఉన్న రోజులు. మా గురువుగారు శ్రీ రవ్వా శ్రీహరిగారిని మాకు పరిచయం చేస్తూ మాకు చెప్పిన మాటలు మరిచిపోలేనవి. **"శాస్త్రాధ్యయనం, గురువుల యందు అచంచలమైన విశ్వాసం, శ్రద్ధ, భక్తి"** – ఇవి రవ్వా శ్రీహరి ఆభూషణములు. చదువులో, సంశోధనంలో ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలి అని చెప్పిన గురువుగారి మాటలు ఎప్పుడూ గుర్తుకు వస్తూనే ఉంటాయి. రవ్వా శ్రీహరిగారు ఆదిలో సంస్కృతం అభ్యసించినా దానితోపాటు తెలుగు భాషా సాహిత్యాలపైన వారు సాధించిన పట్టు అసామాన్యం, అతుల్యం కూడ. అందుకే తెలుగు – సంస్కృత వాఙ్మయాలలో వారు రారాజుగా నిలిచారు. మా గురువుల ఆచార్య పి.జి. లాలే, ఆచార్య ముదిగంటి గోపాలరెడ్డి, ఆచార్య కప్పగంతుల కమలమ్మ ఇత్యాదులందరికీ అత్యంతాప్తులు శ్రీ రవ్వా శ్రీహరిగారు. సురభారతి సాహిత్య సభలలో వారు సంస్కృతంలో అనర్గళంగా, మధురంగా మాట్లాడుతున్నప్పుడు విని జీవితంలో ఎప్పుడైన రవ్వా శ్రీహరిగారిలాగా సంస్కృతంలో మాట్లాడాలి అనిపించేది. అనిపించడమే కాదు నేను స్వచ్ఛమైన సంస్కృతంలో ఈరోజు మాట్లాడుతున్నానంటే నాకు ఆదర్శం ఆచార్య రవ్వా శ్రీహరిగారే అనటంలో ఏమాత్రం సందేహం లేదు. కాశికావృత్తిని ఆధారంగా జేసుకొని వారు రచించిన తెలుగు వ్యాఖ్యానాన్ని చదివి నా అభిప్రాయం తెలుపమన్నప్పుడు నేను ఎంత పులకించిపోయానో మాటల్లో చెప్పలేను. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం వారి తరపున పురాణాల తెలుగు అనువాదంలో మత్స్యపురాణపు ఉత్తరార్ధానికి అనువాదం చేసే అవకాశం నాకు కల్పించడానికి ముఖ్యకారణం వారే.

కావ్యనాటకాలలో, సాహిత్య శాస్త్ర గ్రంథాలలో, వ్యాకరణంలో కూడ అత్యంతాధిపత్యం కలిగినవారైనా ఆచార్యులు కొన్నిసార్లు చాలా చిన్న వాళ్ళమైన మమ్మల్ని ముఖ్యంగా నాతో చరవాణి ద్వారా అనేక విషయాలు ప్రస్తావించేవారు. దానికి కారణం కేవలం మమ్మల్ని అధ్యయనోన్ముఖులను చేయడానికి అనుటలో ఏ మాత్రం సందేహం లేదు. నానాటికి సంస్కృతం తెలుగు సాహిత్యాలను పట్టుదలతో అధ్యయనం చేసేవారు తగ్గిపోతున్నారని, వాటిని మనం సంరక్షించుటకు యత్నించాలని, విద్యార్థులను కొంతమందినైనా మనం తయారు చెయ్యాలని వారు తపన పడేవారు.

జీవనంలో అత్యంత ఆప్యాయంగా, అంత అభిమానంగా, అంత మర్యాదగా పలుకరించే మహానుభావుణ్ణి చూడలేదంటే అతిశయోక్తి కాదు. **"ఆత్మీయాం మతిమాదాయ కురు సజ్జనరంజనమ్"** అను ఆభాణకానికి ఉదాహరనం ఆచార్య రవ్వా శ్రీహరిగారు. చక్కని విశేషణాలతో కూడిన సుమధుర సంస్కృత భాష ఎప్పుడూ చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. వారి సంస్కృత రచనలు, అనువాదాలపైన నా శిష్యురాలు అహల్యతో పిహెచ్.డి., కొరకు పరిశోధన చేయించే భాగ్యం కలిగింది నాకు. ఈ విషయం వారికి చెప్పినప్పుడు వారికి కలిగిన ఆనందం వర్ణనాతీతం. తదర్థమై ఆ అమ్మాయికి నాకు కూడ వారిచ్చిన ప్రోత్సాహం అనిర్వచనీయమ్..

**జయన్తి తే సుకృతిన: రససిద్ధా: కవీశ్వరా: ।**
**నాస్తి తేషాం యశ:కాయే జరామరణజం భయమ్॥**






ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8 13 హైదరాబాద్ జూన్ : 2023

# శ్రీహరి కవి వరేణ్యుల సంస్కృత సాహితీ సౌరభం

**డా. కూరెళ్ళ అహల్య,** ఫోన్ : 807 479 7024




ప్రాచీనం నుండి అర్వాచీనం వరకు ఆటంకం ఎరుగని గీర్వాణ వాఙ్మయ సాగరంలో ఉద్భవించిన సంస్కృత కవి కల్పతరువు ఆచార్య రవ్వా శ్రీహరిగారు. వీరు భాషాశాస్త్రవేత్త, వ్యాకరణ సార్వభౌముడు, ఆధునిక తెలుగు నిఘంటు సృష్టికర్త.

వీరు 07.09.1943వ తేదీన అప్పటి నల్లగొండ జిల్లా మునిపంపుల గ్రామంలో తన అమ్మమ్మ గారింట్లో శ్రీమతి రవ్వా వెంకటనరసమ్మ, శ్రీ రవ్వా వెంకటనరసయ్య పుణ్యదంపతుల శుక్తిలో జన్మించిన అమూల్య మౌక్తికం. వీరి స్వగ్రామం ఇప్పటి యాదాద్రి జిల్లా, వలిగొండ మండలంలోని వెల్వర్తి గ్రామం. ప్రస్తుతం వీరి నివాస గృహం హైద్రాబాద్ మలక్‌పేట లోని జడ్జెస్ కాలనీలో ఉంది. వీరు మహామహోపాధ్యాయులు. కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యాపకులుగా, తిరుమల తిరుపతి దేవస్థాన భక్తికావ్య ప్రచురణల విభాగానికి సలహాదారుగా, సంపాదకులుగా (2011), సెంట్రల్ యూనివర్సిటీలో తెలుగు అధ్యాపకులుగా, శాఖాధ్యక్షులుగా వేరు వేరు హోదాలలో పనిచేశారు. శ్రీహరి గారు ఉత్తమ పండితులు, కవివరేణ్యులు, పరిపాలనావేత్త. అన్నిటినీ మించి మెత్తని మనసు కలిగిన, మంచితనం మూర్తీభవించిన మహామనీషి, వాత్సల్యానికి నిండైన రూపం.




ఆచార్య రవ్వా శ్రీహరి గారి **'సంస్కృత సాహిత్య సేవ మరియు సంస్కృత భాషా సేవ'** (Contribution of Prof. Ravva Srihari to Sanskrit Language and Literature) అనే అంశం మీద నాకు పిహెచ్.డి. చేసే మహద్భాగ్యాన్ని నా పూజ్య గురుదేవులు, సంస్కృత అకాడమీ నిర్దేశకులు ఆచార్య నీలకంఠం మహోదయులు కల్పించారు. వారికి శతథా, సర్వదా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆ తరుణంలో శ్రీహరిగారితో నా అనుబంధం తండ్రీకూతుళ్ళ వలె అలరారింది. పరిశోధనలో వీరిని సంప్రదించినప్పుడు సంశయించ కుండా అనురాగం తరగకుండా వీరు నాకు అందించిన సహాయం అమూల్యం, అవర్ణనీయం. పిహెచ్.డి. పూర్తయిన శుభవార్తను విన్నవించినప్పుడు వీరి స్థితప్రజ్ఞతకు విస్మయం చెందాను. వారు నన్ను ఆనందంగా ఆశీర్వదించగా వారి వాత్సల్యానికి అవధులు లేవని తెలుసుకున్నాను. అటువంటి మహనీయులైన ఆచార్య రవ్వా శ్రీహరి కవివరేణ్యుల సంస్కృత సాహితీ సరోవరంలో జనించిన వికసితరచనాదళములు గల నళినసుమసౌరభం సుజనులకు సర్వదా ఆఘ్రాణ యోగ్యం. ఆ సౌరభ వైశిష్ట్యాన్ని స్థాలీపులాకన్యాయంగా ఇక్కడ దర్శిద్దాం.




శ్రీహరి గారు సంస్కృత సాహిత్య సూత్రంతో అందంగా అల్లిన తెలుగు సాహిత్యపు పూలమాల తెలుగుతల్లి మెడలో మరియు గీర్వాణ వాణీ కంఠంలో వెలుగొందు హారాల హేల. వీరు ఉభయ భాషలలో సుమారు ముప్పది గ్రంథాలను రచించారు. సంస్కృత భాషలో దశాధిక గ్రంథాలను రచించారు.

సంస్కృతాత్మను తెలుగుదేహంలో నిలిపి, జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని తెలుపుటకా! అన్నట్లు కొన్ని తెలుగు కావ్యాలను, గ్రంథాలను సంస్కృతంలోనికి అనువదించారు. ఈ అనువాద కావ్యాలను ఆస్వాదిస్తే తెలుగు సంస్కృతాల అభేదం అనే అద్వైతం బోధపడుతుంది. వీరి సంస్కృత సాహిత్యంలో అనువాద కావ్యాలు వీరి ప్రతిభకు తార్కాణాలు. అనువాద ప్రక్రియా నియమాలను పాటిస్తూ, స్వీయ ప్రతిభను ప్రదర్శిస్తూ అనువాద గ్రంథాలను రచించి శ్రీహరి గారు అనువాదకులలో అసమానులైనారు.

**శ్రీహరిగారి సంస్కృత కృతులు**

1. లఘుసిద్ధాంత కౌముది 2. సంస్కృత సూక్తిరత్నాకరము 3. సంస్కృత న్యాయదీపికా 4. ఫిరదౌసి తెలుగు నుండి సంస్కృతంలోనికి అనువాదం 5. తైలపాయికా - తెలుగు నుండి

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8 14 హైదరాబాద్ జూన్ : 2023




సంస్కృతంలోనికి అనువాదం 6. ప్రపంచపదీ – తెలుగు నుండి సంస్కృతంలోనికి అనువాదం 7. అన్నమాచార్య సూక్తిసుధా 8. సంస్కృత వైజయంతీ 9. వేమన శతకం తెలుగు నుండి సంస్కృతంలోనికి అనువాదం 10. ధర్మపురి నరసింహ శతకం – తెలుగు నుండి సంస్కృతంలోనికి అనువాదం 11. అన్నమయ్య సుభాషితాని 12. పాణినీయ అష్టాధ్యాయి 13. మాతృగీతం – స్వీయ సంస్కృత రచన

గుఱ్ఱం జాషువా గారి కవిత్వం నాకు అత్యంత ఇష్టమైనది. కావుననే వారి తెలుగు కావ్యాలైన ఫిరదౌసి, గబ్బిలం లను సంస్కృతంలోనికి అనువదించాను అని స్వయంగా చెప్పుకున్నారు శ్రీహరిగారు. 2000 సం.లో ఫిరదౌసిని వీరు సంస్కృతానువాదం చేశారు. తెలుగు కావ్యంలో ఉన్న పద్యాలు ఏ ఛందస్సులో ఉంటే, సంస్కృతం కూడా అదే ఛందస్సులో వ్రాశారు. కానీ కొన్నిచోట్ల భావగాంభీర్యత కోసం ఛందస్సును మార్చడం జరిగింది శ్రీహరికవి. అది వారి ఉభయ భాషాప్రావీణ్యానికి నిదర్శనం.

ఉదాహరణకు, తెలుగు పద్యం

**"భూతపంచకమున ముగ్గి తేలుచునున్న**
**నీ యనంతశక్తి నిశ్చయముగ**
**నాకుఁ బట్టుగొమ్మ నా వజ్రకవచమ్ము**
**సిలుగు లేమి చేయగలవు నన్ను?"**

ఆటవెలది ఛందస్సులో ఉన్న ఆ తెలుగు పద్యాన్ని అదే ఛందస్సులో సంస్కృతంలోనికి ఎంత అందంగా అనువదించారో చూడండి. సంస్కృత శ్లోకం..

**"భూతపంచకే తు లీనా ప్లుతా చ తే**
**మహితశక్తిరేవ నిశ్చయేన ।**
**మమ చ సదవలమ్బ ఇహ వజ్రకవచం చ**
**కుర్వతే చ మాం కిమాపదో నుః।"**

అందులో సుల్తాను చక్రవర్తి తన స్వీయ చరిత్రను కావ్యంగా వ్రాయమని చెప్పి అందుకుగాను కవి అయిన ఫిరదౌసికి 60 బంగారు నాణాలు బహూకరిస్తానని చెప్పాడు.

30 సం॥లు శ్రమించి 60 వేల పద్యాలతో 'షానామా' అను పేరుతో కావ్యం పూర్తయిన పిమ్మట సుల్తాన్ చక్రవర్తి ఫిరదౌసికి 60 వేల వెండి నాణాలు ఇస్తాడు. ఆశలు అడియాశలై, ఆనందం ఆవిరై, గుండె పగిలి ఫిరదౌసి మరణిస్తాడు. ఆ కావ్యం చదువుతున్నంత సేపు పాఠకుని కళ్ళు చెమ్మగిల్లుతాయి. తెలుగుకావ్యంలో ఉన్నటువంటి ఆర్ద్రతను కొంచెం కూడా తడారకుండా సంస్కృతంలోనికి అనువాదం చేశారు. ఉదాహరణకు, తెలుగు పద్యం..

**"అల్లా తోడని పల్కి నాపసిడి కావ్యద్రవ్యమున్ వెండితో**
**జెల్లింపన్ దొరకొన్న టక్కరివి, నీచేబూఁజితుండైనచో**
**నల్లాకున్ సుఖమే? మహమ్మదునృపాలా! సత్యవాక్యంబెవం**
**డుల్లంఘింపఁడొ వాఁడె పో నరుఁడు ధన్యుండిద్ధరామండలిన్"**

సంస్కృతానువాదం...

**"అల్లాసాక్షికమభ్యుపేత్య కవితాసుద్రవ్యముత్సేకతో**
**దాతుం, రాజతనాణకైరథ సమాయాతోసి శాఠ్యేన మే**
**అల్లా తుష్యతవార్చయా తవ మహీపాలాతిమాయిన్న హే**
**యః సత్యం న తు లంఘతే స తు నరః సత్యం ధరామణ్డలే"**

అలాగే సంస్కృతంలో మహాకవి కాళిదాసు రచించిన 'మేఘ సందేశము'ను దృష్టిలో పెట్టుకొని జాషువాగారు 'గబ్బిలం' కావ్యాన్ని రచించారు. ఆనాటి సమాజంలో తాను అనుభవించిన సాంఘిక అసమానతా వేదనను, అరుంధతీసుతుడైన తన క్షుధాగ్నిని ఆ మహాశివునికి చేరవేయుమని పాడుబడిన శివాలయంలో ఉన్న, మనుష్యులు కనీసం చూడడానికి కూడా ఇష్టపడని, అపశకునంగా భావించే గబ్బిలాన్ని నీవు నేను ఒకటే కోవకి చెందినవారము అని తన దూతగా, తనకు శుభశకునాలు తెమ్మని పంపుతారు జాషువా గారు. ఆ గబ్బిలం యొక్క వేదన తన మనసును ద్రవింపచేసిందని 2002 సం.లో **"తైలపాయికా"** అను పేరుతో సంస్కృతంలోనికి అనువదించారు శ్రీహరిగారు.

## ప్రపంచపదీ

'పంచపదులు' అనేది డా. సి. నారాయణరెడ్డి గారి తెలుగుకావ్యం. ఇందులో 5 పద్యపాదాలుంటాయి. దీనికి "ప్ర" అనే ఉపసర్గను చేర్చి "ప్రపంచపదీ" అని 1997లో శ్రీహరిగారు సంస్కృతంలోనికి అనువదించారు. ఈ అనువాదానికి శ్రీహరి కవిని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వరించింది.

ప్రపంచపదులు ప్రక్రియ అత్యంత క్లిష్టమైంది. మొదటి, రెండవ మరియు నాలుగు, ఐదవ పాదాలు మధ్యలోని మూడవ పాదంతో

సమన్వయం చేయబడుతాయి. ఈ మూడవ పాదం విచిత్రమైనది. అంత్యప్రాస, అంతఃప్రాసలు లేకుండా, నిరలంకారంగా ఉంటుంది. తెలుగుకావ్యంలో ఉన్నటువంటి దృష్టాంత నిరూపణ, గేయలక్షణ ప్రతిపాదనం, భావవైచిత్రి ప్రకటనం నన్ను ఈ కావ్యాన్ని సంస్కృతంలోనికి అనువదించేలా చేశాయి అన్నారు శ్రీహరిగారు.




ఉదాహరణకు ఒక తెలుగు పద్యం –



**"ఎన్నిమెట్లు ఎక్కావని కాదు ఎంత యెత్తుకెదిగావనీ**
**ఎన్ని మునకలేశావని కాదు ఎంత లోతు చూశావనీ**
**గమనం సార్థకమవుతుంది నీ గమ్యాన్ని చేరినప్పుడే**
**ఎన్నిసభలు తిరిగావని కాదు ఎంత బుద్ధి పెంచావనీ**
**ఎన్ని కృతులు చదివావని కాదు ఎంత సిద్ధి పొందావనీ"**

సంస్కృతానువాదం...

**"కియద్దూరం చలితవానితి శ్రమమనన్తం ప్రాప్తవానసి?**
**జీవితం బహుదీర్ఘమితి కిన్వసహభావం ప్రాప్తవానసి?**
**సాగరాఙ్చలదర్శనాంతా పరా నిష్ఠా తేస్తి కిం?**
**ఉష్ణరక్తం కింను నష్టం దహనభీతిం ప్రాప్తవానసి?**
**పౌరుషం తే కిం వినష్టం తుహినభీతిం ప్రాప్తవానసి?"**




## సంస్కృత వైజయంతీ

సంస్కృత వైజయంతీ గ్రంథ గంధం సంస్కృతజ్ఞుల మనసులకు ధన్యతను చేకూర్చుతుంది. ఈ గ్రంథం శ్రీహరిగారి సంస్కృత భాషాప్రావీణ్యానికి దర్పణం.

**మాతృగీతం** : 'మాతృగీతం' శ్రీహరిగారి స్వంత రచన లఘుకావ్యం. ఇందులో మాతృవియోగ దుఃఖితులైన ఈ కవివరులు తన తల్లిని దేవతారూపంగా స్తుతించారు. మాతృమహిమను వర్ణించారు. సమాజంలో ప్రబలుతున్న దుర్జనుల వైఖరిని తన మాతృదేవతకు విన్నవించారు. తన ఆవేదనను తల్లికిగాక మరెవరికి తెలుపుకుంటారు? సంస్కృత సాహిత్యంలో తల్లి ప్రాధాన్యత గల ప్రసిద్ధ కావ్యాలు లేవు. మాతృగీతమే ఆ కావ్యాలకు మాతృకావ్యం అవుతుంది. తల్లికి మొదటి ప్రాధాన్యతనిచ్చింది తైత్తిరీయోపనిషత్తు. ఆ ఉపనిషద్బోధను మాతృగీతం రచన ద్వారా ఆచరించారు శ్రీహరి గారు.

ఈ మాతృగీతం అనే లఘుకావ్యాన్ని మన తెలంగాణ రాష్ట్ర Board of Intermediate Studies II Languages సంస్కృతంలో పాఠ్యాంశంగా పెట్టి, ఈ కవికి గౌరవం ఇచ్చారు తెలుగు అకాడమీ వారు.




సాహిత్యానికి భాషా పాటవం, భావ ప్రభావం రెండూ ముఖ్యం. ఆ రెండూ శ్రీహరి గారి సంస్కృత సాహిత్యంలో అణువణువునా తొణికిసలాడతాయి.

సమాజంలో ఉన్నటువంటి అనేక బాధాకరమైనటువంటి విషయాలను తన తల్లికి నివేదించారు. ఉదాహరణగా ఒక పద్యం–

**"యావత్ ప్రోజ్ఝితభోజన పత్రేషు**
**బుభుక్షితైః పులకాన్ని**
**మృగ్యంతే దీనజనైః**
**తావన్న జనని పురోగతో దేశః"**





అంటే –

“ఏ దేశంలోనైతే ఎంగిలి విస్తర్లలోని మిగిలిన భోజనం తినే దీన జనులు కనబడతారో ఆ దేశం అభివృద్ధి చెందిన దేశం కానేకాదు” అని.

“ప్రథమే విద్వాంసః వైయాకరణాః” అని ఆర్యోక్తి.

ఆ ఆర్యోక్తికి అనుగుణంగా మరియు గురుఋణం నుండి విముక్తి చెందుటకా! అన్నట్లు **“పాణినీయ అష్టాధ్యాయి”**ని తెలుగులో సులభగ్రాహ్యంగా వివరించారు శ్రీహరి గారు. ఇది బృహత్తర గ్రంథం. ఈ మహామహోపాధ్యాయుని ప్రతిభకు నిదర్శనం ఈ గ్రంథం.

**వేమన శతకం :** వేమన శతకం తెలుగువారి జీవనవేదం. దీనిని సంస్కృతజ్ఞులకు అందించడానికి శ్రీహరిగారి ప్రయత్నం సంస్కృతానువాదం. సంస్కృత భాషలో కూడా వేమన శతకం ఉందని చాలామందికి తెలియదు.

తెలుగులో 100 పద్యాలతో విరాజిల్లే వేమనశతకాన్ని, అనేక వేమన గ్రంథాలను శోధించి అదనంగా 50 పద్యాలను సేకరించి 2009సం.లో శ్రీహరిగారు 150 పద్యాలతో సంస్కృతంలోనికి అనువదించారు. అందులో నుండి పద్యమొకటి ఉదాహరణకు –

తెలుగు పద్యం

**చిప్పబడు స్వాతిచినుకు ముత్యంబాయే**
**నీటబడు చినుకు నీటగలిసె**
**ప్రాప్తి కలుగుచోట ఫలమేల తప్పురా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

దీనికి సంస్కృతానువాదం

**“శుక్తి పతిత బిందురిహ భవేన్మౌక్తికం**
**నీరపతితమేవ లీయతే అత్ర**
**ఫలతి ఖలు చ కర్మ ప్రాప్తావవశ్యం తు**
**విశ్వదాభిరామ విద్ధివేమ!”**

**ధర్మపురి నరసింహశతకం :** తన పదకొండేళ్ళ వయసులో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి విద్యాపీఠంలో విద్యనభ్యసించి నటువంటి శ్రీహరిగారు ఆ లక్ష్మీనృసింహుని కృపాభిక్షవల్లనే రామశబ్దం మొదలు మహాభాష్యపర్యంతం చదువుకునే భాగ్యం కలిగిందని, ఆ స్వామిపట్ల కృతజ్ఞతతో శేషప్పకవి రచించిన నరసింహ శతకాన్ని సంస్కృతంలోనికి అనువదించానని చెప్పుకున్నారు.

**శ్రీహరి కవిని వరించిన పురస్కారాలు**

1. కేంద్రీయ సాహిత్య అకాడమీ పురస్కారం – కేంద్రీయ సాహిత్య అకాడమీ – 2001
2. శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారి – సువర్ణ కంకణ పురస్కారం – 2003
3. విశాఖపట్టణం సనాతనధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ వారి – శివానంద ఎమినెంట్ సిటిజన్ పురస్కారం – 2004
4. డా. భూతపురి సుబ్రహ్మణ్యశర్మ సాహిత్య పురస్కారం – 2007
5. ఇరివెంటి పురస్కారం – యువభారతి – హైద్రాబాద్ – 2008
6. గిడుగు రామమూర్తి స్మారక తెలుగు భాషా పురస్కారం – 2014

ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో పురస్కారాలు. నా పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథంలో 27 పురస్కారాలను వ్రాశాను.

తెలుగు–సంస్కృత ఉభయ భాషా కవిశేఖరుడైనటువంటి ఆచార్య శ్రీహరి గారికి “పద్మశ్రీ” బాకీ ఉంది. సాహితీశ్రేష్ఠులు, కవులు, వారితో సఖ్యత గడిపిన సమకాలీనులు ఆ దిశగా ప్రయత్నించాలని కోరుతూ, శ్రీహరి గారి రచనలను ఆసాంతం చదివిన అనుభవ భాగ్యం కలిగిన ధైర్యంతో వారికి “పద్మశ్రీ అవార్డు అత్యావశ్యకం అని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు నా విన్నపం. భగవంతుని సన్నిధికి చేరినపుడే కదా పూవు పుట్టుకకు సార్థకత. అట్లాగే ఈ శ్రీహరిని చేరినపుడే కదా ఆ ‘పద్మశ్రీ’కి మరింత శోభ!

శ్రీహరి గారి సాహిత్యం మాతృభక్తి, దైవభక్తి, సూక్తి, వ్యాకరణం, ప్రపంచ జ్ఞానం, దుష్టజన విమర్శ, శిష్టజన ప్రశంస వంటి అమూల్య రత్నాలకు ఆకరం.

శ్రీహరి గారు తమ సంస్కృత సాహితీ సౌరభాన్ని సురులకు కూడా అందించడానికి శ్రీ శోభకృత్ వైశాఖ శుద్ధ పాడ్యమి (21-04-2023) రాత్రి 9 గంటలకు దేహత్యాగం చేసి, సురలోకానికి చేరుకున్నారు. వీరు మృతులుకాదు, దివంగతులు (స్వర్గానికి వెళ్ళినవారు). వీరు నా పిహెచ్.డి. సిద్ధాంతరూపంలో చిరంజీవులు.

**మానస సంచరరే ... శ్రీహరౌ సదా మమ మానస సంచరరే...!**

**“జయతు సంస్కృతం, జయతు శ్రీహరి కవిత్వం.”**

# మన నాటి పతంజలి

**డా. శ్రీరంగాచార్య,** ఫోన్ : 929 945 1266




చాలాకాలం నాటి సంగతి. దాదాపు 1961 కావచ్చు. మా నాయనగారు శ్రీమాన్ రాఘవాచార్యులవారు ఏదో పనిపై 'అక్కినేపల్లి' గ్రామానికి వెళ్లి తిరుగు ప్రయాణం బండిలో వస్తున్నారు. మార్గమధ్యంలో ఒక బాలుడు – చేతిలో సంచి – కొన్ని పుస్తకాలతో తమ బండి వెనక వస్తుంటే చూచి, కొంతసేపయింతర్వాత ఇట్లా అడిగినారు. అబ్బాయీ మీదేవూరు? మాది 'అమ్మనబ్రోలండీ'. నీవు ఎటు పోవాలె? – నార్కెట్‌పల్లికి చేరి బస్సులో పట్నం పోవాలండీ – అక్కడ నువ్వు ఏం చేస్తావు? నేను సంస్కృత కాలేజీలో సంస్కృతం చదువుతున్నానండీ' అని చెబితే మా నాయనగారు ఆశ్చర్యపడి ఇంత చిన్న వయస్సులో నీవు సంస్కృతం చదువుతున్నావా? అంటూ అమరకోశంలోని 'బుద్ధి' నామాలు చెప్పు అనగానే – బుద్ధిర్మనీషా ధిషణా...' ఇత్యాది శ్లోకాన్ని దోషరహితంగా స్వచ్ఛంగా చెబితే ఎంతో ఆనందపడి కొన్ని కావ్యాలలోని శ్లోకాలు మొదలైనవాటి చర్చతో బాట సాగుతుంటే, 'బాబూ బండ్లో కూర్చో' అంటే సవినయంగా 'వద్దు' అని వెంట నడుస్తూనే ఉన్న ఆ బాలునితో మా నాయనగారు 'బల్దా (హైద్రాబాదు)లో మా అబ్బాయి సంస్కృతం చదువుతున్నాడు. ఆయన పేరు లక్ష్మణమూర్తి నీకు తెలుసా?' అని అడిగినారు. అయ్యా అయ్యగారూ! నేను వారిని బాగా ఎరుగుదును. మేము మున్నాలాల్ కాలేజీలో కలిసియున్నాం. చదువుకున్నాం. ఇప్పుడు వారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సంస్కృతం ఎం.ఏ., చేస్తున్నారు. వారు నాకు గురుతుల్యులు అని పల్కి – మీరు వారి పితృపాదులైనందుకు తమ దర్శనం వల్ల పునీతుడనైనాను అని బండిలో కూర్చున్న మా నాయన గారికి పాదాభివందనం చేసి, ఆయన నార్కెటుపల్లి చేరి, హైద్రాబాదు బస్సెక్కితే, మా నాయనగారు నకరెకల్లు వైపు వెళ్లే బస్సులో బయలుదేరినారు.




ఇది వారి ప్రప్రథమ పరిచయం. కావ్యశాస్త్ర వినోదంగా గడిచింది. ఈ సంగతులను ఎన్నోసార్లు శ్రీహరిగారు ఒక విశేషంగా చెప్పేవారు. ఈ పరిచయం మా నాయనగారు నగరంలో వున్న 1981 సంవత్సరం దాకా కొనసాగి, మా నాయనగారి ఎన్నెన్నో శాబ్దిక సంశయ నివారణలకుపయోగపడింది. మా శ్రీహరిని వారెప్పుడూ 'విద్యాతపస్వి' అనేవారు. తాము పనిచేసే జగదీశ మందిర దేవాలయానికి వస్తే 'భోజనం చేయనిది ఈయనను పోనిచ్చేవారు కాదు'. 'విద్యయా వినయం యాతి...' శ్లోకం మన శ్రీహరికి చక్కగా వర్తిస్తున్నదని మాకు వివరించేవారు. ఎవరు విద్యావంతులో వారిని గౌరవించడం మా పితృపాదుల గుణం. వారు జీవించినంతకాలం (1995 దాకా) శ్రీహరి పురోభివృద్ధిని, సాహిత్య జీవితాన్ని గూర్చి గొప్పగా భావిస్తుండేవారు. ఇట్లానే – తన జీవితంలో శ్రీహరిగారు, సురవరం ప్రతాపరెడ్డి గారు, కప్పగంతులవారు, వెంకటరెడ్డిగారు మొదలైన పెద్దల జిహ్వాగ్రంలో వున్నట్టే, తన జీవన నిర్మాతలైన గురువులు, సీతారాంబాగ్ కళాశాలలోని ప్రిన్సిపాల్ శఠకోప రామానుజాచార్య, అమరవాది కృష్ణమాచార్య, ఖండవల్లి నరసింహశాస్త్రి వర్యులను ఆయన వ్యాకరణ శాస్త్ర మునిత్రయంగా భావించినట్లే – మరింగంటి శ్రీరంగాచార్య, సముద్రాల శ్రీనివాసాచార్య, వంగీపురం రామానుజాచార్య ప్ర.భ.వేదాంతాచార్య ప్రభృతులను విజ్ఞాన మహావృక్షాలనేవాడు. ఇది ఆయన వినయానికొక నిదర్శనం.




శ్రీహరిగారు వేదాంతవర్ధినీ కళాశాల విద్యార్థిగా వున్న సమయంలో నేనా కళాశాల విద్యార్థిగా చేరినాను. ప్రథమంగా నాకు శ్రీహరిగారితో పరిచయం – మా అన్నయ్య లక్ష్మణమూర్తి, భాగవతం రామారావుగార్ల ద్వారా సంభవించింది. ఒకప్పుడు సికిందరాబాదులోని మున్నాలాల్ సంస్కృత పాఠశాలలో ఈ ముగ్గురూ సహాధ్యాయులు కావటం ఒక విశేషం. అక్కడి విద్యా విశేషాలు పఠన – పాఠనాదుల గూర్చి కేరళ సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, శాస్త్రుల విశ్వనాథ శాస్త్రిగారు, అళహ సింగరాచార్య ప్రభృతి గురువరుల శిక్షా విధానాన్ని కమనీయంగా తెల్పటం శ్రీహరిగారికే చెల్లింది. ఎందుకంటే

ఆయన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన పాఠశాలలో సంస్కృత పాఠశాలలో వుండటం వలన ఆనాడే వీరికి **'గురు శు శ్రూషయా విద్యా'** వర్తించింది. ఎట్లా ధనం లేనివాడు కాబట్టి, తర్వాత **'అధనా విద్యయా విద్యా'** అనేది సార్థకమయింది. గురువుల వలన సంస్కృతం, లక్ష్మణమూర్తిగారి ద్వారా ఇంగ్లీషు, భాగవతం వారి వలన తెలుగు ఛందస్సు, ప్రబంధ పఠనం అలవడింది. ఇది శ్రీహరి గారి ప్రాథమిక శైష్యోపాధ్యాయిక.

విద్యారంగంలో అభివృద్ధి చెందుతున్న శ్రీహరి తెలుగు, సంస్కృత ఎం.ఏ.,లలో సువర్ణ పతకముల గ్రహీత. మొదట సంస్కృతంలో పిహెచ్.డి. చేయదలచి బి.ఆర్.శాస్త్రిగారి పర్యవేక్షణలో **'అగస్త్య పండితుని కృతుల'** గూర్చి పరిశోధన చేయటానికుద్యుక్తుడైనాడు. కారణం ఏమంటే అగస్త్య పండితుడు చతుస్సప్తతి (74) కావ్యకర్త. ఎందుకోగాని దీన్ని వదిలి రామరాజుగారి ఉపదేశంతో తెలుగులోని **'భాస్కర రామాయణం'** గూర్చి పరిశోధన చేసి 1981లో పిహెచ్.డి పొందినాడు. ఈయన పరిశోధన **'బహు పాఠాంతర విపుల విషయ వివేచనాత్మకం'**గా సాగి నేటికీ ప్రామాణికంగా నిలిచినది. ఒక్కొక్క వ్యక్తి జీవితం సాహిత్యంలో పడి ఒకరకంగా మారుతుంది గదా!

ఆచార్య రవ్వా శ్రీహరిగారి ప్రప్రథమ సంస్కృత అనువాద రచన శ్రీ కాళహస్తీశ్వర శతకంలోని కొన్ని శ్లోకరూపాలు. ఇవి ఆనాడు ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృతశాఖ వారి 'జయంతి' పత్రికలో వచ్చి 17 సంవత్సరాల ప్రాయంగల శ్రీహరికి ఎంతో సంతోష కారణమైనాయి. ఇది ఆయన సాహిత్య పరిశోధన కృషికి ఒక ముఖద్వారంగా భావించవచ్చు.

ఆయన వివేకవర్ధినీ ఉన్నత పాఠశాలలో తెనుగు పండితునిగా పనిచేసినప్పుడు మేము అంటే మా అన్నగారు, వేనరెడ్డి, వరవరరావు, ఈయన అన్న చినరాఘవరావు, ఇంకా మరికొందరం కలిసి స్వయంపాకుల వారుగా సహజీవనం కొనసాగించిన ఆ రోజులు మరుపురానివి. అప్పటి సంగతులన్నిటిని ఇటీవల నేను ప్రచురించిన 'జీవనపర్వం' అనే ఒక గ్రంథంలో వివరించినాను.

పరిషత్ ప్రాచ్యకళాశాల యందు పనిచేస్తున్న సమయంలో విద్యార్థుల ఉపయోగార్థం 'లఘు సిద్ధాంత కౌముది'ని తెలుగులో వివరిస్తే అది అందరికీ ఆదర్శ రచనగా సుబోధకంగా వుండి బాగా వ్యాప్తి చెంది, పలు ముద్రణలందటం ఆయనకొక సంతోషం. మొదటినుంచీ శబ్ద సాధుత్వాసాధుత్వ విషయ వివేచన గల శ్రీహరిగారు ప్రప్రథమంగా 1970వ సంవత్సరంలోసంకేత పదకోశం సిద్ధం చేసినాడు. ఇది 2002లో పునర్ముద్రణమయింది. దీన్ని సిద్ధం చేసేరోజుల్లో ఎక్కడెక్కడివో ఎన్నో పుస్తకాలను సేకరించి ఈయటం నాకో పనిగా వుండేది. ఇంకో విశేషమేమంటే తెలుగు వారికొక 'వ్యాకరణ పదకోశం' అవసరమని భావించిన తెలుగు ఎకాడమీవారు 1978లో మన శ్రీహరితో బాటు ప్రొ. బొడ్డుపల్లి పురుషోత్తంగారు సంపాదకులుగా ఒక బృహత్ కోశ నిర్మాణం చేస్తే దీనికి దువ్వూరి వెంకట రమణశాస్త్రిగారు బాగా సహకరించినారు. ఈ విశేషగ్రంథం తర్వాత చాలా ముద్రణములందింది. అట్లాగే **'నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం'** అనేది. వీరి ప్రతిభా విశేష రచన. దీనితో పాటు మన నిత్య వ్యవహారంలో మన భాషలోని అపశబ్దాలు, అపప్రయోగాల గూర్చిన ఒక నిఘంటువు వంటి రచన. ఇంకా ఎన్నెన్నో చిన్నా పెద్ద సంస్కృతాంధ్ర రచనలున్నా వీటన్నిటికీ **'హస్తిపదన్యాయంగా'** వున్న శ్రీహరి నిఘంటువు ఒక్క వ్యక్తి దాదాపు 12 సంవత్సరాలు శ్రమించి ప్రామాణికమైన సూర్యరాయ నిఘంటువుల్లో లేని, చేరని పదాలను దాదాపు 36 వేల దాకా సేకరించి తెనుగుజాతికందించిన ఒక బృహన్నిఘంటువు ఈ **'శ్రీహరి నిఘంటువు'**. ఇది ఆయన శబ్దరూప జీవికకొక పర్యాయంగా నిలుస్తుంది. తరువాత **'తాళ్లపాక వారి పద నిఘంటువు'** అత్యద్భుత కృషి. ఎందరెందరికో నిత్య వ్యవహారంలోని తాళ్లపాక వారి పద పదార్థ వివరణ పదకోశం.



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8

UGC Care List Approved Journal
హైదరాబాద్ జూన్ : 2023

వీటన్నిటినీ మించి తాను కుప్పం విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్గా పనిచేస్తున్నప్పుడు సంకల్పించి, వ్యాకరణశాస్త్రముని పరంపరాయత్త కృషిని వివరించే పనిగా అష్టాధ్యాయిని కాశికా వ్యాఖ్యతో అనువదించటం. ఆయన వ్యాకరణ విద్యా విశేష పరిశ్రమ కొక చిరంతన కీర్తి ఫలంగా భావింతాం. ఈ కృషి శ్రీహరి గారి వ్యాకరణ శాస్త్రమునిత్రయం తనకు విద్యా విషయక వ్యాకరణాచార్య పరంపర విద్యారుణ విమోచన తప:ఫలంగా నిలుస్తుంది. అందుకే ఆనాడు అష్టాధ్యాయిని గూర్చి **"దర్భ పవిత్రాన్ని చేతికి ధరించి శుచియైన ప్రదేశంలో తూర్పుదిశగా కూర్చుని ఎంతో ప్రయత్న పూర్వకంగా పాణిని సూత్రనిర్మాణం చేసినాడు కావున ఆయన సూత్రాల్లో ఒక్కవర్ణం కూడా నిరర్ధకమైంది ఉండదు"** అని (శు చావవకాశే...' ఇత్యాది దీని మూలం).

శ్రీహరిగారు తి.తిదేవస్థానాల ప్రచురణ విభాగం డైరక్టర్ / (వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయ పీఠం బాధ్యతలు కూడా) పదవిలో ఎన్నో గ్రంథాలను సూర్యాలోక భాగ్యం కలిగేటట్టు చేయటంలో చాలా శ్రమించినారు. ఆ కాలంలోనే నేను మంచనకవి కేయూరబాహు చరిత్రను పరిష్కరించి విపులపీఠికతో ప్రకాశింపచేసే ఒక భాగ్యాన్ని పొందాను.

నిత్య సాహిత్య విద్యార్థిగా, సాహిత్యాన్ని ఒక యజనంగా భావించి అనేకానేక విషయాన్విత గ్రంథరచన చేస్తూ, ఉద్యోగ విధుల నిర్వహణలో కూడా ఏనాడూ తనకు 'అప' అనే ఉపసర్గ చేరకుండా పవిత్రంగా కాలం గడిపిన ఆచార్య శ్రీహరిగారు – 'మహామహోపాధ్యాయ' బిరుదాభిరాములు. ఇది వీరికన్వర్థమైంది. మహామహులైన ఉపాధ్యాయుల సన్నిధియందు విద్యాభ్యాసం చేయటమే గాక తన శిష్యవర్గాన్ని మహామహులుగా సిద్ధం చేసిన సంస్కృతాంధ్ర సాహితీ సవ్యసాచిగా సుప్రసిద్ధుడు కావటం. మన తెలంగాణ రాష్ట్రానికే గాదు యావత్ సాహిత్య ప్రపంచం ఆయన్ను విస్మరించదు కూడా. 'యావత్ స్థాప్యంతి గిరయ:' ఇత్యాది రామాయణ శ్లోకం మన శ్రీహరిగారికి,




వారి సాహిత్యానికి వర్తిస్తుందనటంలో సందేహం లేదు.

సుమారు 60 సంవత్సరాలకు మించి మేము పుష్పపరీమళ న్యాయంగా కలిసి వున్నాం. ఆయన ఏ పదవిలో వున్నా అదే చిర్నగవు, అదే పలకరింపు. మాకు ఎప్పుడూ ఈయనను చూస్తుంటే

**"అభివాదన శీలస్య నిత్యం వృద్ధోపసేవిన:**
**తస్య చత్వారి వర్ధంతే ఆయుర్విద్యా బలం యశ:"**

అనే శ్లోకం గుర్తుకు వస్తుండేది. మా కుటుంబాల్లోని అందరూ పరిచయం గాబట్టి కలిసిన ప్రతిసారీ వారి గూర్చి అడుగుతుండేవాడు. ఇది ఆయన స్నేహశీలం. శ్రీహరిగారు తన ప్రతి గ్రంథాన్ని మాకు చేర్చేవాడు. ఈ రచన కేవలం 'శ్రీహరిని గూర్చి మాత్రమే గాబట్టి కృతుల గూర్చిన పరిచయం చేయలేదు. శ్రీహరి **"నాస్తి తేషాం య: కాయే జరామరణజం భయమ్"** అనే శ్లోక సూక్తికన్వర్థంగా నిలుస్తాడు. ఆయన ఏ విశ్వవిద్యాలయంలోను విద్యార్థి జీవితం గడపలేదు. కాని ఒక విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సలరయినాడు. సంస్కృతంలో **'మహాభాష్యం వా పాఠయేత్ – మహారాజ్యం వా పాలయేత్'** అనే సూక్తి ప్రసిద్ధం. శ్రీహరిగారు మహాభాష్య పఠనశాంతి చేసి తన వ్యాకరణ (శబ్దశాస్త్ర) కృషి ద్వారా సాహితీ మహారాజ్య పాలకుడైనాడు.





ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2023

# ఆప్త మిత్రులు రవ్వా శ్రీహరి

**యోగాచార్య సుదర్శన రెడ్డి,** ఫోన్ : 994 999 7923





శ్రీశ్రీ సద్గురు శివానందమూర్తిగారు సికింద్రాబాద్‌లోని టివోలీ గార్డెన్‌లో ఆచార్య రవ్వాశ్రీహరిగారిని (ఇరవై రెండేళ్ల క్రితం) విశిష్ట సేవా పురస్కారంతో సత్కరించారు. ఆ సందర్భంగా 'రవ్వ' అంటే వజ్రమని విపులీకరించారు. అప్పుడు శ్రీహరిగారు హైద్రాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధిపతిగా, ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఆ తర్వాత ద్రావిడ విశ్వ విద్యాలయం వైస్‌ఛాన్సలర్‌గా పదోన్నతిని పొందారు. కొన్నాళ్ళకు సద్గురు శివానందమూర్తిగారితో పాటు రవ్వా శ్రీహరిగారికి, తిరుపతి సంస్కృత విశ్వ విద్యాలయంలో ఒకే వేదికపై **"మహామహోపాధ్యాయ"** బిరుద ప్రదానం జరిగింది. ఇదొక అరుదైన సన్మానమని నేను భావిస్తాను.

ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను పంచుకోవాలను కుంటున్నాను. జగ్గయ్యపేట కంటే ముందే బలుసుపాడు గ్రామం వస్తుంది. ఆ గ్రామ కరణం శ్రీరమణగారు శ్రీశ్రీ సద్గురు శివానందమూర్తిగారి శిష్యులు. గురువుగారి జ్ఞాపకార్థం శివానంద ఆశ్రమాన్ని నిర్మించి గురుదేవులచేతనే ప్రారంభింపజేశారు. అప్పుడు అశ్వరథంలో గురువుగారున్నారు. రథాన్ని శిష్యుడు రమణ నడుపుతున్నాడు. ఆశ్రమంలోని సభావేదికైన గురువుగారి విగ్రహాన్ని గురువుగారే ఆవిష్కరిస్తూ ఇలా అన్నారు. "నీవు శాశ్వతం నేను అశాశ్వతం" అని. సభా కార్యక్రమానంతరం రమణ దృష్టి రథంపైన, రథచక్రం ఇరుసుపైన పడింది. ఆశ్చర్యం! ఇరుసుకు ఉండాల్సిన మొల (చీల) లేదు. అద్భుతం, మహాద్భుతం! సద్గురు శివానందమూర్తిగారు చీలలేని రథంలో ప్రయాణించారు.

నూతనంగా నిర్మించిన ఈ శివానందాశ్రమంలో ఒక వారంరోజులు యోగ శిక్షణ నిచ్చే అవకాశం నాకు లభించింది. ఆ తర్వాత టివోలీ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో సభ అనంతరం వారి శిష్యులొకరు నన్ను గురువుగారికి పరిచయం చేసినప్పుడు నమస్కారం చేస్తున్న నా రెండు చేతులను తమ రెండు చేతులతో నిమురుతూ "చాలా సంతోషం! చాలా సంతోషం!" అని దీవించారు. ఆ స్పర్శ ఇప్పటికీ జ్ఞాపకముంది అది మెత్తని గులాబీ పూలస్పర్శ!

ఆచార్య రవ్వా శ్రీహరిగారు తనువు చాలించేనాటికి 79 సంవత్సరాలు. నాకు 84 సంవత్సరాలు. వయసులో మాత్రమే నేను కొంచెం ముందున్నాను. శ్రీహరిగారు జ్ఞానవృద్ధులు. నేను రచించిన 'యోగామృతం' , యోగచికిత్స, స్వీయచరిత్ర వంటి చిన్నా, పెద్ద 15 పుస్తకాలకన్నింటికి పీఠికలు వారివే. ఇది నా భాగ్యమే. 'స్వీయచరిత్ర' 2002లో వారికి అంకితం చేశాను. ఇప్పుడు ఆలోచిస్తుంటే మా మధ్య గల అనుబంధం తరతరాలదనిపిస్తుంది. గ్రామాలు ప్రక్క ప్రక్కనే. శ్రీహరిగారి మాతామహుల గ్రామం మునిపంపుల, నేను పుట్టిపెరిగిన గ్రామం ఇస్కిళ్ల (రామన్నపేట మండలం).

రవ్వా శ్రీహరిగారిని నాకు పరిచయం చేసిన మిత్రులు శాసనాల శాస్త్రిగా పేరు మోసిన శ్రీ బి.ఎన్.శాస్త్రిగారు. ఆచార్య లక్ష్మణాచార్యులు, ఆచార్య శ్రీరంగాచార్యులు. స్నేహమంటే ప్రాణమిచ్చేవారు. భీష్మ పితామహ నిర్వచించిన ధర్మాత్ముడు మొదలైన సుగుణాల రాశి రవ్వా శ్రీహరి. ప్రపంచ నాటకరంగం నుంచి విరమించుకొని స్నేహితుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయాడు.

కుటుంబ సభ్యులు అనంతలక్ష్మి, రమేశ్, శివ, పంతజలికి ఆ భగవంతుడు ధైర్యం చేకూర్చుగాక. శ్రీహరిగారి ఆత్మకు శాంతిని ప్రసాదించమని ప్రార్థిస్తున్నాను.

**"సర్వే భవంతు సుఖిన: సర్వే సంతు నిరామయా: ।**
**సర్వే భద్రాణి పశ్యంతు మాకశ్చిత్ దు:ఖభాగ్భవేత్ ।।"**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8 (21)
UGC Care List Approved Journal
హైదరాబాద్ జూన్ : 2023

# భాషా సాహిత్య పథ నిర్దేశకులు ఆచార్య శ్రీహరి గారు

ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఫోన్ : 98 66 95 6250

ఆచార్య రవ్వా శ్రీహరిగారు లేరు; కాని వారి అక్షరాలున్నాయి. అవి భాషా సాహిత్య పథికులకు సవ్యమార్గాన్ని నిర్దేశిస్తాయి.

ఆయనను అడుగడుగునా గుర్తుంచుకొనే సంఘటనలున్నాయి. అందువల్ల వారు నాకు నిత్య బోధ గురువులై కనిపిస్తారు.

తెలిసిన మిత్రులూ, పూర్వ విద్యార్థులు, వారి సందేహ నివృత్తికై ఫోన్ చేస్తారు. పంచ కన్యకలంటారు ఎవరు? సప్త మండలములంటే యేవేవి? నవసిద్ధులంటే యేమిటి? అని అడుగుతారు. అప్పుడు నాపక్కనే ఉండే సంకేత పదకోశం తీసి చూచి సమాధానం చెప్పేస్తా! వెనువెంటనే ఆచార్య శ్రీహరి గారి సంకేతపద కోశం పరామర్శక గ్రంథంగా దగ్గర పెట్టుకోండి అని సలహా ఇస్తా.

ఈ పదం తెలంగాణ మాండలికమా అని యెవరైనా అడిగితే శ్రీహరిగారి నిఘంటువు గానీ, నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం కానీ చూడండి తెలుస్తుంది అంటా.

ఈ తెలుగు పద్యాల్ని సంస్కృతంలోకి మార్చాలి అని యెవరైనా అడిగితే, ఇప్పటికే ప్రపంచపదులను, ఫిరదౌసిని, కొన్ని వేమన పద్యాలను, ధర్మపురి నరసింహ శతకాన్ని సంస్కృతంలో అందించిన మహా మహోపాధ్యాయులు ఆచార్య రవ్వా శ్రీహరిగారు. వారిని సంప్రదించండి అని పంపిస్తా.

అన్నమయ్యను అధ్యయనం చేయాలని ఎవరన్నా సంప్రదిస్తే ఆచార్యులవారి అన్నమయ్య భాషావైభవం, అన్నమయ్య సుభాషితాలు, అన్నమయ్య అచ్చతెలుగు, అన్నమయ్య నవ్వులు, అన్నమయ్య పదకోశం వంటి గ్రంథాలు చదవండి! అంతేగాక వారు అన్నమయ్యను వ్యావహారిక భాషా ఉద్యమానికి ఆద్యుడంటున్నారు, పరిశీలించండి అని చెబుతా.

సంప్రదాయ వ్యాకరణాన్ని, ఆధునిక భాషా శాస్త్రాన్ని అధ్యయనం చేసి సమదృష్టితో బోధించే వారెవరున్నారని ప్రశ్నిస్తే ఇంకెవరూ శ్రీహరిగారే అని చెబుతా.

**“అపశబ్ద భయం నాస్తి – అప్పలాచార్య సన్నిధౌ”** అన్నట్లుగా ఎడాపెడా వ్రాసేస్తుంటే, వాడుక తెలుగులో అపప్రయోగాలు అనే గ్రంథం వ్రాసిన శ్రీహరిగారిని దర్శించుకోండి అని సలహా ఇస్తా.

**“మహాభాష్యం వా పాఠయేత్, మహారాజ్యంవా పాలయేత్”** – మహా భాష్యమైనా పాఠం చెప్పాలి, మహారాజ్యమైనా పాలించాలి అనే సూక్తి ప్రచారంలో ఉంది. మహారాజులు లేని ఈ కాలంలో మహాభాష్యాన్ని తెలుగువారికందించిన శ్రీహరిగారే భారతీయ భాషలకు మకుటం లేని మహారాజు అని భావిస్తా.



**“అంతో ఇంతో తెలివి యబ్బి నేటికి దశాబ్ద
బ్దమ్మయ్యె; ఇప్పటికి చెమ్మగిల్లిన నేత్ర
పుటల లోపలి అర్థముల గ్రహింపగలేక
వెఱ్ఱిగ నిఘంటువుల వెంట పర్వెత్తెదను”**

... అంటారు సినారె తమ అక్షరాల గవాక్షాలలో. మరి అలాంటి నిఘంటువుల నిర్మాత శ్రీహరిగారు.

భారతీయ భాషా సాహిత్య జగత్తులో ఒక విశిష్ట స్థానంలో ప్రతిష్ఠితులైన ఆచార్య రవ్వా శ్రీహరిగారితో కలిసి పనిచేసే సౌభాగ్యం తిరుమల తిరుపతి దేవస్థానంవారు నాకు కల్పించారు. వారు 2011 – 2014 మధ్య మూడు సంవత్సరాలు ఆధ్యాత్మిక ప్రచురణల కార్యక్రమాలను చూచే అధికారిగా నియమించబడ్డారు. ప్రచురణల ప్రధాన సంపాదకుల (ఎడిటర్ – ఇన్ – చీఫ్) బాధ్యత వారు సక్రమంగా నిర్వహించారు. అప్పటికే ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా వారు పనిచేసి వచ్చారు. దాక్షిణాత్య భాషలతో పాటు సంస్కృతాంగ్ల హిందీ భాషలపై సాధికారికమైన ప్రతిభా పాండిత్యాలున్న వారి కాలంలో అనేక ఆధ్యాత్మిక గ్రంథాలు ప్రచురింపబడ్డాయి.

శ్రీమాన్ వానమామలై వరదాచార్యులవారి పోతన చరిత్రము ఆధ్యాత్మిక గ్రంథ ప్రచురణల భాగంగా ప్రచురించినప్పుడు వారితో కలిసి పనిచేయడం జరిగింది. హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆవిష్కరణ బాధ్యత స్వీకరించింది. నేను పరిషత్తు కార్యదర్శిగా ఉన్నాను. మహతి ఆడిటోరియంలో ఆవిష్కరణోత్సవం జరిగింది. స్వామి సన్నిధిలో జరిగిన కార్యక్రమమం విజయవంతం కావడానికి శ్రీహరిగారితో చేయి కలిపి విశేసంగా ప్రయత్నించే అవకాశం చిక్కింది. వారి మార్గదర్శనంలో పరిశ్రమించే అదృష్టం నాకు లభించింది.

అంతేగాక తిరుపతిలో, తిరుపతి పరిసరాల్లో జరిగిన రెండు మూడు సాహిత్య సభలకు కలిసివెళ్లి పాల్గొనడం జరిగింది. వారి ప్రసంగం భాషా సాహిత్యాల విశ్లేషణతో నడిచేది. నా ప్రసంగం ధార్మిక, ఆధ్యాత్మిక సామాజికాంశాలను స్పృశించేది. అలా ఆ సభకు పరిపూర్ణత చేకూరేది.

సవ్యాఖ్యానాంధ్ర మహాభారత ప్రచురణ మళ్లీ ఆచార్యులవారి ఆధ్వర్యంలోనే జరిగింది. తిరుమల క్షేత్ర దర్శిని, బ్రహ్మమొక్కటే వరుస గ్రంథాలు, బాలభారతి తెలుగు, హింది, ఇంగ్లీషుల్లో వచ్చిన వరుస గ్రంథాలు, పోతన భాగవతం సరళ వ్యాఖ్యానంతో కూడిన సంపుటాలు, భారతీయ సంస్కృతి, మహాభారత ఉపాఖ్యాన గ్రంథాలు, ఇలా దాదాపు 250 గ్రంథాలు ఆచార్య రవ్వా శ్రీహరిగారి కాలంలో వెలువడ్డాయి. ప్రకాశన విభాగంలోని పండితులెందరో వారికి సహకరించారు. అయినా వారి ముద్ర ఆ గ్రంథాలపై స్పష్టంగా కనిపిస్తుంది.

ప్రధాన సంపాదకుల బాధ్యతలతో పాటు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం ప్రత్యేకాధికారి (ఇంచార్జి) బాధ్యతలనూ వారు నిర్వర్తించారు. శ్రీ శాస్త్రిగారి సంపాదకత్వంలో వెలువడ్డ రంగనాథ రామాయణం, బసవపురాణం, ఉద్భటారాధ్య చరిత్రం వంటి గ్రంథాలతో పాటు, శ్రీ శాస్త్రిగారి గ్రంథాలెన్నో శ్రీ శ్రీహరిగారి కాలంలోనే పునర్ముద్రణకు నోచుకున్నాయి. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కరుణా కటాక్షాల వల్లనే ఈ అదృష్టం లభించిందని వారన్నారు. అవును! ఆ స్వామి ప్రేరణ వల్లనే ఈ అధికారులు మనల్ని ఇక్కడికి పిలిపించుకొన్నారు అంటూ 'దాసోహం శ్రీనివాసస్య' అన్నాను నేను.

ఆ కాలంలో వెనుకా ముందున్న వసతిగృహాల్లో (క్వార్టర్స్‌లో) మేముండేవాళ్లం. అందువల్ల కూడా ఒకే వాహనంలో భాగ్యనగర్‌కు రావడం, మళ్లీ వెళ్లడం జరిగేది. శ్రీహరిగారి పక్కన కూచొని ప్రయాణించడం సజీవ శబ్దకోశాన్ని తలపై ధరించి ప్రయాణించినట్లే ఉండేది. ఇప్పుడు వారు లేరు; కాని ఆ సజీవ శబ్దకోశాలున్నాయి. వాటిలో వారిన చూచుకొందాం!

---

## రవ్వా శ్రీహరి విబుధుడు



రవ్వా శ్రీహరి విబుధుడు
పువ్వుల కెనయౌ మనస్సు పూని, సతమ్మున్
నవ్వుల జిమ్ముచు, సఖ్యపు
దివ్వెల వెలిగించె, నుక్తి తీర్పరి యగుచున్

ఎన్నో చేదనుభవముల్
వెన్నున్ విరిచెడి విధాన వెంటాడిన, తా
నన్నీ సహించి, ప్రగతిన్
మిన్నగ సాధించె సురలు మెచ్చిదవనలీన్

గీర్వాణాంధ్రమలందలి
మర్వులు కన్గొనుటె గాదు, పూర్ణప్రజ్ఞన్
ఉర్వర రీతులు జదివెన్
సర్వామోదనయమార్గ సంపద్విదుడై

అత్యున్నతమౌ పదవుల,
స్తుత్యామరగురు సమాన సూక్ష్మంజ్ఞుండై
ధృత్యుత్సాహమున నడిపె
ప్రత్యగ్రశ్రద్ధ పూను భాగవతుడు నాన్

హృదయాహ్లాద మెసంగన్
పదకర్తగు అన్నమయ్య భాషా ఫణితుల్
పదనౌ జుష్వాకృతులన్
విదితామర భాషాయందు విరచించె నతిన్

**అవధానాచార్య (కళారత్న)**

**డా. ఆశావాది ప్రకాశరావు**

# భాషాపర శేషభోగి 'ఆచార్య రవ్వా శ్రీహరి'

**ఆచార్య వెలుదండ నిత్యానంద రావు,** ఫోన్ : 9441 666 881




అస్మద్గురూత్తములు, మహా మహోపాధ్యాయులు ఆచార్య రవ్వా శ్రీహరిగారు సంస్కృతమతి. సంస్కృత భాషాఘట్టోల్లంఘన గాఢ ప్రతిభులు. భాష్యాంత వైయాకరణులు.( వైయాకరణి అనే ఏక వచన రూపం అసాధు వంటారు గురువుగారు) నిఘంటు నిర్మాతలు, గుణ గరిష్ఠులు, ఆచార్య వరిష్ఠులు, వ్యాకరణశాస్త్రాధ్యయన రంగంలో వీరవిహారులు. తెలంగాణాకే కాక ఉభయ రాష్ట్రాల్లోనూ సంస్కృత భాషా సాహిత్య అధ్యయన రంగంలో పేరెన్నిక గన్న ఆచార్య రవ్వా శ్రీహరి 21-4-2023న తన 80వ ఏట (5-5-1943 జననం.) దివంగతులు కావడం తీరని విషాదం. రవ్వా శ్రీహరి నిగర్వి. నిరాడంబరులు.

1983- 85 కాలంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ., లో నాకు ప్రత్యక్ష గురువు. ఆ కాలంలోనే వారి "అలబ్ధ కావ్య పద్యముక్తావళి" వెలువడింది. తక్కిన విద్యార్థులకు ఇవ్వకుండా నాకు పుస్తకం ఇవ్వడానికి ఎంతో మొహమాటపడ్డారు. **"శ్రద్ధాళవే చిరంజీవి నిత్యానందాయ మోదతః దీయతే పుస్తకమిదం మదీయం ధీ వివృద్ధయే"** అంటూ ఒక శ్లోకం రాసి చాటుగా బహూకరించారు. 1983లో ఆచార్య బి. రామరాజుగారి షష్టిపూర్తి ఉత్సవ సంఘానికి వారు కార్యదర్శి. ఎం.ఏ., విద్యార్థినైన నాకు ఆ సంచికలో వ్యాసం రాసే అవకాశమివ్వడమే కాకుండా షష్టిపూర్తి సన్మానసభలో క్రియాశీలక కార్యకర్తృత్వాన్ని కల్పించారు. నాటి నుంచి నేటిదాక మా అనుబంధం అవిచ్ఛిన్నంగా కొనసాగుతుంది.




బాల్యంలో సంస్కృతం అంటే ఏమిటో తెలియకుండానే ఉచిత భోజనం, ఉచిత చదువుల ప్రకటనను చూసి యాదగిరిగుట్ట చేరిన శ్రీహరి గారు, ఆ తర్వాత సీతారాం బాగ్ సంస్కృత కళాశాలలోని అత్యున్నతశ్రేణి సంస్కృత పండితుల వాత్సల్యామృతసేచనంతో వికసించి అధ్యయన అధ్యాపనలతో, రచన వ్యాసంగంతో అత్యున్నతమైన "మహా మహోపాధ్యాయ" పురస్కారం దాకా ఎదిగిన తీరు ఎంతో స్ఫూర్తిదాయకం. హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులుగా, శాఖాధిపతిగా, ద్రావిడవిశ్వవిద్యాలయం ఉపకులపతిగా, తిరుమల తిరుపతిదేవస్థానం ప్రచురణల అధికారిగా ఏ పదవిలోనున్నా అహంభావాన్ని అతిశయాన్ని దరిచేరనీయలేదు. హితమితభాషణలతో తాము చేస్తున్న పని మీదే ధ్యాస పెట్టి ముందుకు సాగి పోయారు. ఆచార్య బి. రామరాజు గారందించిన ప్రోత్సాహాన్ని చివరిదాక స్మరిస్తూనే ఉన్నారు.

శ్రీహరి గారి సాహిత్య వ్యాసంగంలో ప్రధాన స్థానం రిఫరెన్స్ గ్రంథాల నిర్మాణం. కవిత్వాది సృజన రంగాలలో కృషి చేసిన వారికి త్వరగా కీర్తి ప్రతిష్ఠలు వస్తాయి కానీ రిఫరెన్స్ గ్రంథాలు జాతికి ప్రాతినిధ్యం వహిస్తూ ఒకరు కృషి చేస్తారు, అందరూ వాటి ఫలితాలను అనుభవిస్తారు. ఆ విధంగా రవ్వా శ్రీహరి అందించిన వ్యాకరణ పదకోశం, సంకేత పదకోశం, శ్రీహరి నిఘంటువు, సంస్కృత అష్టాధ్యాయికి రాసిన తెలుగు వ్యాఖ్యానం లాంటివి జిజ్ఞాసువులకు ఎప్పుడూ ఉపయోగపడేవే.




నిఘంటువు లనగానే బ్రౌన్ నిఘంటువు, శబ్దరత్నాకరం, సూర్యరాయాంధ్ర నిఘంటువు మదిలో మెదలడం సహజం. **"సాహిత్య విద్యార్థులకు, అధ్యాపకులకు, జిజ్ఞాసువులకు ఉపయోగపడే ఎన్నో రకాల నిఘంటువులు తెలుగులో రావలసి ఉన్నాయి. ఆంగ్లం, కన్నడం, మరాఠీ, తమిళం మొదలైన భాషల్లో వస్తున్న నిఘంటువుల వైవిధ్యంతోనూ, సంఖ్యతోనూ పోలిస్తే తెలుగు నిఘంటు వాఙ్మయం చాలా పరిమితమనే చెప్పాలి. తెలుగు భాషా, సాహిత్య విద్వాంసులు ఈ విషయంలో శ్రద్ధ చూపవలసిన అవశ్యకం ఎంతో వుంది"** (సంకేత పదకోశం పీఠిక) అన్న ఆచార్య రవ్వా శ్రీహరి హితవు మనకు





కర్తవ్య ప్రదర్శిని. సంకేత పదకోశం (1973), శ్రీహరి నిఘంటువు (2004), అన్నమయ్య పదకోశం (2012)లు నల్లగొండజిల్లా మాండలిక పదకోశం ఆచార్య రవ్వా శ్రీహరిగారి కీర్తికి ఎత్తిన జయపతాకలు.

రవ్వా శ్రీహరి గారి సంకేత పదకోశం ప్రథమ ముద్రణం 1973లో వచ్చింది. దీనిలో వ్యాకరణ తర్క మీమాంస జ్యోతిష అలంకార ఆయుర్వేదాలకు సంబంధించిన సుమారు 2200 సంకేత పదాలు వివరణలు, వాటి మూలాలు కూర్చడం జరిగింది. పంచప్రాణాలు, నవధాన్యాలు, సప్తసంతానాలు, చతుష్షష్టి (64) కళలు, షడంగాలు, పంచాగ్నులు అని ఇలా అంకెలతో సంఖ్యలతో ముడిపడి వున్న వాటిని ఈ సంకేతపదకోశం వివరిస్తుంది. కేవలం అర్థ వివరణతో ఆగిపోకుండా అది ఎక్కడ ప్రయుక్తమైందో దాని మూలం పేర్కొనడంతో గ్రంథ ప్రామాణ్యం బలీయమైంది.

పదకవితకే కాక వ్యావహారిక భాషకు కూడా పట్టం కట్టిన వాడు అన్నమయ్య. అన్నమయ్యలోని భాషను ఎన్నో తీరులుగా విశ్లేషించే ప్రయత్నం చేశారు విద్వాంసులు. రాయలసీమ ప్రాంతంలో నేటికీ సజీవంగా జనవ్యవహారంలో ఉన్న విలక్షణ పదప్రయోగాలను శ్రీహరిగారు తొలిసారిగా తమ అన్నమయ్య పదకోశంలో గ్రంథస్థం చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే రవ్వా శ్రీహరి గారు ఈ నిఘంటువును నిర్మించి తాళ్లపాక కవుల పదాలను అనైఘంటికాలుగా చేసిన పూర్వనిఘంటుకారుల అనైతికతను తొలగించి "కీర్తనకెక్కారు". (అన్నమయ్య ప్రసిద్ధికెక్కు అనే అర్థంలో కీర్తనకెక్కు అని వాడాడు.)

సూర్యరాయాంధ్ర నిఘంటువు కెక్కని సుమారు ముప్పై అయిదు వేల పదాలతో శ్రీహరి నిఘంటువు వెలువరించారు. సూర్యరాయాంధ్ర నిఘంటువు పట్టించుకోని తాళ్ళపాక కవులు, క్షేత్రయ్య పదాలు, సారంగపాణి పదాలు, కాటమరాజు కథ, పలనాటి వీరచరిత్ర లాంటి జానపద వీరగాథలు, ఆంధ్ర పదనిధానం లాంటి నిఘంటువులు, హంసవింశతి, శుకసప్తతిలాంటి కావ్యాలు, నిత్యవ్యవహారంలో ఉన్న పదజాలం అన్నీ కలుపుకొని ఈ బృహన్నిఘంటువును ఆచార్య రవ్వా శ్రీహరి తయారుచేశారు. తెలుగు అకాడమీ కోసం వ్యాకరణపదకోశం నిర్మించారు.

ఆచార్య రవ్వా శ్రీహరి మరో విశిష్టగ్రంథం అలబ్ధ కావ్య పద్యముక్తావళి. ఈగ్రంథంలో సంపూర్ణ కావ్యాలు దొరకక, సంకలన గ్రంథాల్లో, లాక్షణిక గ్రంథాల్లో ఉదాహృతాలైన కావ్యాలలోని పద్యాలన్నింటిని ఒకచోటికి తెచ్చారు. దీనివల్ల ఎప్పుడైనా పూర్తి గ్రంథం లభించక పోదా అని ఆశ. శ్రీహరిగారే తెలుగులో అలబ్ధవాఙ్మయం అని అకారాది క్రమంలో మరో సంక్షిప్త సూచీగ్రంథాన్ని వెలువరించారు.

ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృత సరోవరంలో నిర్నిరోధంగా, స్వేచ్ఛగా విహరించే తెలుగు రాజహంస. అపశబ్ద మాలిన్యం సోకని స్వచ్ఛస్ఫటికం రవ్వా శ్రీహరి. జాషువా పిరదౌసి, గబ్బిలం కావ్యాల సోయగాలను సి. నారాయణరెడ్డి ప్రపంచపదులను, ధర్మపురిశేషప్ప శతకాన్ని సంస్కృతంలో ప్రకటించి విశ్వజనీనం చేశారు. ఫిరదౌసి లోని 166 పద్యాల్లో జాషువా కుప్పలు పోసిన తెలుగు పలుకుబళ్లను, కరుణవీరాన్ని ఏ మాత్రం పొల్లుపోకుండా సంస్కృతీకరించడంలో రవ్వా శ్రీహరి కృతకృత్యులయ్యారు. మాతృకలోని రసస్ఫూర్తికి విఘాతం కలుగకుండా పలుకు నుడికారాన్ని పాటిస్తూ సంస్కృతీకరించడంలో రవ్వా శ్రీహరి సాధించిన నేర్పు శ్లాఘనీయం. తెలుగు దేశీ ఛందస్సులైన తేటగీతి, ఆటవెలది, సీసాలను సంస్కృతంలో అలాగే రాయడం శ్రీహరి చేసిన మరో విశేష ప్రయోగం. మానవమేధకు శిఖరప్రాయమైన (Magnum opus of the human intelligence- Bloomfield) అష్టాధ్యాయికి ఆంధ్రాకృతి కల్పించిన అపరపాణిని ఆచార్య రవ్వాశ్రీహరి.

ఆచార్య రవ్వా శ్రీహరిగారి అంతేవాసిగా, వారి వాత్సల్యాన్ని చూరగొన్న విద్యార్థిగా వారి నిర్యాణానికి అక్షరాంజలి ఘటిస్తున్నాను.

(ఆంధ్రజ్యోతి దినపత్రిక సౌజన్యంతో)

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8  UGC Care List Approved Journal
హైదరాబాద్ జూన్ : 2023

# ఆచార్య రవ్వా శ్రీహరిగారి వ్యక్తిత్వం – బోధనా రీతులు

**ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు,** ఫోన్ : 918 268 5231

"పురాణమిత్యేవ న సాధు సర్వమ్
న చాపి కావ్యమ్ నవమిత్యవద్యమ్
సంతః పరీక్ష్యాన్యతరత్ భజంతే
మూఢః పర ప్రత్యయనేయ బుద్ధిః"

ఈ శ్లోకం మహాకవి కాళిదాసు రచించిన *'మాళవికాగ్నిమిత్రమ్'* నాటకంలోనిది. కావ్యం ప్రాచీనమైనదైతే చాలు స్వీకరించదగిందే అని అనుకోనవసరం లేదు. ఇదేదో కొత్త కావ్యం కాబట్టి దీన్ని తిరస్కరించాలనుకోవడమో, స్వీకరించేయాలనుకోవడమో కూడా సరైందికాదు. తెలివైన వాళ్ళెప్పుడూ దేన్నైనా సరే దానిలోని గుణ, దోషాలను పరీక్షించి దాన్ని అభిమానిస్తారు. విచక్షణతో ఆలోచించ లేని మూఢులు మాత్రమే ఇతరులు ఏది చెబితే దాన్నే ప్రమాణంగా నమ్మేస్తుంటారనే భావం గల ఈ శ్లోకం గుర్తొచ్చినప్పుడల్లా మాకు సంస్కృతం బోధించిన మా గురువుగారు ఆచార్య రవ్వాశ్రీహరిగారు గుర్తొస్తుంటారు. సంస్కృతాన్ని కూడా చాలామంది అలాగే స్వీయ బుద్ధితో కాకుండా, ఇతరుల బుద్ధితో ఆలోచిస్తూ వ్యతిరేకిస్తుంటారు. అది సరైనది కాదని ఆయన తరచుగా చెప్పేవారు. సంస్కృతానికీ మహాకవి కాళిదాసుకీ ఎంతటి అవినాభావ సంబంధం ఉందో సంస్కృతం మాట వినగానే మాకు పాఠం చెప్పిన ఆచార్య రవ్వాశ్రీహరిగారి తోనూ నాకు అంత అవినాభావ సంబంధం ఉందనిపిస్తుంది.

సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్, తెలుగు శాఖలో ఆచార్య రవ్వా శ్రీహరి గారు అధ్యాపకులుగా పనిచేసేటప్పుడు ఎం.ఏ., తెలుగులో నేను కూడా ఒక విద్యార్థిగా చేరాను. ఆయన మాకు సంస్కృతాన్ని బోధించేవారు. ఆయన ఒక అధ్యాపకుడిగా, ఒక శాఖ అధ్యక్షుడిగా ఉండగా నేను దగ్గరుండి గమనించే అవకాశం కలిగింది. నేను అక్కడే పరిశోధన చేసి మరలా అదే శాఖలో అధ్యాపకుడిగా చేరేనాటికి ఆయన ద్రావిడ విశ్వవిద్యాలయంలో వైస్‌ఛాన్సలర్ గా పనిచేసి, మరలా తిరిగి మా యూనివర్సిటీ తెలుగు శాఖలో చేరి పదవి విరమణ చేశారు. ఆ విధంగా ఆయనతో పాటు కొద్ది నెలల పాటు కలిసి పని చేసిన అనుభవం కూడా నాకు లభించడం ఒక అదృష్టం. ఈ సమయంలో నేను గమనించిన ఆచార్య రవ్వా శ్రీహరి గారి వ్యక్తిత్వాన్నీ, బోధనా పద్ధతులను కొన్నింటిని ఈ వ్యాసంలో తెలియజేయాలని అనుకుంటున్నాను.

## శ్రీహరిగారి బాహ్య రూపం

ఆచార్య రవ్వా శ్రీహరిగారు చామనచాయ గల దేహంతో సుమారు




ఐదున్నర అడుగుల పొడుగున ఉండేవారు.. అటు బక్కపలుస అని గానీ లావు అని గానీ చెప్పలేని మధ్య రకంగా ఉంటారు. ఎప్పుడూ పెద్దగా జుత్తు పెరగనివ్వకుండా కత్తిరింపు వేయించుకొని నున్నగా తలదువ్వుకొని ఉండే కోలముఖం. నేను ఆయనను ఏనాడూ మాసిపోయిన, పెరిగిపోయిన గడ్డంతో చూడలేదు. ఆయనది చిలుకలాంటి ముక్కు. ఎప్పుడూ తెల్లని లేదా రంగులు, గీతలు లేని ప్లెయిన్ చొక్కానే ఆయన ఎప్పుడూ ధరించేవారనుకుంటాను. నేనెప్పుడు చూసినా అలాంటి దుస్తుల్లోనే కనిపించేవారు. హాఫ్ హేండ్స్ చొక్కాలే ఆయన ఎక్కువగా ఇష్టపడేవారనుకుంటాను. వాటినే ధరించేవారు. ప్యాంటు వేసుకున్నా, ఇన్ షర్ట్ చేసుకోవడం నేను చూడలేదు. చివరి దశలో ఆయన పంచె కట్టుకొని, పైన లాల్చీలాంటి తెల్లచొక్కా, తెల్లని పంచెనీ ధరించేవారు. ప్రసన్నమైన చూపుతో చిరునవ్వుతో పలకరించేవారు. కానీ, తక్కువగా మాట్లాడేవారు. ఆయనకు 75 సంవత్సరాలు నిండిన సందర్భంగా ప్రచురించిన **'శ్రీహరివిజయం'** అభినందన సంచికలో కవి దోరవేటి గారు ఆచార్య శ్రీహరిగారి గురించి కొన్ని పద్యాలు వర్ణించారు. ఒక పద్యంలోఇలా వర్ణించారు.

**"మితమగు మాటలాడుటనమేయ సహిష్ణుత జూపగల్గుటన్
హితము సత్యము గోరుట, మహీరుహమట్టుల మేలుసేయ సం
స్కృతి తన జీవలక్షణము జేసుక బాసిలుచున్న శ్రీహరి
స్థిత గుణరూపుడంచు నిక చేతులనెత్తి నమస్కరించెదన్"**

కవి వర్ణించినట్లు ఆయనెప్పుడూ ఎంతో మితంగా మాట్లాడ్డమే కాకుండా, సత్యాన్నే మాట్లాడేవారు. అది కొంతమందికి నచ్చేదికాదు.

శ్రీహరిగారు మాట్లాడుతుంటే తెలంగాణ తెలుగు భాషా సౌందర్యం గుభాళించేది. ఆయన మాట్లాడుతుంటే కొన్ని పదాలు పలికేటప్పుడు మొదట్లో నాకు ***"ఈయనేంటిలా గ్రంథాల్లో ఉన్న భాషను చదువు***

ISSN 2457-0796

UGC Care List Approved Journal

**మూసీ మాసపత్రిక** **సంపుటి -26 : సంచిక - 8** **(26)** **హైదరాబాద్** **జూన్ : 2023**

***తున్నట్లు మాట్లాడుతున్నారో'***నిపించేది. పదాలను కలిపి మట్లాడేవారు కాదు! మాట్లాడేటప్పుడు కూడా వ్యాకరణ నియమాల్ని తు.చ. పాటిస్తూ మాట్లాడుతున్నారనిపించేది. అవన్నీ తెలియాలంటే ఆయన రాసిన ***'వాడుక తెలుగులో అపప్రయోగాలు (1995), తెలంగాణ మాండలికాలు – కావ్య ప్రయోగాలు (1988)*** గ్రంథాలు చూడాలి. ఆయన పాఠం చెప్పేటప్పుడు తప్పనిసరిగా చేతిలో ఒకటి రెండు పుస్తకాల తోనే తరగతి గదిలోకి వచ్చేవారు. శ్లోకాలను చదివి, వాటిని తన మాటల్లోనే వివరిస్తున్నా, ఆయన్ని చూడకుండా ఆ మాటలు వింటే మాత్రం, ఆయన పుస్తకం చదువుతున్నారనే అనుకుంటాం. ఆయనతో మామూలుగా మాట్లాడుతున్నా, ప్రతి వాక్యంలో, ప్రతి పాదంలో, ప్రతి అక్షరంలో చక్కని ఉచ్చారణ ప్రతిధ్వనించేది. తెలుగు భాషకు ఉన్న మాధుర్యమంతా ఆయన మాటల్లోనే వినిపిస్తు న్నట్లుండేది!

కాళిదాసు *రఘువంశం*లో (6-67) ఇందుమతీ స్వయంవర సభ సందర్భంగా రాజుల ముఖాలను వర్ణించిన ఘట్టం కాళిదాసు ఉపమను శాశ్వతంగా ముద్రవేసేలా వర్ణించిన విధానాన్ని ఆయన చెప్పిన తీరు నేనెప్పటికీ మర్చిపోలేను. అంతటి వ్యాకరణ వేత్త కూడా కాళిదాసు కవిత్వానికి మురిసిపోయాడనిపిస్తుంది. దాన్ని అద్భుతంగా చెప్పేవారు.

*"సంచారిణీ దీపశిఖేవ రాత్రౌ*
*యం యం వ్యతీయాయ పతింవరా సా*
*నరేంద్ర మార్గాట్ట ఇవ ప్రపేదే*
*వివర్ణ భావం స స భూమిపాలః*

ఇందుమతి స్వయంవర సభకు అనేకమంది యువరాజులు వచ్చారు. ఆమె తమనే వరిస్తుందని ఎదురు చూస్తూ మహోదీవిగా కూర్చున్నారు. ఆమె పూలదండతీసుకొని ఒక్కొక్కరాజు దగ్గరకు వస్తుంది. ఆమె నడిచి వస్తున్న దీపశిఖలా ఎంతో సౌందర్యంతో మెరిసిపోతుంది. దానితోపాటు ఆమె తననే వరిస్తుందని వాళ్ళ ముఖాలు కూడా ఆ వెలుగుకి తోడై మరింతగా ప్రకాశిస్తున్నాయి. కానీ, ఆమె ఆ యువరాజుని కాదని, మరొక యువరాజువైపు నడిచి వెళ్ళిపోగానే, ఒక్కొక్క యువరాజు ముఖం కాంతిహీనమైపోతుంది. రాత్రి సమయంలో సంచరించు దీపపు శిఖ వలె రాజుల వరుసలో వరుని వరించాల్సిన ఇందుమతి యేయే రాజులను వదలి వెళ్ళిపోతుందో ఆ రాజుల ముఖాలు దీపపుశిఖ వెళ్ళిపోయిన తరువాత రాజమార్గంలో భవనాలు వెలవెల బోయినట్లు కాంతివిహీనాలైనాయి' అని ఆ శ్లోకంలోని భావాన్ని మాత్రమే చెప్పి ఊరుకొనేవారు కాదు.

దీన్ని వ్యాఖ్యానిస్తూ ఆచార్య శ్రీహరిగారు, ఆరోజుల్లో గొప్పవాళ్ళ పెండ్లిండ్లకు రాత్రులు కొంతమంది దీపాల్ని నెత్తిమీద పెట్టుకొని దీపాల్లా నడిచేవారు. అలాగే, ఆ కాలంలో భటులు దివిటీలు తీసుకొని నడుస్తూ వెళుతుంటే, ఆ కాంతి రాజభవనాల మీద పడేది. దానితో ఆ భవనం మరింతగా మెరుస్తుంది కదా. దివిటీ వెళ్ళిపోగానే మరలా భవనాలన్నీ వెలవెలబోతాయి. రాజుల ముఖాలను భవంతులతోను, ఇందుమతిని దీపపుశిఖగాను పోల్చి చెప్పడం కాళిదాసులో ఉన్న గొప్ప భావుకత. అది మహాకవి కాళిదాసు ఉపమ అలంకారానికి నిదర్శనం అనేవారు. అందుకనే కాళిదాసుకవికి "దీపశిఖా కాళిదాసు" అనేపేరు వచ్చిందని వివరించేవారు.

ఎం.ఏ., చదివే ఆ వయసులో ఎవరైనా అమ్మాయి మా వైపు చూస్తూ నవ్వుతూ వస్తుంటే మా ముఖాలు కూడా అలాగే వెలిగి పోయేవి. కానీ, మా నుండి దాటుకొని, మమ్మల్ని కాదని వెళ్ళిపోగానే మా ముఖాలు కూడా అలాగే మాడిపోయేవి కదా అనిపించేది మా మనసుల్లో.

మాకు కాళిదాసు రచించిన 'మేఘసందేశం' కూడా శ్రీహరిగారే చెప్పారు. ఈ క్రింది శ్లోకాన్ని చెప్పేటప్పుడు ఆషాడమాసంలో వచ్చే తొలి వర్షం చినుకులు పడగానే భూమి ఎలాంటి సువాసనలు వెదజల్లుతుందో నిజంగా ఆ వాసన మేముకూడా ఆస్వాదించాలన్నట్లు వర్ణించేవారు.

**"తస్మిన్నద్రౌ కతిచిదబలావిప్రయుక్తః స కామీ**
**నీత్వా మాసాన్ కనకవలయభ్రంశరిక్తప్రకోష్ఠః**
**ఆషాఢస్య ప్రథమదివసే మేఘమాశ్లిష్టసానుం**
**వప్రక్రీడాపరిణతగజప్రేక్షణీయం దదర్శ "**

కామార్తుడైన ఆ యక్షుడు భార్యావియోగియై ఆ కొండపై కొన్ని మాసాలు గడిపాడు. బక్కచిక్కాడు. అతడి చేతి మణికట్టుపై ఇప్పుడు కంకణం లేదు. వదులై ఎక్కడో పడిపోయింది. ఇంతలో ఆషాఢం వచ్చింది. అది ఆషాఢపు తొలిరోజులు. అతడు ఆ పర్వతసానువును ఆవరించిన ఒక మేఘాన్ని చూసాడు. కొండను పెళ్ళగించి ఎత్తివేసే ఆటలో ఉన్న ఏనుగులా ఉన్నది ఆ మేఘము' అనేది దీని భావం.

దీన్ని వివరించేటప్పుడు మా గురువుగారు ఆచార్య శ్రీహరిగారు
m+ÔÃý Ë¿ÈÔáT¢ ŸŠô+#ŷ sÅ Ôá uõsÅ£<Šs Á>±–+&&ƒ
e\ ¢j ÅÆ&ƒ mý² dŸ•‹ &bþj ãÖ&Ã#| Ÿ&†" ¿ì Ôá <ŠzÁ–
q• ¿£¿Ð²\ TdŸ•y Ò®bþj ãÖj ãq&ƒýË ¿±[<'dŸ} VŸqT
#ãº Hs ?nHŷ sÁ€ ‹ +>±sÁ¿&j ãÖ\ TdŸ•+ ¿±e&¢T+f ñ
Ôá #ÔãT Tu²>±º ¿ÐÖþj ãÖj ãT <ŠH‹Ôã¿£>±#| ŸH •&ƒ
¿$ nHŷ sÅ€ @qTÞTeT<Šý²ú•, € €cÍ&ƒ Ô=* sÃE ýË¢
esÁ Å£] dïu„Ö$TMT<Še#Ù dŸy dŸ©• m+ÔÃ u²>±
nqTu„$+º #| ŸH •sÁ| ¾#û. esÁ eº Ìq| Ÿ&ƒ²¢u„Ö$T
ný²+{ ì| ]ŸeTÞ²* • Å£&†n+~dŸ+<ŷÖq" y dŸ #ãÖ&ƒ
H e+ÔáTk+~. ¿±ú, n~ €cÍ&¢eÖd¥ Ô=* sÃE ýË¢e#Ù
Ô= ¿£ È\ T¢Å£ eÖçÔáT€ | ]ŸeTÞø edŸ+~. n| Ÿ{ ¿ì

ఎండాకాలంలో భూమి బాగా ఎండిపోయి, నెర్రలు తీసి ఉంటుంది. చినుకులు పడేసరికి ఆ తొలిచినుకులు మంచి వాసనలను వెదజల్లుతుంది. ఇదంతా ఆయన పాఠం చెప్పేటప్పుడు ప్రదర్శించిన ఆత్మీయమైన ముద్రవేసేటట్లు పాఠం చెప్పేవారనడానికి మాకు గుర్తున్న దృశ్య చిత్రణకు నిదర్శనం.

## శ్రీహరిగారి వ్యక్తిత్వం

ఒకరి వ్యక్తిత్వాన్ని మరొకరు వివరించేటప్పుడు భిన్న దృక్పథాలలో ఆ వ్యక్తిత్వం వెలువడే అవకాశం ఉంది. మా గురువుగారు శ్రీహరిగారు విద్యార్థులతో కలిసి మెలిసి ఉన్నా, తమ తమ పరిధులను గుర్తెరిగి ఎవరికి వారు ప్రవర్తించాలన్నట్లే ఉండేవారు. విద్యార్థులను గౌరవంగా సంబోధిస్తూ మాట్లాడేవారు. **ఉదా : "అందరూ ఇంటర్నల్ పరీక్షలు రాసినారా?"**

పాఠం చెబుతున్నప్పుడు విద్యార్థులకు ఏదైనా సందేహం వచ్చి అడిగితే మధ్యలో పాఠం పూర్తికాదంటూ, చివరిలో చెప్తానని అనేవారు. కానీ, తానే మళ్ళీ పాఠం చెప్తూనే మధ్యలో ఆ సందేహాన్ని తీర్చే ప్రయత్నం చేసేవారు. ఆయన పాఠాన్ని చెప్పినంత సరళంగా, విద్యార్థుల సందేహాలకు సమాధానాలు వివరించడానికి మాత్రం ఇష్టపడేవారు కాదు. మరలా తరగతి గదిలో పాఠం చెబుతూ ఇంతకు ముందు ఎప్పుడన్నా ప్రశ్న అడిగిన విద్యార్థి వైపు చూస్తూ అర్థమయ్యిందా? అన్నట్లు చూసేవారు. తరగతి గదిలో కాకుండా, అదే వ్యక్తిగతంగా అడిగితే ఎంతో వివరంగా చెప్పేవారు. ఆయన మాట్లాడేటప్పుడు క్రియాపదాలు ఇలా ఉండేవి. **ఉదా: వచ్చినాం, వెళ్ళినాం, ప్రారంభించినారు. చేసినారు, రాసినారు, తెచ్చినారు.**

ఆచార్య శ్రీహరిగారు సిటీ నుండి ప్రతి రోజూ యూనివర్సిటీకి వచ్చి వెళుతుండే వారు. ఏపియస్ ఆర్టీసీ బస్సులో గానీ, మా యూనివర్సిటీ బస్సుల్లో గాని వచ్చి వెళుతుండేవారు. ఇలా బస్సులో రావడం, వెళ్ళడం చాలా మంది చేసే పనే. కానీ, గురువుగారు ఒక బ్యాగ్ పట్టుకొని, దానిలో కొన్ని పుస్తకాలు, మరికొన్ని చార్ట్ ముక్కలు వేసుకొని, బస్సు ఎక్కగానే తన పనిలో తాను నిమగ్నమైపోయేవారు. అప్పుడప్పుడూ మేము కూడా సిటీకి వెళ్ళడానికి అదే బస్సు ఎక్కడం వల్ల ఇవన్నీ గమనిస్తుండేవాళ్ళం. మేము ఎం.ఏ., చదివేటప్పుడు (1995-97) చాలా తక్కువ సంఖ్యలోనే బస్సు సర్వీసులు ఉండేవి. యూనివర్సిటీ వారు కొన్ని ప్రత్యేక బస్సులు వేసి ఉదయం, సాయంత్రం ఆబిడ్స్‌లో ఉన్న గోల్డెన్ థ్రెషోల్డ్ (జి.టి) వరకు తిప్పేవారు. అవి దొరక్కపోతే ఆర్టీసీ బస్సుల్లోనే వెళ్ళిరావాలి. అందువల్ల మేం కూడా వాళ్ళు ఎక్కిన బస్సులోనే ఎక్కవలసి వచ్చేది. ఆయన పుస్తకంలోని కొన్ని పదాలను తన దగ్గర ఉన్న ఛార్ట్ మీద రాసుకోవడం తప్ప, ఎవరినీ పట్టించుకొనేవారుకాదు. బస్సు యూనివర్సిటీ దగ్గర ఎక్కేటప్పుడు కొంచెం ఖాళీగానే ఉండేది. ఒకవేళ



లేకపోయినా ఆయన బస్సు ఎక్కినప్పుడు ఆయన్ని చూడగానే ఎవరొకరు లేచి తమ సీటు ఇచ్చేవారు. అలా మా యూనివర్సిటీ విద్యార్థులు మాత్రమే కాదు, ఆయనెవరో తెలియని వాళ్ళు కూడా ఆయన రూపాన్ని చూసి లేచి నిలబడేవారు. **"నేను నిలబడతాను. మీరు సీటు సంపాదించినారు కదా. మీరు కూర్చొనుటే న్యాయము"** అనేమాట పూర్తి కాకుండానే ఆ వ్యక్తి సీటు చూపిస్తూ బయట కొచ్చేయడం, ఏదో మొహమాటం పడుతూనే ఆయన సీటుపై కూర్చోవడం ఏకకాలంలో జరిగిపోయేవి. మేము మాత్రం ఇవన్నీ గమనిస్తూనే బస్సు వెనుక సీటులో కూర్చోనో, నిలబడో, సరదాగా మాట్లాడుకొనేవాళ్ళం.

శ్రీహరిగారు రేడియోలో సంస్కృతపాఠాలు చెప్పేవారు. మా క్లాసుమేట్స్ కొంతమంది ఆ రికార్డింగ్ చేసేటప్పుడు విద్యార్థులుగా వెళ్ళేవారు. ఆ పాఠం ప్రసారమయ్యేటప్పుడు ఆ రేడియోలో మా గురువుగారు పాఠాలు చెప్తున్నారని మావాళ్ళతో ఎంతో సంబరంగా చెప్పుకునేవాణ్ణి. ఆ ఆకాశవాణిలో నేటికీ ఆయన గొంతు ఆ పాఠాల్లో అప్పుడప్పుడూ వినిపిస్తూనే ఉంటుంది.

**శిష్టా క్రియా కస్యచదాత్మసంస్థా**
**సంక్రాంతి రన్యస్య విశేషయుక్తా**
**యస్యోభయం సాధు సశిక్షకాణాం**
**ధురి ప్రతిష్ఠాపయితవ్య ఏవ"**

అని మహాకవి కాళిదాసు మాళవికాగ్నిమిత్రమ్ నాటకంలో చెప్తారు. కొంతమందిలో పాండిత్యం పుష్కలంగా ఉంటుంది. ఇంకొంతమందిలో విషయాన్ని ఆవిష్కరించే శక్తి విశేషంగా కనిపిస్తుంది. ఎవరిలో ఈ రెండు లక్షణాలూ ఉంటాయో అతడు అధ్యాపకుల్లో అగ్రస్థానంలో నిలవదగ్గవాడవుతాడని ఈ శ్లోకానికి ఉన్న భావం. ఇది ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఉదాహరించి, వ్యాఖ్యానించిన మాట. ఈ మాటతోనే నేనూ ఏకీభవిస్తూ, మా గురువుగారు ఆచార్య రవ్వా శ్రీహరిగారు మహోన్నతమైన వ్యక్తిత్వం ఉన్నవారు మాత్రమే కాకుండా, విషయాన్ని శక్తివంతంగా బోధించి, విద్యార్థుల్లో శాశ్వతమైన ముద్రవేయగల ఆచార్యులని నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8 28 హైదరాబాద్ జూన్ : 2023

# రవ్వా శ్రీహరి గారు – నేను

ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులు, ఫోన్ : 905 262 9093

ఆచార్య రవ్వా శ్రీహరిగారు శరీరాన్ని విడిచిపెట్టినారనే వార్త నాకు వ్యక్తిగతంగా ఎంతో బాధను కలిగించింది. తెలుగు సరస్వతీదేవి కిరీటం నుంచి ఒక మణి రాలిపడ్డది అనిపించింది. ఆయన తన స్వయం కృషి వలన అసాధారణమైన, గొప్ప పాండిత్యాన్ని, శాస్త్ర విజ్ఞానాన్ని సంస్కృతాంధ్ర భాషల్లో సంపాదించినారు. లోకంలో అనుకూలమైన వాతావరణం ఉన్నప్పుడు పండితులు కావటం, విద్యావంతులు కావటం అసాధారణ విషయం కాదు. కాని సామాన్య కుటుంబంలో పుట్టి, ఆ వాతావరణం లేకపోయినా నెమ్మది నెమ్మదిగా మెట్లుమెట్లుగా ఎక్కుతూ శిఖరస్థమైన స్థాయికి చేరుకోవడమనేది చెప్పుకోదగిన అంశం. ఆయన మొదట యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ప్రాచ్య పాఠశాలలో సంస్కృతాన్ని నేర్చుకోవడానికి చేరారు. ఆ తర్వాత క్రమంగా అనేక విద్వాంసుల దగ్గర శుశ్రూష చేసి, పాఠశాలలో చదివి ఆ పాండిత్యాన్ని వృద్ధి చేసుకున్నారు. చివరకు సీతారాంబాగ్ కళాశాలలో పాణిని వ్యాకరణాన్ని పతంజలి మహాభాష్యంతో సహా చదువుకొనే అవకాశం కోసం ప్రయత్నం చేయగా అక్కడ పాఠశాలకు అధిపతిగా ఉన్న శ్రీమాన్ కోయల్ కందాడై శఠగోప రామానుజాస్వామివారు అంతకుముందు తమకున్న నియమాలన్నీ విడిచిపెట్టి శ్రీహరికి పాతంజలి మహాభాష్యాన్ని పాఠంగా చెప్పినారు. అది ఒక మరపురాని ఘట్టం. అక్కడి విద్యార్థులలో సంప్రదాయ కుటుంబాల నుండి వచ్చినవారు ఎంతమంది ఉన్నా వాళ్ళందరినీ వెనకకు త్రోసి తన పాండిత్యాన్ని నిరూపించుకునే అవకాశం శ్రీహరికి లభించింది.

ఆ తరువాత సంస్కృతంలో, తెలుగులో ఎం.ఏ చేసి కళాశాల స్థాయిలో అధ్యాపకత్వాన్ని చేపట్టినారు. క్రమంగా తన సాహిత్యకృషిలో భాస్కర రామాయణానికి అనేక తాళపత్ర ప్రతులను సంప్రదించి, నిర్దిష్టమైన కావ్యరూపాన్ని తీసుకురావడం అంటే గ్రంథ పరిష్కరణ పద్ధతిని ఆయన ముందుకు తీసుకువచ్చారు. అదొక విశేషమైతే, ఆయన సాధారణంగా ఎక్కడ కూర్చున్నా సరే, ఎవరు మాట్లాడుతున్నా సరే ఏదైనా ఒక మాట వాడుకలో అరుదుగా కనిపిస్తే ఒక కాగితం మీద వ్రాసుకునేవారు. ఆ విధంగా ఒక్కొక్క ప్రాంతంలో వాడే ప్రాంతీయ శబ్దాలు ముఖ్యంగా 'నల్లగొండ జిల్లా ప్రాంతీయ భాషా కోశాన్ని' ఆయన నిర్మించారు. అది ఆయన నిఘంటు నిర్మాణ పద్ధతికి మొదటి మెట్టుగా మనం భావించవచ్చు. ఆ తరువాత తెలుగు కావ్యాల్లో, తెలుగు సాహిత్యంలో కనిపించే అనేక శబ్దాలను కూడా సూర్యరాయాంధ్ర నిఘంటువులో కనిపించని శబ్దాలను దానికి పరిశేషంగా 'శ్రీహరి నిఘంటువు' అనే గొప్ప నిఘంటువును నిర్మించారు. శబ్దరత్నాకరం, సూర్యరాయాంధ్ర నిఘంటువు పద్ధతిలో పాత ప్రయోగాలను చూపిస్తూ ఆ నిఘంటు నిర్మాణం జరిగింది. అది ముందుకు పోయిన తర్వాత తాళ్ళపాక పదకోశాన్ని నిర్మించారు. పాణిని అష్టాధ్యాయిని అనువాదం చేశారు. ఫిరదౌసి కావ్యాలను సంస్కృతంలోకి అనువాదం చేశారు. ఇలా ఆయన కృషి ఒక సముద్రమంత విశాలమైంది. అయినా ఆయన వినయశీలి, మిత్రుడు ఉత్తమ వ్యక్తి. నేను ఆయనతో కలిసి సరస్వతీ సమ్మాన్ ప్రాంతీయ భాషా సమావేశాల్లో పాల్గొన్నాను. రెండుమూడు సార్లు తిరువనంతపురం, చెన్నై, బెంగుళూరు వంటి ప్రాంతాలకు ఆయనతో కలిసి ప్రయాణం చేసే అవకాశం లభించింది. అటువంటి విద్వాంసుడు తెలుగు పాండిత్యానికి, తెలుగు భాషా శక్తికి సంస్కృత పాండిత్యాన్ని జోడించుకుంటే అది సమష్టిపూర్తిగా ఏర్పడితే ఆ రూపం శ్రీహరిగారు. అలాంటి శ్రీహరిగారు ఇవాళ లేరని చెప్తే నాకు ఆశ్చర్యంగా ఉంది. కొన్ని సంవత్సరాల క్రితం ఆయన చేసిన కృషిని అభినందిస్తూ 'శ్రీహరి విజయం' అనే గొప్ప గ్రంథాన్ని వెలువరించారు. ఆయన చేసిన కృషి కూడా అభినందనీయమే. అటువంటి వ్యక్తికి ఉత్తమ లోకాలు సంప్రాప్తించాలని కోరుకుంటూ నా సానుభూతిని తెలియజేస్తున్నాను.





ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8 29 UGC Care List Approved Journal
హైదరాబాద్ జూన్ : 2023

# ఆదర్శనీయం – ఆచార్య రవ్వా శ్రీహరి వ్యక్తిత్వం

**డా. విస్తాలి శంకర రావు,** ఫోన్ : 9445 203041

గ్రామీణ నేపథ్యం, అత్యంత ఆధునిక భావాలకు నిలయమైన ప్రదేశం, భాష, భావం, నడవడిక అన్నీ అప్పుడే మొదలెడుతున్నమా?, చదువుల్లో మనం ఎక్కడ ఉన్నాం? తోటి విద్యార్థులు ఎక్కడ ఉన్నారు? అనే ఆత్మనూనతాభావం కలిగించే సందర్భంలో అత్యంత ప్రతిభావంతులైన ఆచార్యుల బోధనలోకి ప్రవేశించాం. అక్కడి వాతావరణం ఒక్క మాటలో చెప్పాలంటే శ్రీశ్రీ చెప్పిన **'మరో ప్రపంచం'** ఎక్కడోలేదు మన కళ్ళముందే ఉందా? అనేలా అమోమయం.

బిక్కు బిక్కుమంటూ నేను నా స్నేహితులు సుధాకర్ ఇద్దరం కలిసి డిగ్రీ వరకు ఉన్నా సర్టిఫికెట్స్‌లను తీసుకుని స్నేహితుడు రాజ్ సహాయంతో హైదరాబాద్ విశ్వవిద్యాలయం, తెలుగు శాఖలో అడుగుపెట్టిన మాకు తరగతులు కూడా వెంటనే మొదలైనాయి.

ఆచార్య పరిమి రామనరసింహం గారు భాషాశాస్త్రం, ఆచార్య జి.వి.ఎస్.గారు ప్రాచీన సాహిత్యం, ఆచార్య కె.కె.ఆర్. గారు ఆధునిక సాహిత్యం, ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య గారు ప్రాచీన సాహిత్యం, విమర్శ ఇలా వారి పాఠాలు మమ్మల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

ఒక మిత్రుడు వచ్చి ఇప్పుడు మనకు సంస్కృతం క్లాసు ఉంది. ఆచార్య రవ్వా శ్రీహరిగారు వస్తున్నారు అన్నాడు. శ్రీహరిగారు అప్పుడు శాఖాధ్యక్షులు కూడా.

సంస్కృతం క్లాసు మొదలైంది. నాకు ఒకవైపు సుధాకర్, మరొకవైపు నాగభూషణం ముగ్గురం కూర్చుని గుసగుసలు ఆడుకుంటున్నాం. మనం గ్రామీణ నేపథ్యం నుండి వచ్చాం, ఏదో మొండిగా చదువుకుని ఇక్కడకు వచ్చాం. అందులోను ఇక్కడ సంస్కృతం క్లాసు. ఎలా ఉ ంటుందో అనే ఆందోళనలో ఉన్నాం. సరే ఏదైతే అదయింది కానీ అనుకుని ముగ్గురం మొండిగా కూర్చున్నాం.

శ్రీహరిగారు పాఠం ప్రారంభించారు. అందరి వైపు చూస్తూ నవ్వుతూ చక్కగా మన ఆత్మీయులు మాట్లాడినట్లు విద్యార్థులందరి కళ్ళలో కళ్ళు కలుపుతూ మాట్లాడుతున్నాడు.

శ్రీహరిగారి కళ్ళు నా కళ్ళలో కలిసినప్పుడు... ఒక్కసారిగా గుండె జల్లుమని నీరు కారినట్లు అయింది. ఆ గంట ఎలాగడుస్తుందో... ఎప్పుడెప్పుడు అయిపోతుందో... అనుకుంటున్న నాకు ఒళ్ళు అంతా చెమట్లు పట్టినట్లు అయింది. సుధాకర్ పరిస్థితి గమనించి శంకర్ ఏంకాదు. కానీ అని ధైర్యం చెప్పాడు.

పలకరింపులు అయి శ్రీహరిగారు మాకు తెలియకుండానే పాఠంలోకి తీసుకువెళ్లి మన ఊరిలో మాట్లాకునే పదాలు గురించి చెబుతున్నారు. అరే సార్ చాలా బాగా మాట్లాడుతున్నాడే. సంస్కృతం ఇంత సులభంగా ఉంటుందా? అందరం కొంచెం స్థిమితపడ్డాం. ఆ రోజు పాఠం పూర్తి అయ్యేసరికి.... అంతకు ముందు ఏ పాఠం విన్నప్పుడు కలగని అనుభూతి ఆ రోజు కలగడంతో శ్రీహరిగారు అంటే అంతకు ముందు ఉన్నా భయం పోయి వారి మీద, వారు బోధించే సంస్కృతం మీద ఇష్టం పెరిగింది.



ఆ తర్వాత తరగతి బయట ఎక్కడ కనిపించినా చల్లని చిరు నవ్వుతో వారు మనల్ని చూచినప్పుడు ఎంతో తృప్తిని కలిగించింది. సార్ ఎంత గొప్ప స్థాయికి వెళ్లినా, శాఖాధ్యక్షులుగా ఉన్నా, విద్యార్థుల పట్ల... ముఖ్యంగా గ్రామీణ విద్యార్థుల పట్ల వారు చూపే ప్రేమ ఎంతో గొప్పదో అనిపించింది. ఇలాంటి ఉపాధ్యాయుల దగ్గర చదువుకోవడం ఎంతో అదృష్టంగా భావించాము.

సంస్కృత వ్యాకరణంతో పాటు మేఘసందేశం, మాళవికాగ్ని మిత్రం, రఘువంశం మొదలైన కావ్యాలు గురించి వారు చెబుతూ ఉంటే ఎంతో ఆనందాన్ని కలిగిస్తూ, సంస్కృతం బాగా నేర్చుకోవాలనే ఆసక్తిని కలిగించేలా శ్రీహరిగారు ప్రేరణగా నిలిచారు.

ఎం.ఏ.. చివరి దశకు చేరే సమయంలో అందరూ మంచి ఉ పాధ్యాయులు దగ్గర చదివామనే తృప్తితో, ఆత్మవిశ్వాసంతో ఉన్నాం. వారిచ్చిన విజ్ఞానంతో ఏ అంశాన్ని అయినా మనం బోధించవచ్చు, అలాగే ఇంకా కృషి చేస్తే అందులో మరింత జ్ఞానాన్ని సంపాదించి సాహిత్యంలో ఎంతో మంచిగా ఎదగొచ్చు అనే ఆత్మస్థైర్యం ఆ రోజు ఏర్పడింది.

నాకు సాహిత్యంలో సలహాలిచ్చేందుకు వెనుకముందు ఎవరు లేరు. ఎప్పటికప్పుడు గాలివాటంగా తెలుసుకుంటూ ముందుకు సాగుతున్న రోజులవి. యం.ఎ. పూర్తి అయింది. తర్వాత ఏం చేయాలి అనే ప్రశ్న భయపెట్టెలా వెంటాడుతుంది. తోటి మిత్రులు దాదాపు మా తరగతిలో ఉన్న వారిలో అందరూ యం.ఫిల్. చేద్దామని అప్లై చేస్తుంటే నేనూ చేశాను. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలలో యం.ఫిల్., పిహెచ్.డి. చేయడమంటే అంత తేలికైంది కాదు. నా తోటి విద్యార్థులు ఒక్కొక్కరు వారికి ఇష్టమైన అధ్యాపకుల దగ్గరకు వెళ్లి పరిశోధనాంశం ఎంచుకుంటున్నారు. నాకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. అందులోను నేను ఆ తరగతిలో టాప్ స్టూడెంట్‌ను కూడా కాదు. నా తోటి విద్యార్థులు సీటు నాకు వస్తుంది, నాకు వస్తుంది అంటూ ఉంటే భయం వేసి ఇక మనం ఇంటికి వెళ్లవలసిందే అనే భావన కలిగింది. అయినా ఒక ప్రయత్నం చేద్దామని నేను వీధి నాటక కళాకారుల కుటుంబం నుండి వచ్చాను కాబట్టి ఆ నాటకాలపై పరిశోధన చేస్తే బాగుంటుందని ఎంచుకుని ఇంటర్వ్యూకు సిద్ధం అయ్యాను. నా తోటివారు ఏవేవో శీర్షికలు చెబుతూ భయపెడుతున్నారు. ఇంటర్వ్యూ రోజు రానే వచ్చింది.

నా పేరు పిలిచి లోపలికి వెళ్లు అని తెలుగుశాఖలో పనిచేసే శ్రీ పరమేశ్వర్ గారు చెప్పారు. బిక్కుబిక్కు మంటూ, చెమట్లుపడుతూ లోపలికి వెళ్లాను. శాఖాధిపతిగా ఆచార్య రవ్వా శ్రీహరిగారు ఎదురుగా కూర్చుంటే మిగిలిన అధ్యాపకులు రెండు వైపుల కూర్చొని నవ్వుతూ ఉన్నారు. నాకు నోట మాట రాలేదు. అది గమనించిన శ్రీహరిగారు ఏం నాయనా మంచినీళ్లు ఏమైనా తాగుతావా? అన్నారు. నాకు గొంతు ఎండినట్లుగా ఉండి తాగాలనిపిస్తుంది కూడా. తాగుతానంటే ఏమంటారోనని బిత్తర చూపులు చూస్తూ ఉండి పోయాను.

శ్రీహరిగారు బెల్ గట్టిగా కొట్టగా "అయూబ్" అటెండర్ లోపలికి రాగా ఒక గ్లాసు నీళ్ళు తీసుకురా! అన్నారు. నీళ్లు వచ్చాయి. తాగాను అందరివైపు చూశాను.

మొదటిగా శ్రీహరిగారు ఏం... నాయనా... పరిశోధన చేయాలని ఉందా? అన్నారు. చేయాలని ఉంది సర్ అన్నాను. దేని మీద చేద్దాం అనుకుంటున్నావు అన్నారు. అలా అని ఏమి భయపడవద్దు చక్కగా నీకు తెలిసింది చెప్పు అన్నారు.

'ప్రకాశం జిల్లా వీధి నాటకాలు' అన్నాను. వీధినాటకాలు గురించి నీకు ఏమైనా తెలుసా అన్నారు. నా కుటుంబ జీవనాధారం అదే, మా నాన్న గారు వీధినాటక కళాకారులు అన్నాను.

నా ఇంటర్వ్యూలో మొదట ఐదు నిమిషాలు శ్రీహరిగారే మాట్లాడుతూ నన్ను చాలా సాధారణ స్థితికి తీసుకువచ్చారు. ఇంటర్వ్యూ దాదాపు 20 నిమిషాలు పాటు జరిగింది. శ్రీహరిగారు నాకు అప్పుడు ప్రత్యక్ష దైవంలా కనిపించారు. ఎందుకంటే సీటు వస్తుందో రాదో అలా ఉంచితే, ఇంటర్వ్యూను ఎంతో చక్కగా, ఇబ్బందిలేకుండా నిర్వహించడం, వీధి నాటకాలు గురించి నాకు తెలిసిన అంశాలను చక్కగా రాబట్టారు. అలాగే ఇతర అధ్యాపకులు అడిగిన ప్రశ్నలకు దాదాపు సంతృప్తిగానే చెప్పాను.

చివరగా శ్రీహరిగారు ఒక ప్రశ్న వేశారు.

సరే చివరగా ఒక ప్రశ్న జానపదంలో వచ్చిన ఒక పుస్తకం పేరు చెప్పగలవా? అన్నారు.

ఆలాగే చెబుతాను సర్ అని బిరుదురాజు గారు రాసిన "జానపదగేయ సాహిత్యం" అన్నాను. శ్రీహరిగారు నవ్వి అది "తెలుగు జానపద గేయసాహిత్యం" అని సవరించి ఇక వెళ్ళు అన్నారు.

బ్రతికానురా నాయనా అని బయటకు వచ్చాను... నా మొఖంలో నాకే తెలియని ఆనందం, సంతోషం.

నా స్నేహితులు దగ్గరకు వచ్చి ఏం అడిగారు?. ఎలా చెప్పావు అని అడిగారు?. అప్పుడు ఒకే మాట చెప్పాను.

ఇంటర్వ్యూ న్యాయబద్ధంగా జరిగితే నాకు తప్పని సరిగా సీటు వస్తుంది అన్నాను. అవునా? ఏం అంత బాగా చేశావా? అన్నారు. శ్రీహరిగారు ఎంతో సహృదయంతో ఇంటర్వ్యూను నిర్వహించారు. నాకు సీటు రాక పోయినా పర్వాలేదు. ఇంటర్వ్యూ బాగా చేశాననే ఒక గొప్ప తృప్తి కలిగింది అన్నాను. అటువంటి స్ఫూర్తిని ఇచ్చింది ఆచార్య రవ్వా శ్రీహరిగారి సహృదయ వ్యక్తిత్వమే.

విద్యార్థులతో ఎలా ఉండాలి. ఎంత ప్రేమ చూపాలి అనేది శ్రీహరిగారిని చూసే నేర్చుకున్నాను.

నేను ఈ రోజు మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ అధ్యక్షులుగా ఉన్నా, విద్యార్థులతో ఎలా మెలగాలి, వారిని ఎలా ప్రోత్సహించాలి, ఇంటర్వ్యూలు ఎలా చెయాలి, ఇంటర్వ్యూలు ఎలా నిర్వహించాలి ఇలా ఎన్నో విషయాలలో శ్రీహరిగారి వ్యక్తిత్వం ఆదర్శప్రాయంగా నిలిచింది. ఇప్పుడు నేను అధ్యాపక వృత్తిలో ఉండడంతో వారి వ్యక్తిత్వం, నడవడిక, నాకు ఈ రోజుకు స్ఫూర్తి దాయకంగానే ఉంటాయి.

ఆ మధ్య తిరుపతిలో ఒక సాహితీ కార్యక్రమంలో శ్రీహరి గారిని కలిసాను. నేను మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ తరఫున పాల్గొని, వారి ప్రక్కనే కూర్చుని, వారితో పాటు చర్చలో పాల్గొనడం మధురానుభూతిని కలిగింది.

శ్రీహరిగారి భాషాపరిజ్ఞానం, పద సంపద, ఎంత గొప్పదో నేను అధ్యాపకులుగా ఉండి ఆ రంగంలో కృషి చేస్తున్నా కాబట్టి ఇప్పుడు ఇప్పుడు నాకు బాగా అర్థం అవుతుంది. ఎలాంటి అధ్యాపకుల దగ్గర చదువుకున్నామో కదా అనే తృప్తి కలిగింది.

శ్రీహరిగారిని మద్రాసు విశ్వవిద్యాలయంకు ఆహ్వానించి వారి చేత ఉపన్యాసాలు ఇప్పించడమే కాక, వారికి తెలుగుశాఖ బిరుదు, సత్కారాలతో ఘనంగా సన్మానించుకున్నాం అనే తృప్తి కలిగింది. నేను వారి దగ్గర ఎం.ఏ., చదువుకునే రోజుల్లో పాఠం చెప్పే సమయంలో ఎంత సహృదయతతో ఉన్నారో, ఇప్పుడు ఒక విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా ఉన్నా, నేడు భాషా వ్యాకరణశాస్త్రాల్లో ఉన్నత స్థాయికి చేరినా, వారి వ్యక్తిత్వంలో ఎటువంటి భేదం లేదు.

భాషను ఎలా ఉపయోగించాలి, పదాలను ఎలా ప్రయోగించాలి. ఎక్కడ ఎంత వరకు భాషా విరుపులు ఉండాలి. అనే విషయాలు గమనిస్తే బంగారు వ్యాపారి బంగారాన్ని ఎలా తూచుతాడో శ్రీహరి గారు కూడా భాషను ప్రయోగించడంలో అంత నిపుణతను ప్రదర్శిస్తారు. భాషను ఉపయోగించడం ఎలా అని వారిని కలిసిన ప్రతి సారీ అనిపిస్తూనే ఉంటుంది.

ఇలా ఎన్నో విషయాలు వారి నుండి నేర్చుకోవడమైంది. నేను అధ్యాపక రంగంలో ఉన్నందువలన వారి జీవితం నాకు మార్గదర్శకంగా నిలిచింది. అయితే శ్రీహరిగారి జీవితాన్ని గమనిస్తే సాధారణ కుటుంబం నుండి సాహిత్యరంగంలోకి ప్రవేశించి అత్యంత కష్టమైన మార్గం ఎంచుకుని అందులో అత్యున్నత స్థాయికి ఎదగడమంటే అది నిజ జీవితంలో అతికొద్దిమందికి మాత్రమే సాధ్యం అయ్యేది అనిపిస్తుంది. అటువంటి ఘనతను సాధించిన ఆదర్శ ప్రాయుని జీవితం ఆదర్శనీయం.



ద్రవిడ విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక సాహితీ కార్యక్రమంలో వారితో పాటు నేను పాల్గొన్నప్పుడు మాటల సందర్భంలో బాబూ! నువ్వు ఇలా విశ్వవిద్యాలయ స్థాయికి ఎదగడం, నా విద్యార్థిగా ఉండడం, ఎంతో సంతోషంగా ఉంది. నువ్వు పని చేసే విశ్వ విద్యాలయంలో ఉద్దండులైన సాహితీవేత్తలు కృషి చేశారు. కాబట్టి నువ్వు ఎంతో గొప్పగా కృషి చేయాలి అని తెలిపారు.

పాఠ్యాంశాలు బోధించే అధ్యాపకులకు ఒక రంగంలో పరిజ్ఞానం ఉంటే అది పరిపూర్ణం కాదని, వీలయితే భాషాశాస్త్రం, సంస్కృతంలోను కొంత కృషి చేస్తే మన బోధనకు మరింత పట్టు వస్తుందని, వీలయితే అవి కూడా ప్రయత్నం చేయమని అన్నారు. అలా చేసినందువలన మనకు వేరే ఉపయోగాలు ఏమీ లేకపోవచ్చు బోధన సమర్థవంతంగా ఉంటుంది. విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది అన్నారు.

శ్రీహరిగారి మాటలు నన్ను ఎంతో ఉత్తేజ పరిచాయి. ఆ స్ఫూర్తి తోనే నేను యం.ఏ., భాషాశాస్త్రాన్ని పూర్తి చేశాను. ఆ తర్వాత సంస్కృతం చేయాలనే కోరిక బలంగా ఉండేది. కనుక ప్రస్తుతం ఎం.ఏ., సంస్కృతంలో చేరి ప్రథమ సంవత్సరం పూర్తి చేసి, ద్వితీయ సంవత్సరంలోకి అడుగుపెట్టినందుకు ఎంతో తృప్తిగా ఉంది.

ఇలాంటి గురువుగారు భౌతికంగా మనకు దూరమైనా, వారి వ్యక్తిత్వం, ప్రేమ, సహృదయత వారి శిష్యులకు ఆభరణాలుగా, ఆశీర్వాదాలుగా నిలుస్తాయి. అటువంటి శిష్య వర్గంలో నేను ఒకడిని కావడం ఎంతో అదృష్టంగా భావిస్తూ, గురువుగారి సాహితీ కీర్తి తెలుగు సాహిత్యం ఉన్నంత కాలం సహృదయ పరిమళాలను వెదజల్లుతూనే ఉంటుందని విశ్వసిస్తున్నాను.



వేద సంస్కృతి పరిషత్,
మూసీ సాహిత్య ధార,
ఆధ్వర్యంలో ఆచార్య రవ్వా శ్రీహరి గారికి
బి.ఎన్.శాస్త్రి స్మారక పురస్కారం ఇచ్చే
సందర్భం

సభలో పాల్గొన్న
డా. కె.వి. రమణాచారి,
డా. శ్రీరంగాచార్య
డా. నందిని సిధారెడ్డి
ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి
ఆచార్య సాగి కమలాకర శర్మ
డా. మాదిరాజు హరినందన రావు గార్లు








పురస్కార అనంతరం
మూసీ సంపాదకులు
సాగి కమలాకర శర్మ,
సహ సంపాదకులు
డా. అట్టెం దత్తయ్య
పరిశోధక విద్యార్థి
వర్ధ వేణులతో
ఆచార్య రవ్వా శ్రీహరి గారు

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా, తెలంగాణ సాహిత్య అకాడమీ వారి సహకారంతో మూసీ మాసపత్రిక ప్రచురించిన 'ఆలోకనం' (తెలంగాణ 31 జిల్లాల సంక్షిప్త సమాహారం) గ్రంథావిష్కరణలో పాల్గొన్న ఆచార్య రవ్వా శ్రీహరిగారు






గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య రవ్వా శ్రీహరిగారు

'ఆలోకనం' గ్రంథావిష్కరణ సభలో మూసీ సంపాదక దంపతులతో ఆచార్య శ్రీహరి దంపతులు



# భారతీయ సంస్కృత విద్వాంసులలో ఒక రవ్వ – ఆచార్య రవ్వా శ్రీహరి

ఆచార్య పరిమి రామనరసింహం, ఫోన్ : 98493 16730

అది 1985, బహుశ మే నెల అనుకుంటాను. హైదరాబాదు విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగంలో లెక్చరర్ పోస్టు ఇంటర్వ్యూకు వచ్చాను మైసూరు నించి. అప్పుడు నేను మైసూరులోని కేంద్ర భారతీయ భాషా సంస్థలో లెక్చరర్-కమ్-జూనియర్ రీసెర్చ్ ఆఫీసరుగా పనిచేస్తున్నాను. ఆ ఇంటర్వ్యూలో మొదటిసారిగా చూశాను శ్రీహరి గారిని. అప్పటికే ఉస్మానియా యూనివర్సిటీలో రీడర్ పోస్టులో ఉన్న శ్రీహరిగారు డెప్యుటేషన్ మీద హైదరాబాదు యూనివర్సిటీలో రీడర్‌గా పనిచేస్తున్నారు. పర్మినెంట్ రీడర్ పొజిషన్ కొరకు ఆ ఇంటర్వ్యూకు హాజరు అవుతున్నారు. అదే ఇంటర్వ్యూకు అక్కడే పని చేస్తున్న జి.వి. సుబ్రహ్మణ్యం గారు, ఆనందారామం గారు ప్రొఫెసర్ పోస్టుకు, రీడర్ పోస్టుకు హాజరు అవుతున్నారు. వారెవరినీ అప్పటికి నేను వ్యక్తిగతంగా ఎరుగను. కాని వారి పేరు ప్రతిష్ఠలు తెలుసు. ఇంటర్వ్యూలో వారు ముగ్గురూ సెలెక్ట్ అయ్యారు; నేను కూడా సెలెక్ట్ అయ్యాను. హైదరాబాదులో తెలుగు అకాడెమీలో పని చేసే నా మిత్రుడు కుంటముక్కల లక్ష్మీనారాయణ శర్మ కూడా ఆ ఇంటర్వ్యూకు వచ్చాడు. అతని ద్వారా తెలిసింది నాకు వారు ఫలానా, వీరు ఫలానా అని.

30-6-1985న నేను యూనివర్సిటీలో లెక్చరర్‌గా చేరటానికి వచ్చినప్పుడు అప్పటికే శ్రీహరిగారు రీడర్‌గా నియామకం పొంది తెలుగు శాఖలో చేరారు. అప్పుడు తెలుగు శాఖ గోల్డెన్ థ్రెషోల్డ్‌లో ఉండేది. శ్రీహరిగారు, ఆనందారామంగారు కూర్చుంటున్న గదిలో నాకు కూడా సీటు ఏర్పాటు చేశారు. ఆనందారామంగారు క్లాసులు తీసుకుంటూనో, లైబ్రరీలోనో, ఏదో ప్రాజెక్టు పని మీద సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీ సభ్యులతో మీటింగులలోనో ఉండటం వల్ల మా గదిలోని తమ సీటులో ఎక్కువ సమయం ఉండేవారు కాదు. శ్రీహరిగారు మాత్రం క్లాసు గంటలు పోను ఎక్కువ సమయం రాసుకుంటూనో, చదువుకుంటూనో సీటులోనే ఉండేవారు. అదే విధంగా నేను కూడా ఎక్కువ సమయం సీటులోనే ఉండేవాణ్ణి. ఆ విధంగా రోజులో చాలా సమయం శ్రీహరిగారితో కలిసి కూర్చునే అవకాశం ఏర్పడింది. గోల్డెన్ థ్రెషోల్డులో ఒక సంవత్సరం ఉన్నాం అనుకుంటాను. ఆ సంవత్సర కాలంలో శ్రీహరిగారి దగ్గర నేను సంస్కృతంలో ఇన్ఫార్మల్ ఎడ్యుకేషన్ పొందాను. ఆ విధంగా శ్రీహరిగారి దగ్గర ఎంతో నేర్చుకోగలిగాను. ఆ కారణంగా వారు నాకు గురు స్థానీయులైనారు. శ్రీహరిగారంతటి వారిని ప్రశ్న అడిగేటంత సామర్థ్యం లేని నేను లేవనెత్తే సందేహాలకూ ప్రశ్నలకు చాలా ఓపికగా, నిబద్ధతతో వివరంగా చెప్పేవారు.

సంస్కృత భాష గొప్పదనం, వ్యాకరణ శాస్త్రంలోని పరిభాష, మహాభాష్యం రచనా విధానం, పాణిని వ్యాకరణంలో కావ్య భాషకు వైదిక భాషను కూడా కలుపుకుంటూ ఎట్లా నిరూపించాడు ఇటువంటి గంభీరమైన విషయాలు మనస్సుకు హత్తుకునేలా చెప్పేవారు. తాను సంస్కృత అధ్యయనం ఎట్లా చేశారు; చేస్తూనే ఇంగ్లీషు ఎట్లా చదువుకున్నారు; తెలుగులో పిఎచ్.డి. ఎట్లా చేశారు; ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తమ బోధనానుభవం, పరీక్షలు నిర్వహించే పద్ధతి, ఇన్విజిలేటరుగా తమ అనుభవాలు ఇట్లా ఎన్నో విషయాలు మా సంభాషణలో వచ్చేవి. నాకు యూనివర్సిటీ విధానం కొత్త. ఆ విషయంలో కూడా శ్రీహరిగారి దగ్గర ఎంతో తెలుసుకున్నాను.

నేను సంప్రదాయ సిద్ధంగా సంస్కృతం చదువుకోలేదని, ఎమ్.ఏ. తెలుగులో భండార్కర్ మాత్రమే చదువుకున్నానని, చిన్నతనం నించి కావ్య పఠనం ద్వారా కొద్దిగా నేర్చుకున్నానని, భాషాశాస్త్ర విద్యార్థిగా వ్యాకరణం మీద కొంత ఉత్సాహం కలిగిందని నా గురించి చెప్పుకునే వాణ్ణి. సంస్కృత వ్యాకరణం పట్ల నాకు ఉన్న ఆసక్తిని సహృదయంతో మెచ్చుకునేవారు.

శ్రీహరిగారు అనేక గ్రంథాలు రచించారు. తమ సొంత జిల్లా నల్లగొండ జిల్లా వ్యవహారంలోని ప్రత్యేక పదజాలాన్ని సేకరించి ప్రచురించారు. తెలుగు కావ్యాలను సంస్కృతంలోకి అనువదించారు. వీటి అన్నిటి ప్రత్యేకత, వైశిష్ట్యం వీటిది కాగా, వారు నిర్మించిన శ్రీహరి నిఘంటువు వారి దీక్షకు, పరిశోధనా పటిమకు, నిత్య అధ్యయన శీలానికి నిలువెత్తు నిదర్శనం. సూర్యరాయాంధ్ర నిఘంటు శేషంగా బృహన్నిఘంటువైన సూర్యరాయాంధ్ర నిఘంటువులో లేని సుమారు 35,000 ఆరోపాలతో ఆంధ్ర సరస్వతికి ఆచార్య రవ్వా శ్రీహరిగారు సమర్పించిన రవ్వల హారం శ్రీహరి నిఘంటువు. వారు కుప్పంలో ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా ఉండగా ఒకసారి నేను అక్కడికి వెళ్ళటం తటస్థించింది. అప్పుడు వారి కార్యాలయంలో వారిని కలవటానికి వెళ్ళినప్పుడు బల్ల నిండా వారి నిఘంటు నిర్మాణానికి సంబంధించిన పుస్తకాలతోనూ, కాయితాల తోను వారు ఆ పనిమీద తలమునకలుగా ఉండటం చూశాను. ఒకవైపు విశ్వవిద్యాలయ నిర్వహణ బాధ్యతల ఒత్తిడిలో కూడా తమ పరిశోధనలో నిమగ్నులై ఉన్న శ్రీహరిగారి నిత్య పరిశోధనా వ్యగ్రత నన్ను ముగ్ధుణ్ణి చేసింది.

మహామహోపాధ్యాయ ఆచార్య రవా శ్రీహరి గారి విద్వత్తును భారతదేశంలోని ఎన్నో సంస్థలు గుర్తించి, సన్మానించి, గౌరవాన్ని పొందినై. అటువంటి మహా విద్వాంసుడు, నిత్య పరిశోధనా కృషీవలుడు, అద్భుతమైన అధ్యాపకుడు ఆచార్య రవా శ్రీహరిగారితో కలిసి పనిచేయటం ఒక గొప్ప అదృష్టం.

# సమున్నత వ్యక్తిత్వ శిఖరం – ఆచార్య రవ్వా శ్రీహరి

ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు, ఫోన్ : 9441 330 511

నా చిన్నతనంలో వ్యాకరణాన్ని మడికట్టుకొని బోధించే పండితుల్ని చూశాను. వేదాంగాలలో ఒకటైన వ్యాకరణాన్ని పవిత్రంగా భావించటం వలననే అలా బోధించేవారు. మడితో బోధించే వ్యాకరణాన్ని ఏ మడీ తెలియని శ్రీహరికి బోధించి అక్కున చేర్చుకున్న ఆ గురువుల ప్రేముడికి ఎన్ని జోతలర్పించాలి!

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నేను పిహెచ్.డి చేసేటప్పుడు ఆంధ్రదేశంలో మొట్టమొదటిసారిగా దళిత సాహిత్యంపై పెద్ద సదస్సు జరిగింది. ఆ సదస్సుకు నండూరి రామకృష్ణమాచార్యగారు విచ్చేశారు. సదస్సులో నండూరివారిని పరిచయం చేస్తూ వారిది అభ్యుదయ దృక్పథమని, ఏనాడు వర్ణ వివక్ష నెరుగని మనసని, దళితుల పక్కన కూర్చొని భోజనం చేయటానికి చిన్నతనంలోనే ఏ అభ్యంతరాలు పాటించలేదంటూ... ఏవో రెండు మంచి మాటలు సభా మర్యాదగా చెప్పారు. అప్పుడు అదే సమావేశంలో ఉన్న మరోక దళిత ప్రముఖుడు ప్రసంగిస్తూ 'దళితుల పక్కన కూర్చొని భోజనం చెయ్యటానికి వారికి ఎటువంటి అభ్యంతరం ఉండదంటూ పరిచయ ప్రసంగం చేశారు. కాని వారి పక్కన కూర్చొని భోజనం చేయటానికి దళితునిగా నాకు అభ్యంతరమంటూ మాట్లాడారు. సభలో ఉన్న చాలామంది ఆ మాటలకు బిత్తరపోయారు."

శ్రీహరిగారికి ఏడుపదులు దాటాక ఇంటర్వ్యూ చేస్తూ బాల్యంలో యాదగిరి లక్ష్మీనృసింహస్వామి ప్రాచ్య కళాశాలలో చదువుకునే నాటి సందర్భాన్ని గుర్తు చేసి "భోజన సమయంలో మిమ్మల్ని వేరుగా కూర్చోబెట్టేవారు కదా! మీకేమీ వివక్ష అనిపించలేదా?" అని అడిగితే "మా గురువులెప్పుడూ విద్యా విషయంగా నన్ను అబ్రాహ్మణుడిగా చూడలేదు. కులస్పర్థ మా విద్యార్థుల మధ్య కూడా ఉండేది కాదు. భోజనాల సందర్భంలో మాత్రం విడిగా కూర్చోబెట్టేవారు. బ్రాహ్మణులకు, వైష్ణవులకు తినే స్థలాలు వేరుగా ఉండేవి. స్మార్త విద్యార్థులు కూర్చొని తిన్న తరువాత మమ్మల్ని కూర్చోబెట్టి వడ్డించే వారు. నాకది పెద్దగా బాధ అనిపించలేదు. ఎందుకంటే వాళ్లు నన్ను ఎంతో ప్రేమతో చూస్తున్నారు. బాగా చదువుతున్నానని ప్రోత్సహిస్తున్నారు. దాంతో వివక్ష అన్న భావనకు తావులేదని పించింది. అదొక ఆచారం. ఆ ఆచార పద్ధతి ప్రకారం మేము నడుస్తున్నామనిపించింది. అంతే" అని సమాధానం చెప్పారు.

పైన ప్రస్తావించిన ఆంధ్ర విశ్వవిద్యాలయపు సంఘటన, ఈ సంఘటన రెండింటినీ అస్తిత్వవాద ఉద్యమాల నేపథ్యంలో చూస్తే రెండవది వివక్షగా కనిపించవచ్చు. కానీ కడుపునిండా అన్నం పెట్టి,




గుండెనిండుగా ప్రేమించి, చదువుచెప్పే గురువులు కళ్లెదుట ఉంటే కడుపు నింపని కపటప్రేమల నాటకాలు పనిచేస్తాయా! డెబ్బయి ఏళ్ళ తరువాత కూడా, అన్ని పదవుల్ని అధిరోహించాక కూడ చెదరిన సంయమనంతో ఆ బాల్య విద్యాభ్యాస కాలాన్ని సమీక్షించిన శ్రీహరిగారి సంస్కారానికి కైమోడ్పు.

కేవలం పైరవీలతో, ప్రతిభను మించిన ప్రచారంతో పైకొచ్చిన వాళ్లను సమాజంలో మనం చాలామందిని చూశాం. కాని విద్యను, నిరంతర కృషిని నమ్ముకొని, ఆ విద్యవలననే ప్రేమించబడి గుర్తింపును, గౌరవాన్ని పొందిన శ్రీహరిగారు తరాలకు ఒజ్జబంతి. 'మహామహోపాధ్యాయ' అన్న కీర్తికి నిక్కమైన విలువను సమకూర్చి పెట్టిన జాతిరత్నం. నేను వారు పరమపదించిన సందర్భంలో వారి గురించి ఒక వ్యాసం పత్రికకు రాశాను. ఆ వ్యాసాన్ని చదివి దాదాపు ఒక వంద ఫోనులు వచ్చాయి. అలా ఫోన్ చేసినవాళ్లలో పెద్ద పదవులలో ఉన్నవాళ్లు, ఉద్యోగం ముగిసి విశ్రాంత జీవనంలో ఉన్నవాళ్లు, ప్రస్తుతం ఉద్యోగిస్తున్నవాళ్లు... ఇలా చాలామంది చేశారు. అలా ఫోన్ చేసినవాళ్లు వ్యాసం బాగుందంటూనే వేసిన ప్రశ్నలు నన్ను ఆశ్చర్యానికి గురిచేశారు. 'సార్! మీ కులం ఏమిటి? మీరు తెలంగాణాకు చెందినవాళ్లేనా?' అని. ప్రవహించే నదీజలంలా, వీచే గాలిలా, ప్రసరించే వెలుగులా, దీపించే గొప్పవారికి కులం, ప్రాంతం కేరాఫ్ అడ్రస్‌లవుతాయా?

శ్రీహరిగారిని కేవలం తెలంగాణాకు మాత్రమే పరిమితం చేయకండి. వారు తెలుగుజాతి ఆస్తి. ఆ విద్వన్మూర్తిని ఒక ప్రాంతానికే పరిమితం చేయవద్దని వారికి చెప్పాను. వారు దూరమైపోవటంతో సంస్కృతాంధ్ర విద్యాక్షేత్రాలు ఒక మహా విద్వన్నిధిని కోల్పోయాయి.

శ్రీహరిగారికి కడుకూర్చు మిత్రులు శ్రీపెరుంబూదూరు లక్ష్మణమూర్తిగారు. వారితో మాట్లాడిన సందర్భంలో వీరి ప్రస్తావన,




వీరితో మాట్లిడిన సందర్భంలో వారి ప్రస్తావన రాకుండా సంభాషణ గడిచేది కాదు. శ్రీహరిగారికి జాషువా కవిత్వం పట్ల మక్కువ కలిగించింది లక్ష్మణమూర్తిగారే. ఫిరదౌసిని, గబ్బిలాన్ని సంస్కృతంలోకి అనువదించినప్పుడు లక్ష్మణమూర్తిగారు పొందిన ఆనంద సంబరాన్ని మాటల్లో చెప్పలేం. వారిద్దరూ ఒకరినొకరు పరోక్షంలో ప్రస్తావించ వలసి వస్తే 'మా లక్ష్మణమూర్తి', 'మా శ్రీహరి' అని 'మా' లేకుండా మాట్లాడేవారు కారు. వారి స్నేహం అలాంటిది.

శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యస్వామి 80వ జన్మదినోత్సవానికి వచ్చిన రవ్వా శ్రీహరిగారు తన నెచ్చెలియైన లక్ష్మణమూర్తి ద్వారా ఆచార్యస్వామి రఘునాథాచార్య స్వామి వద్ద శ్రీభాష్యాన్ని అధ్యయనం చేయాలని ఒక అభ్యర్థన చేశారు. ఆ అభ్యర్థన... ఆ మాట విన్న వెంటనే ఆచార్యస్వామి ఆలోచించి 'సరే! రమ్మనండి. మంచిరోజు చూసి మొదలుపెడదాం అన్నారు. అప్పటికే విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవి నిర్వహించటం, మహామహోపాధ్యాయ బిరుదాన్ని పొందటం వంటివన్నీ జరిగాయి. అయినా వారి విద్యాతృష్ణ అలాటింది.

ద్రావిడ విశ్వవిద్యాలయానికి రూపురేఖలు కల్పించటంలో వారి కృషి స్మరణీయమైంది. ఉపాధ్యక్షులుగా ఉంటే పరిపాలనా వ్యవహారాలతోనే కాలం గడిచిపోతుంది. కాని దానికి భిన్నంగా ఉపాధ్యక్షులుగా ఉండి కూడా శ్రీహరి నిఘంటువు లాంటి బృహద్గ్రంథాన్ని రూపొందించారు. తి.తి.దే ప్రచురణల విభాగపు అధిపతిగా ఉండి ఎన్నో విలువైన గ్రంథాన్ని ప్రచురిస్తూనే 'అన్నమయ్య పదకోశాన్ని' రూపొందించారు. ఉపాధ్యక్షులుగా ఉండి కూడా పాలకమండలి సమావేశాలకు ఆర్.టి.సి. బస్‌లో వెళ్లేవాడు. నిరాడంబర జీవనం – నిస్తుల భావనం ఆచార్య శ్రీహరిగారిది.

ఉద్యోగంలో లెక్చరర్‌గా ఉన్నా, టీచర్‌గా ఉన్నా, కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులుగా ఉన్నా శ్రీహరిగారు పరిశోధనకే నిరంతరం కాలాన్ని వెచ్చించేవారు.

వ్యాకరణం, గ్రంథ పరిష్కరణ అంటే ఎంతో మక్కువ చూపే శ్రీహరిగారు ఆ వ్యాసాల పట్ల ప్రస్తుతతరంలో ఉండే ఉదాసీనతకు ఎంతో బాధపడేవారు. సంస్కృతాన్ని తిట్టటమే పనిగా పెట్టుకున్న వాళ్ళను చూసి 'భాషగా సంస్కృతం చేసిన ద్రోహమేమిటి? దానివలన దేశభాషలు సుసంపన్నమైన విషయాన్ని మనం మర్చిపోతే ఎలా? ఇప్పటికీ ఉదాత్త భావాలు చెప్పాలన్నా, శాస్త్ర సాంకేతిక పదాల రూపకల్పనలో సంస్కృతపుటవసరాన్ని గుర్తెరగా'లని అంటుండేవారు. తల్లి తెలంగాణ భాష అంటే ఎనలేని మక్కువ. నల్లగొండ జిల్లా మాండలికాన్ని గురించి ప్రత్యేక గ్రంథం రాశారు. ప్రాచీన కావ్యాలలో కనిపించే మాండలిక ప్రయోగాల్ని ఎత్తి చూపారు.

ఏ అంశాన్ని పట్టుకున్నా మరొకరు మళ్లీ ఆ అంశం మీద చేయటానికేమీ లేదన్నట్లు పరిశోధించారు. అన్నమయ్య పదకోశాన్ని నిర్మించే క్రమంలో అన్నమయ్య వర్ణించిన 200 పై చిలుకు నవ్వుల్ని, సిగ్గుల్ని కుప్పపోసి పరిశోధన రాక్షసుడనిపించుకున్నారు. తెలుగు కవుల సంస్కృతానుకరణల్ని చెప్పి తెలుగు కవుల ప్రతిధ్వనుల్ని వినిపించారు.

శ్రీహరిగారి పేరును వినటమే గాని, మొట్టమొదట వారిని చూసింది ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కొర్లపాటి శ్రీరామమూర్తి గారి షష్టిపూర్తి సభలో. అప్పుడు నేను పరిశోధక విద్యార్థిని. మా జి.వి. సుబ్రహ్మణ్యం, ముదిగొండ వీరభద్రయ్యగార్లతో పాటు చాలామంది ఆచార్య ప్రముఖుల్ని ఆ సభలలోనే మొదటిసారిగా చూశాను. మా నిత్యానందరావు కూడా అప్పుడు పరిశోధక విద్యార్థే. **"అపశబ్ద మాలిన్యం సోకని స్వచ్ఛ స్ఫటికం మా గురువుగారు శ్రీహరిగారు"** అంటూ నాకు వారిని తొలుత నాకు పరిచయం చేసింది నిత్యానందమే. అప్పటి నుండి వారికి నేను కూడా ఏకలవ్య శిష్యుడిని అయ్యాను.

నేను ద్రావిడ విశ్వవిద్యాలయంలో చేరాక వారిని పిలిచి విశ్వ విద్యాలయం సత్కరించింది. అప్పుడు శ్రీహరిగారు సతీసమేతంగా వచ్చారు. అక్కడి బోధన, బోధనేతర సిబ్బంది వారి పట్ల చూపిన ప్రేమను చూసి ఆశ్చర్యచకితుడినయ్యాను. మహిళా ఉద్యోగులు మేడమ్‌గారిని కన్నతల్లిలా గౌరవించటం చూసి పరమానందపడ్డాను. మేడమ్‌గారు వద్దన్నా వినకుండా తలదువ్వేవాళ్లు, పూలమాల కట్టి తలలో అలంకరించేవాళ్లు. వాళ్ల ప్రేమను చూస్తే ఈ దంపతులెంతగా వీళ్ళ మనస్సుల్లో కొలువై ఉన్నారా? అని అనిపించింది. సాయంకాలం ఆ దంపతులిద్దరూ వాకింగ్ పేరుతో క్యాంపస్‌లో కలయతిరుగుతూ 'ఆ అల్లనేరేడు పండ్లు కాస్తుందా? ఇది గవర్నర్ రంగరాజన్‌గారు నాటిన మొక్క, దీన్ని జాగ్రత్తగా చూసుకోండి! ఈ కనకాంబరం చెట్టు ఎండిపోతున్నది. దీనికి నీళ్లు సరిగా పోయటం లేదల్లే ఉంది... వంటి మాటలతో వారు సాగిపోతుంటే నాకు భీమఖండంలోని అగస్త్యుల వారి మాటలు గుర్తుకు వచ్చాయి. కాశీనుండి వెడల గొట్టబడి, భీమఖండానికి విచ్చేసిన వ్యాసునికి స్వాగతం చెబుతూ అగస్త్యుడు

"కాళీ నందన కంతే
కాలుల శిరములకు విరులు కల్పించునొకో
లీలావనాంతరమునను
మా లోపాముద్ర యిడిన మల్లీవల్లున్" (భీమ 2 -80)

అన్న పద్యం గుర్తుకొచ్చింది. నేను వారి ప్రసంగాలను విని ప్రేరణ పొందిన సందర్భాలున్నాయి. వరంగల్‌లో 2005లో సుప్రసన్నగారి నేతృత్వంలో నిర్వహించిన అన్నమయ్య సదస్సుకు నేను శ్రోతగా వెళ్లాను. ఆ సదస్సు ముగింపు సమావేశంలో శ్రీహరిగారి ప్రధానోపన్యాసం విని కొన్నినాళ్ళు నేను సరిగా నిద్ర కూడా పోలేదు. అప్పటికే వారు అన్నమయ్యను ఆపోశన పట్టారు. అన్నమయ్య నవ్వులు, సిగ్గులు, వలపులు కుప్పపోసి చెపుతుంటే వేదిక మీద ఉన్న ఐ.వై.ఆర్. కృష్ణారావుగారు లేచి వెళ్లి వారికి పాదాభివందనం చేశారు. వారు టి.టి.డి., ఇ.ఓ.గా ఉన్నప్పుడే శ్రీహరిగారిని తి.తి.దే ప్రచురణల విభాగంలో ఎడిటర్ – ఇన్ – చీఫ్‌గా నియమించారు.

వారికి మహామహోపాధ్యాయ గౌరవాన్ని కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంవారు సద్గురు కందుకూరి శివానందమూర్తిగారితో పాటు ఇచ్చినప్పుడు ఎల్.వి. సుబ్రహ్మణ్యంగారు, తి.తి.దే. ఇ.ఓగా ఉన్నారు. వారు శివానందమూర్తిగారికి పుత్రవత్. కాన్వొకేషన్ వేదిక నుండి శివానందమూర్తిగారు, శ్రీహరిగారు వస్తుంటే సుబ్రహ్మణ్యం గారు కుడిచేతితో శివానందమూర్తిగారిని, ఎడమచేతితో రవ్వాశ్రీహరి గారిని పట్టుకొని వస్తుంటే ఆ మూర్తిత్రయాన్ని చూసిన ఆ సందర్భం నేత్రపర్వమైంది.

నేను ద్రావిడ విశ్వవిద్యాలయంలో చేరిన తొలినాళ్ళలో తిరుపతి లోని ప్రాచ్య పరిశోధన సంస్థ గ్రంథపరిష్కరణపై సదస్సు నిర్వహించింది. ఆ సదస్సులోనే వారు కీలకోపన్యాసం చేశారు. ఆ ప్రసంగంలో ఎస్.ఎమ్. కత్రే రాసిన .... పుస్తకం గురించిన ప్రస్తావన చేశారు. అది తెలుగులో అనువదించబడలేదు. ఎవరైనా చేస్తే బాగుంటుందని చెప్పారు. నేను ఆ మాటలను మనసుకెక్కించుకొని ఆ పుస్తకాన్ని సంపాదించి అనువాదం చేశాను. ఆ పుస్తకానువాదం చేసి, నేను విద్యాసంపన్నుడనయ్యే ప్రయత్నం చేశాను. ఇలా వారి స్ఫూర్తి ఎన్నో సందర్భాలలో నాకు మార్గదర్శకమైంది.

సంప్రదాయ తెలుగు వ్యాకరణాలను గురించి నేను రాసిన గ్రంథానికి తెలుగు అకాడమీ వారు శ్రీహరిగారిని సంపాదకులుగా నియమించటం నా అదృష్టంగా భావిస్తాను. ఆ సందర్భంలో వారు నాకిచ్చిన సలహాలు, సూచనలు తరగతి గదిలో విద్యార్థిని ప్రేమించే మాస్టార్ చేసిన సూచనలవంటివి. చివరి రోజులలో అప్పుడప్పుడు ఫోన్ చేసి కాసేపు మాట్లాడి మంచీ చెడూ విచారించేవారు. చివరగా ఇద్దరికి ఫోన్ చేయమని శ్రీహరిగారు అడిగారని మేడంగారు చెప్పారు. ఆ ఇద్దరిలో బూదాటి ఒకడుండడం దు:ఖంతో నన్ను సుడి చుట్టింది.



శ్రీహరిగారు ఎప్పుడూ కాలాన్ని వృథా చేసేవారు కాదు. ఏవైనా దూరప్రాంతాలకు వెళ్లవలసి వస్తే దారిలో చదువుకోవటానికి రెండు పుస్తకాలను తెచ్చుకొనేవారు. సదస్సులకు వస్తే, సదస్సు పూర్తయినాక తమకు కేటాయించి విడిదిగృహంలో కూర్చుని పుస్తకాన్ని చదువు కుంటుండేవారు. ఆఖరుకు దినపత్రికలో కనిపించిన మాండలిక పదాన్ని కూడా నోట్ చేసుకునేవారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారి జయంతి వేడుకలకు పెదకళ్లేపల్లి పోయి వస్తున్న సందర్భంలో వారితో పాటు నేను కూడా వారి కారులోనే వస్తున్నాను. మోపిదేవి ప్రాంతానికి వచ్చాక మాష్టార్ని "సుబ్రహ్మణ్యస్వామి గుడి ఇక్కడ చాలా ప్రసిద్ధం. చూసి వెడదాం సార్" అనగానే సరేనన్నారు. తిరిగి వెళ్లేటప్పుడు డ్రైవర్ రోడ్డు సరిగా కనుక్కోలేక తికమక పడుతుంటే నేను 'బారుకు' పోనివ్వమని చెప్పాను. వెంటనే శ్రీహరిగారు బూదాటిగారు మీరన్న మాట మళ్ళీ అనండి అంటూ చెప్పించుకొని 'బారుకు' అన్న పదాన్ని నోట్ చేసుకున్నారు. బారుకు అంటే నేరుగా, స్ట్రెయిట్‌గా, తిన్నగా అని అర్థం. అది గుంటూరు, కృష్ణా ప్రాంతపు వాడుకపదం. తెలంగాణాలో 'సీదా' అనే ఉర్దూపదం ఈ అర్థంలో వాడుకలో ఉంది. ఇలా శ్రీహరిగారు నిరంతరం పరిశోధనా దృక్పథంతోనే ఉండేవారు.

శ్రీహరిగారు లేరు. వారి రచనలున్నాయి. అన్నమయ్య సాహిత్య మున్నంతకాలం శ్రీహరి నిఘంటువు ఉంటుంది. సూర్యరాయాంధ్ర నిఘంటువు ప్రస్తావన వచ్చినప్పుడల్లా శ్రీహరి నిఘంటువు ప్రస్తావన వస్తుంది. పాణినీయపు అవసరం తెలుగు జాతికి ఉన్నంతకాలం, వారి అనువాదపు (కాశికావృత్తితో సహా) అవసరముంటుంది. ఇలా ఆలోచించినప్పుడు అందరికీ శ్రీహరే అంతరాత్మ.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8 (38) హైదరాబాద్ జూన్ : 2023

# దివికేగిన ఉభయ భాషా పండితుడు

ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య, పుట్టపర్తి, ఫోన్ : 924 627 6573

జడపాండిత్య ఝంఝురికట్టి అచ్చమైన వైదుష్యానికి పట్టాభిషేకోత్సవం చేసిన మహా విద్వాంసుడు –
తెలుగు సంస్కృతాల దివ్యమధురపేయాన్ని పానం చేయించగల్గిన శ్రీహరి లేని విషాద సమయం..

క్షణక్షణం పునాదులు కూలుస్తున్న ఈ రాక్షసవేళలో సంస్కృత భాషా మూలంతో తెలుగు సౌధం ఉనికిని పదిలపరచిన
విపశ్చిద్వర్యుడైన శ్రీహరి లేని దుష్ట వేళ ఇది.

పదవాక్యకీకారణ్యంలో దారికన్పించని ఘట్టంలో తన వ్యాకరణజ్ఞాన దీపంతో వెలుగుబాట వేసి
భాషా సాహిత్య పరులకు మార్గ దర్శకుడయిన శ్రీహరి లేకుండా పోయిన శోక వేళ ఇది.

నాటి అన్నమయ్యకు అన్నమయ్య హృదయం తెలిసినంతగా
ఒక్కడిగా తాను శబ్దార్థ పరిష్కారాలతో నిఘంటువును ఆవిష్కరించిన శ్రీహరి వెళ్లి పోయిన కాలం ఇది

అఇఉణ్ ఋలుక్ ఏఓఙ్ ఐఔచ్ అన్న మాహేశ్వర సూత్రాల పంథాలో తెలుగు వ్యాకరణ జ్ఞానాన్ని పరిమళింపజేసిన
శ్రీహరి హఠాత్తుగా శరీరం త్యజించిన వేళ

సంస్కృతాంధ్రోభయ భాషా సాహిత్యాలను ఒకే పతాకచ్ఛాయలోకి తెచ్చి రెంటికీ పునరుజ్జీవనం కలిగించిన
వైతాళికుడు శ్రీహరి లోకం నుంచి విరమించిన దుస్సహ వేళ

గీర్వాణ సుమాలతో వీణియను సృజియించి తెలుగువాణి ఒడిలోన ఉంచి ఆమెచే మధుర గీతాలాపనలు చేయించిన
శ్రీహరి సాహిత్య గర్భంలో లయించిన వేళ ఇది.

వైదుష్యం అంటే ఏమిటి అన్నదానికి తాను ఆదర్శంగా నిలుస్తూ వేలవేల విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన శ్రీహరి దివికేగిన వేళ ఇది.
తెలుగు అక్కరాల రుచులను సంస్కృత భాషీయులకు చవి చూపిన పండితుడు శ్రీహరి

పాణి తలామలకంగా పాణినీయమ్ ... జిహ్వాగ్రంలో ఆంధ్ర వ్యాకరణమ్ ...
పదకోశ పదార్థ నిఘంటువులతో పాద సంచారమ్ ...సంస్కృతాంధ్రాలతో సాహితీలోక వీక్షణమ్.. నోటిపై నీతి శతక ప్రపంచపదులు.
తాను కని కూడా తనను కనుట కవకాశమీయని మాతృదేవతాస్తుతి – మాతృ గీతమ్ గుండె గూడు...

పెదాలపై అన్నమయ్య నవ్వులు ... అగుపించే శరీరాన్ని దాటి స్ఫురించే వైదుష్య పరిమళాలు
ఎనుబది సంవత్సరాల జీవితానుభవాలతో గుండె గొంతుకలో రెపరెపలాడించిన శుభ సంస్కారాలు...
ఘుమ ఘుమలు ఎవరినైనా ఆకర్షించ గలిగిన సత్త్వ మూర్తి :

యాదగిరి నృసింహుడు చేరదీసిన పుంభావ సరస్వతీ అయిన శ్రీహరిని,
ఆదరించి ఆశీర్వదించి తిరిగి ఇప్పుడు తన సన్నిధిలోని గీర్వాణ విద్వద్సభలో ఏదో అవసరమున్నదన్నట్లుగా తీసికొని వెళ్ళినాడు.

తన పుట్టుకకు, కుటుంబానికి ప్రాంతానికే కాక దేశం మొత్తానికి, కీర్తి తెచ్చిన సత్పురుషుడాయన.
ఈ లోటు ఇంతలో తీరేది కాదు. చరిత్ర సృష్టించిన శ్రీహరి గారిని
ఈ మూసీ పత్రిక శ్రద్ధాంజలి ఘటిస్తూ తన కర్తవ్యం నిర్వహిస్తుండడం ఆ మహా విద్వాంసునికి అసలైన నివాళి.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2023

# శబ్దసాధన తపస్సంపన్నులు శ్రీహరి గారు

ఆచార్య కె. యాదగిరి, ఫోన్ : 939 011 3169

శబ్దసాధన తపస్సంపన్నులు, నిఘంటు నిర్మాణదక్షులు నిత్యసత్య వచస్సంపన్నులు సకల పండిత హృదయామోద ముద్రాంకితులు శ్రీ యాదగిరి లక్ష్మీనృసింహస్వామి అనుగ్రహ లబ్ధ విశిష్ట సంస్కృతాంధ్ర భాషా పారీణులు ఆచార్య రవ్వా శ్రీహరిగారు 21 ఏప్రిల్‌రోజు తనువు చాలించారని తెలిసి విభ్రాంతికి గురయ్యాను. ఎనభైయవ ఏట తన జీవనయానాన్ని ముగించుకోవడం స్వయంగా ఆయన కోరుకున్నట్లే జరగడం ఆశ్చర్యాన్ని కలిగించింది నాకు. ముని కుమారులవంటి వారి ముగ్గురు కుమారులు రమేశ్, శివకుమార్, పతంజలి అమెరికాలో ఉన్నా ప్రతి మూడు నెలలకొకసారి వచ్చి నెలరోజులు ఉండి తండ్రిగారి ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటూ ఉండటం వారి పితృభక్తికి, శ్రీహరిగారి పుత్ర వాత్సల్యానికి నిదర్శనం. వారి ధర్మపత్ని శ్రీమతి అనంతలక్ష్మిగారు కంటికి రెప్పలా చూసుకుంటూ ఉండటం శ్రీహరిగారి అపూర్వ దాంపత్యానికి నిదర్శనం.

రెండు మాసాల క్రితం నేను వారిని ఇంట్లో కలిసినప్పుడు వారితో మాట్లాడిన సందర్భం నాకు ఈ సందర్భంలో గుర్తుకు వచ్చింది. ఆరోగ్యం అంతా బాగున్నా గత కొద్దికాలంగా కాళ్ళు బలహీనం కావడం చేత ఇంట్లోనే సరిగ్గా నిలబడలేక నడవలేక పోతున్నారు. సభలు సమావేశాలకు వెళ్ళడం పూర్తిగా మానుకున్నారు. 2021 జనవరిలో ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారి 'జాతి విపంచి గానం' దీర్ఘకావ్య ఆవిష్కరణ ఉస్మానియా గెస్టుహౌస్‌లో జరిగినప్పుడు ముఖ్య అతిథిగా హాజరయినారు. బహుశా అదే వారు పాల్గొన్న చివరి సమావేశం అనుకుంటాను.

సార్ మీరు కాళ్ళకు బలం రావడానికి ఆయుర్వేద చికిత్స తీసుకుంటే బాగుంటుంది. డాక్టర్ దగ్గరకు పోదాం అన్నాను. ఆయన అందుకు తిరస్కరిస్తూ **"నేనింకా ఏం చేయాలి? చదువవలసినదంతా చదివాను. వ్రాయవలసినదంతా వ్రాశాను. ఇంకా నేను చేసేది ఏమీ లేదు. నేను బయటకు వెళ్ళవలసిన అవసరం లేదు. నేను నడువవలసిన అవసరం లేదు. నా కాళ్ళకు చికిత్స అవసరం లేదు. నేను బాగానే ఉన్నాను. ఇంకా నేను చేసేదేమీ లేదు"** అంటూ జీవితంపై విరమణ కోరుకుంటూ నిరాసక్తంగా చెప్పిన మాటలు నేను మరచిపోలేకపోతున్నాను. ఆయన కోరుకున్నట్లే కొద్దిరోజులకే తనువు చాలించుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. జీవన దర్శనం కలిగిన ఒక యోగివలె కనిపించారు ఆచార్య రవ్వా శ్రీహరిగారు.

భగవదంశతో జన్మించి తనకు భగవంతుడు నిర్దేశించిన కర్తవ్యాన్ని పూర్తిచేసుకొని తన అవతారాన్ని ముగించుకున్న మహాపురుషులు. ఒక పాణిని వలె, ఒక అన్నమయ్య వలె సంస్కృతాంధ్ర భాషలకు సేవచేసి తన జీవితాన్ని విరమించుకున్న మహానుభావుడు శ్రీహరిగారు. భారత భాగవత మహా గ్రంథాలవలెనే ఆయన నిర్మించిన శ్రీహరి నిఘంటువు, అన్నమయ్య పదకోశం వంటి నిఘంటువుల, పాణిని అష్టాధ్యాయి అనువాద సంపుటాలు శ్రీహరిగారు తెలుగు జాతికి ఇచ్చిన శాశ్వతమైన వరాలని నా భావన.

ఐదు సంవత్సరాల క్రితం శ్రీహరిగారి 75వ జన్మదిన సందర్భంలో రవీంద్రభారతిలోను, తెలుగు విశ్వవిద్యాలయం లోను జరిగిన రెండు అభినందన




సభలు, ఆ సందర్భంగా వెలువరించిన 'శ్రీహరి విజయం' అభినందన సంచిక ఆచార్య రవ్వా శ్రీహరిగారికి భాషా సాహిత్య రంగంలో ఉన్న విశేష గౌరవానికి నిదర్శనాలు. 1100 పైగా పేజీలలో వెలువడిన 'శ్రీహరి విజయం' అపూర్వమైన గ్రంథం. ఆ సంచిక వెలువరించే సందర్భంలో ఎంతోమంది విశిష్టమైన వ్యక్తులు పంపిన సందేశాలు వారి వ్యక్తిత్వ పాండిత్య విశిష్టతను వెల్లడిస్తాయి. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మొదలుకొని హైకోర్టు న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, సివిల్ సర్వీస్ ఉన్నతాధికారులు, సాహిత్య రంగాలలో లబ్ధప్రతిష్ఠులైన శతాధిక కవులు, రచయితలు, పండితులు విశ్వవిద్యాలయాచార్యులు స్పందించిన తీరు సమాజంలో శ్రీహరిగారి కున్న అత్యున్నత గౌరవాన్ని వెల్లడిస్తాయి.

సహృదయ సాహితీవేత్తలందరూ "శ్రీహరి విజయం'' న భూతో న భవిష్యతి అని ప్రశంసించడం నాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. అపూర్వమైన అభినందన సంచికకు ప్రధాన సంపాదకులుగా ఉండే అదృష్టం నాకు




పుస్తకావిష్కరణ చేస్తున్న జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి, రమణాచారి, పొత్తూరి వెంకటేశ్వరరావు తదితరులు



లభించడం పూర్వజన్మ సుకృతమే. ఆచార్య శ్రీహరిగారితో నలభై సంవత్సరాల అనుబంధం కల్గిన నేను వారి జీవన వ్యక్తిత్వాన్ని ఆదర్శంగా ఎప్పుడూ తీసుకుంటాను. అతి సామాన్య కుటుంబంలో జన్మించి వైస్ ఛాన్స్‌లర్ వంటి అత్యున్నత పదవిలో ఉన్నా తన సామాన్య వ్యక్తిత్వాన్ని ఏనాడు ఆయన మరువలేదు. డబ్బు విషయంలో ఆయన నిజాయితీ కళ్ళారా ఎన్నోసార్లు చూశాను. విద్యాసంస్థల్లో ఒక్క రూపాయి కూడా అదనంగా స్వీకరించేవారు కాదు. వైస్ చాన్స్‌లర్‌గా ఉన్నప్పుడు హైద్రాబాద్ వస్తే ఆటోలోనే ఉస్మానియా గ్రంథాలయానికి వెళ్ళడం ఎందరో చూశారు. మాటల్లోనే కాదు చేతల్లోనూ నిజయితీని మరవని విశిష్ట వ్యక్తిత్వం వారిది.

ఇలాంటి ఉన్నత వ్యక్తిత్వం గల ఆచార్య శ్రీహరిగారు విశ్వ విద్యాలయంలోని ఎంతోమంది అధ్యాపకులకు ఆదరణీయులైనారు. ఆచార్య పేర్వారం జగన్నాథం, ఆచార్య కోవెలసుప్రసన్నాచార్య, ఆచార్య కోవెల సంపత్కుమాచార్య, ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య, ఆచార్య శలాక రఘునాథశర్మ, ఆచార్య ఎస్. లక్ష్మణమూర్తి, డా. శ్రీరంగాచార్య వంటి గొప్ప అధ్యాపకులందరూ వీరిని ఎంతో ఆప్యాయంగా పిలవడం, గౌరవించడం నేను మరువలేను.

అధ్యాపకోత్తములు, మహామహోపాధ్యాయులు అయిన శ్రీహరిగారు శారీరకంగా మనమధ్య లేకపోవడం బాధాకరమే అయినా ఆయన జ్ఞాపకాలు ఆయన రచనలు మనల్ని ఎప్పుడూ ప్రభావితం చేస్తూనే ఉంటాయని భావిస్తూ వారికి అశ్రునివాళి సమర్పించు కుంటున్నాను.

మూసీ పత్రికవారు శ్రీహరిగారి సంస్మరణ సంచిక ప్రచురిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

---

**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**




**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**



ఆచార్య రవ్వా శ్రీహరి, శ్రీమతి అనంత లక్ష్మి గార్లు

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8 41 హైదరాబాద్ జూన్ : 2023
UGC Care List Approved Journal

# పుంభావ సరస్వతి ఆచార్య రవ్వా శ్రీహరి

డా. వెల్దండి శ్రీధర్, ఫోన్ : 9866977741

**"కేయూరాణి న భూషయంతి పురుషన్ హారా న చంద్రోజ్జ్వలాః
న స్నానం న విలేపనం న కుసుమం నాలంకృతామూర్ధజాః
వాణ్యేకా సమలంకరోతి పురుషం యా సంస్కృతా ధార్యతే
క్షీయన్తే ఖిల భూషణాని సతతం వాగ్భూషణం భూషణం"**

ఒకప్పుడు టీవి తిష్టవేయని కాలంలో ఉషోదయాన్నే ఆకాశవాణి ద్వారా ప్రతి ఇంట్లో మార్మోగిన శ్లోకం ఇది. పేదరికం విలయతాండవం చేసిన కాలంలో ఏ బంగారు ఆభరణం మనిషికి శోభనివ్వదు. వాగ్భూషణమే నిజమైన భూషణమని చెప్పకనే చెప్పిన పద్యం ఇది. ఇలా ఒక తరం విద్యార్థులకు రేడియో ద్వారా సంస్కృత పాఠాలు నేర్పిన ఆచార్యులు మహామహోపాధ్యాయ రవ్వా శ్రీహరి. దిగువ మధ్యతరగతి చేనేత కుటుంబంలో పుట్టి ఇంగ్లీష్ చదువులు చదవడానికి డబ్బులు లేక యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఉచిత భోజన వసతితో పాటు చదువు కూడా చెప్తారని తెలుసుకొని అక్కడి సంస్కృత విద్యాపీఠంలో చేరిపోయారు. తెలుగు సాహిత్య ప్రపంచానికి అదే మంచిదైంది. దాని వలన ఒక విద్వత్, ఒక నడిచే నిఘంటువు తెలుగువారికి దొరికినట్లయింది. ఆ పాఠశాలలో కేరళ సుబ్రహ్మణ్యం అనే అధ్యాపకుడి దగ్గర 'రామ' శబ్దం నేర్చుకొని ఆ తరువాత మొత్తం సంస్కృత సాహిత్యాన్ని ఆపోసన పట్టారు.

సాహిత్య సంస్థల్లో, విశ్వవిద్యాలయాల్లో చేయాల్సిన పనిని ఒక్క చేతి మీదుగా చేసి తెలుగుజాతి ఋణపడి ఉండేలా చేశారు. సూర్యరాయాంధ్ర నిఘంటువు, శబ్దరత్నాకరములాంటి నిఘంటువుల్లో చేరని సుమారు 36 వేల పదాలతో శ్రీహరి నిఘంటువు (2004) రూపొందించారు. ఇది తెలుగు సాహిత్యానికి గొప్ప చేర్పు. జానపదుల నోళ్లల్లో నానే అచ్చమైన తెలుగు పదాలు, తెలంగాణ మాండలిక పదాలు కొన్ని వేలు సేకరించి వాటికి అర్థాలు వెతికి, వాటి ప్రయోగాలతో ఈ నిఘంటువు తయారు చేశారు. అలాగే నల్లగొండ జిల్లా మాండలిక పదాలు (1986) సేకరించి పుస్తకంగా వేశారు. తెలంగాణ మాండలిక పదాలను ప్రాచీన కావ్యాలలో ఏయే సందర్భాలలో వాడారో తెలుపుతూ 'తెలంగాణ మాండలికాలు – కావ్య ప్రయోగాలు' అనే పుస్తకం వెలువరించారు. ఎన్నో సమావేశాల్లో తెలంగాణ తెలుగు భాషా సౌందర్యాన్ని, మాధుర్యాన్ని, సొగసును వివరించడానికి ప్రయత్నించారు.

వివిధ శాస్త్రాలలోని సంఖ్యాపూర్వక సంకేత పదాలను వింగడించి, సేకరించి వాటికి ఆయా కాలజ్ఞానాల్లో ఉన్న అర్థాలను వివరిస్తూ 1973లో 'సంకేతపదకోశం' వెలువరించారు.



వేదవేదాంగాలు, దర్శనాలు, ఆయుర్వేదం, జ్యోతిషం, తంత్ర, మంత్ర, కామాది శాస్త్రాలు, పురాణేతిహాసాలు, అలంకారశాస్త్రం, సంగీతం, అర్థశాస్త్రం, కావ్యాలలో ఉన్న సుమారు మూడు వేల సంకేత పదాలకు ఇందులో వివరణ ఇవ్వడం జరిగింది. తెలుగులో సంకేత పదాలను విశదంగా వివరించే మొదటి గ్రంథం ఇదే కావడం గమనార్హం. ఇది విద్యార్థులకే కాదు, అధ్యాపకులకు, పరిశోధకులకు ఎంతో ఉపయుక్తం. అట్లాగే 1978లో 'వ్యాకరణ పదకోశం' తయారు చేసి ముద్రించారు. ఇది వ్యాకరణ అధ్యయనకారులకు ఎంతో ఉపయోగం.

పూర్వపు నిఘంటుకారులు అసలు అన్నమయ్యను ముట్టుకోలేదు. పదవీ విరమణ చేసిన తరువాత కూడా విశ్రాంతి తీసుకోకుండా తిరుమల తిరుపతి దేవస్థానం వారి కోరిక మేరకు 'అన్నమయ్య పదకోశం' (తాళ్లపాక కవుల సంకీర్తనా నిఘంటువు) ను రూపొందించి ఇచ్చారు. దీనికి ఆముఖం రాస్తూ –

"అన్నమయ్య సంకీర్తనల్లోని భాష ఎంతో విలక్షణమైంది. సమకాలంలో వస్తున్న ప్రబంధాల్లోని దీర్ఘ సమాస భూయిష్టమైన సంస్కృత పద బహుళ శైలిని త్రోసిరాజని ప్రజల వ్యవహారంలో ఉన్న తెలుగుభాషకు పట్టం కట్టిన మహానుభావుడు. తన సంకీర్తనల ద్వారా భక్తిభావాన్ని సామాన్య ప్రజల్లో కూడా వ్యాప్తి చేయాలనే లక్ష్యమే ఇందుకు కారణం. ఒక విధంగా అన్నమయ్య తొట్టతొలి వ్యావహారిక భాషోద్యమనిర్మాత అని చెప్పవచ్చు. ఆయన భాష విలక్షణమైంది. జనవ్యవహారం ముందు వ్యాకరణ నియమాలు పట్టించుకోనవసరంలేదన్న భావంతో వ్యాకరణ విరుద్ధాలైన ప్రయోగాలకు కూడా జనవ్యవహారం కారణంగా సాహసంతో తన సంకీర్తన వాఙ్మయంలో ప్రయోగార్హత కల్పించినాడు. భాషావ్యవహారానికి జీవం పోసే ప్రాంతీయమాండలిక పదాల నెన్నింటినో వాడి ప్రస్తుతం ప్రామాణికభాష పేరుతో వివిధ ప్రాంతాల్లోని అచ్చమైన తెలుగు పదసంపదను ఎంత ప్రయత్న పూర్వకంగా పోగొట్టుకున్నామో మనకు

గుర్తు చేసినాడు. వెలిబుచ్చే అభిప్రాయాన్ని సమర్థంగా, రమణీయంగా, హృదయానికి హత్తుకునేటట్లుగా చెప్పడానికి ఉపయోగించే జాతీయాలను, సామెతలను పరశ్శతంగా వాడి భాషకు సహజత్వాన్నీ, రమణీయతనూ సాధించినాడు. తిక్కనవలె కొన్ని సంస్కృతపదాలకు అచ్చతెలుగు పదాలను సృష్టించి భాషావిషయంలో తన సృజనశక్తిని ప్రకటించు కోవడమే కాకుండా తెలుగుభాషకున్న శక్తిని తెలియజేసినాడు. ఆయా భాషాప్రాంతాల సామీప్యకారణంగా, తత్తద్భాషా వ్యవహర్తలతో సహజీవనం కారణంగా అన్యభాషాపదాలను కూడా స్వీకరించి తన ఉదారత్వాన్ని ప్రదర్శించినాడు, వింతవింత తద్ధితాంతపదాలను వాడడమేకాక ఒక్కో సంకీర్తనలో ప్రతి చరణంలోనూ తద్ధితాంత పదాలను వాడి సంకీర్తనకొక వింత సొబగును ఆపాదించినాడు.

వింతసంధులు, (ఒబ్బుద్ధి, నియ్యెడ మొ॥) వైరిసమాసాలు, (దినపెండ్లి, నిత్యకొత్తలు మొ॥) మహాప్రాణవర్ణాలకు బదులు అల్పప్రాణప్రయోగం (సుకం, వీధి, బాద, బోజనము మొ॥) రేఫఅకారాల విషయంలో శైథిల్యం, వ్యావహారికభాషలోనూ అరసున్నలను ప్రయోగించడం, అరసున్నలు లేనిచోట అరసున్నలు ప్రయోగించడం (కట్టగడ, మామగారు, మాట మొ॥) వింత వాక్యరచనా విధానం మొదలైన అంశాలలో వ్యావహారికతతో పాటు భాషాసాహసిక్యాన్ని కూడా ప్రదర్శించినాడు. విలంబానికి ఓర్వని భావతీవ్రత, దానిని అల్లివేయటంలో గల వేగం కారణంగా కూడా అన్నమయ్య ఎన్నో భాషా విశేషాలతో రచన చేసినాడు." అని అన్నమయ్య భాషా దృష్టిని లోతుగా పరిశీలించి అభిప్రాయపడ్డారు.

సృజనాత్మక రంగంలో ఉండి ఎంతో పేరుప్రఖ్యాతులు గడించే విద్వత్సంపన్నులే అయినా మనం చేసే పని పలువురికి ఉపయోగపడితే చాలు అని సంతృప్తి పడే వినయ సంపన్నులు, సార్థక నామధేయులు రవ్వా శ్రీహరి.

తెలుగు సంస్కృతానికి మధ్య వారధిలా నిలిచి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకం, ధర్మపురి శేషప్పకవి రచించిన నరసింహ శతకం, గుఱ్ఱం జాషువా రచించిన ఫిరదౌసీ, గబ్బిలంలాంటి గ్రంథాలను సంస్కృతంలోకి అనువాదం చేశారు. డా. సి. నారాయణ రెడ్డి రచించిన ప్రపంచపదులును 'ప్రపంచ పదీ' పేరుతో సంస్కృతం లోకి అనువాదం చేసి కేంద్రసాహిత్య అకాడమి పురస్కారాన్ని పొందారు.

పనిచేసింది తెలుగు ఆచార్యులుగానే అయినా సంస్కృతం మీది మక్కువతో దాన్ని వదిలిపెట్టలేదు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో కొన్నేళ్లపాటు సంస్కృతం, వ్యాకరణం బోధించారు. అందుకే "నాకు సంస్కృతం, తెలుగు రెండు కళ్లలాంటివి" అని చెప్పుండేవారు. సంస్కృతంలో కూడా మాతృగీతమ్, సంస్కృత వైజయంతి అనే గ్రంథాలను వెలువరించారు. అలబ్ధ కావ్య పద్య ముక్తావళి (1983), తెలుగులో అలబ్ధ వాఙ్మయము (1983) వెలువరించారు. ఈ రెండు గ్రంథాలు పరిశోధకులకు కల్పతరువు ల్లాంటివి. తెలుగు కవుల సంస్కృత అనుకరణలు, వాడుక తెలుగులో అపప్రయోగాలు, సంస్కృత న్యాయదీపిక, సంస్కృత సూక్తి రత్నాకరం, ముకుంద విలాసం, నా సాహితీ జీవనయానం, శ్రీహరి విజయం, త్రిలింగ శబ్దానుశాసనం, అన్నమయ్య నవ్వులు మొదలైన గ్రంథాలు రాశారు. సిద్ధాన్త కౌముది, అష్టాధ్యాయి వ్యాకరణ గ్రంథాలకు వ్యాఖ్యానం రాశారు. విడిగా ఎన్నో వ్యాసాలు రాశారు. వాటిలో కొన్నింటిని ఉభయభారతీ (1996), సాహితీ నీరాజనం (2008) పేర్లతో వెలువరించారు. ఇలా రవ్వా శ్రీహరి సుమారు 50 గ్రంథాలు రచించారు. ఇందులో సంస్కృతంలో రాసినవే 25 వరకున్నాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య బిరుదురాజు రామరాజు పర్యవేక్షణలో 'భాస్కర రామాయణం-విమర్శనాత్మక పరిశీలనము' అనే అంశం మీద పిహెచ్.డి. చేశారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత 1-10వ తరగతుల తెలుగు పాఠ్యపుస్తకాలు ఆచార్య రవ్వా శ్రీహరి ప్రధాన సంపాదకత్వంలో వెలువడ్డాయి. ఎంతోమంది పాఠ్యపుస్తక రచయితలను సమన్వయపరుచుకొని మెరుగైన ఆదర్శప్రాయమైన పాఠ్య పుస్తకాలను రూపొందించారు. తెలుగు అకాడమి వెలువరించిన ఎన్నో పుస్తకాలకు సంపాదక బాధ్యతలు కూడా నిర్వహించారు.

ఎంతో పాండిత్యం ఉన్నా, ఎన్నో పదవులను చేపట్టినా ఆచార్య రవ్వా శ్రీహరి చాలా నిరాడంబరంగానే జీవించారు. ఎంతో మృదు స్వభావులు. తనకన్నా చిన్నవారినైనా కూడా చాలా మర్యాదతో సంబోధించేవారు. తనకే అన్నీ తెలుసుననే గర్వం ఏ కొంచెం కూడా ఆయనలో కనబడదు. లోకంలో ఎంతోమంది విద్వాంసులున్నారు. వారంతా ఎవరి పరిధిలో వారు తెలుగు, సంస్కృత భాషలకు సేవనందిస్తున్నారని తన సమకాలికులు సాహిత్య కృషిని కూడా గుర్తించి వారిని గౌరవించడం ఆయన మంచితనానికి నిదర్శనం.

తెలుగుతో పాటు సంస్కృతాన్ని కూడా అమితంగా ప్రేమించిన భాషా ప్రేమికులు. సంస్కృతం అనగానే కేవలం పురాణేతిహాసాలు, అలంకారశాస్త్రాలనే భ్రమ ఉంది. కాని సంస్కృతంలో కూడా అన్ని శాస్త్రాలకు చెందిన సాహిత్యం, గ్రంథాలున్నాయని ఇప్పటితరం వాటిని ఆదరించి అధ్యయనం చేయకపోవడం వలన ఎంతో జ్ఞాన సంపద కాలగర్భంలో కలిసిపోతోందని వాపోయారు. ఆచార్య రవ్వా శ్రీహరి మరణంతో ఒక సాహిత్య శిఖరం కూలిపోయినట్లయింది.

**ఆధార గ్రంథాలు**

1. అన్నమయ్య పదకోశం - ఆచార్య రవ్వా శ్రీహరి
2. సంకేత పదకోశం - ఆచార్య రవ్వా శ్రీహరి

# ఆదర్శ ఆచార్యులు – రవ్వా శ్రీహరి గారు

**డా. కోయి కోటేశ్వర రావు**, ఫోన్ : 9440 480 274

ఆచార్య రవ్వా శ్రీహరి గారి మరణ వార్త విన్నపుడు ఒక భాషాసరిత్సాగరం ఇంకిపోయినట్లు, వ్యాకరణ మహావృక్షం కూలిపోయినట్లనిపించింది.. ఆకాశమంత ఎత్తైన పరిశోధనాశిఖరం ఒరిగిపోయినట్లు తోచింది. విస్తృత పద సామ్రాజ్యాన్ని జయించిన పండిత మహారాజు కన్నుమూసినట్లు స్ఫురించింది. అన్నింటికీ మించి అమర నక్షత్రం నింగినధిరోహించినట్లుగా ఉంది. రవ్వా శ్రీహరి గారు భారతదేశం గర్వించదగిన అసాధారణ పండితుడు. ఆచార్యునిగా, పరిశోధకునిగా, వ్యాకరణ వేత్తగా, అనువాదకునిగా, నిఘంటునిర్మాణకర్తగా, సంపాదకునిగా, బహుముఖీన వరివస్యతో తెలుగు భాషాసాహిత్యాల వికాసానికి జీవితాన్ని ధారపోసిన ధన్యజీవి శ్రీహరి గారు. భాష, అనువాదం, వ్యాకరణం, నిఘంటు నిర్మాణం తదితర రంగాల్లో అనితరసాధ్యమైన చారిత్రాత్మకమైన కృషి చేశారు. భాషా పరిశోధనలో, వ్యాకరణ అధ్యయనంలో, అనువాదంలో ఎన్నాళ్లుగానో మిగిలిపోయిన ఖాళీలను సమర్థవంతంగా, బాధ్యతా యుతంగా పూరించారు. సంస్కృతాంధ్ర భాషల నడుమ వారధిగా సాహిత్య సారథిగా శ్రీహరిగారు ప్రఖ్యాతి గాంచారు. ఒక తేనెటీగ అనేక పూవులనుండి మకరందాన్ని గ్రహించి తేనె తెట్టెను నిర్మించినట్లు శ్రీహరిగారు కఠోరమైన పరిశ్రమతో వందలాది గ్రంథాలను పరిశీలించి అపూర్వమైన పదకోశాలను రూపొందించారు. 'కోశవానాచార్యః' అన్ననిర్వచనానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపించేవారు. తన పరిశోధనా సేద్యంతో పదసిరులను పండించి నిఘంటువుల ఆకలి తీర్చినఅక్షర కృషీవలుడు శ్రీహరి గారు. **"పురాకవితోన్మత్తులెరుంగజాలని కుగ్రామీణ భాషాబ్ధిలో చవులూరించు తెలుగుం పల్కుల జగాస్వారస్యరాహస్యములను"** తన రచనల్లో రాశిపోసి మాండలిక భాషలకు మర్యాద చేకూర్చారు. బడిపలుకుల భాషను, పలుకుబడుల భాషను సమదృష్టితో పరామర్శించారు. పాణిని వాణిని పామరుని భాషాబాణిని ఒకే చూపుతో విశ్లేషించే సమున్నత సాహిత్యసంస్కారాన్ని జాతికి అందించారు.

శ్రీహరిగారి జీవితం వడ్డించిన విస్తరి కాదు. వడ్డన ఉన్నపుడు విస్తరికోసం, విస్తరి ఉన్నప్పుడు వడ్డనకోసం పెనుగులాడిన సంఘర్షణలో నుండి వాఙ్మయఋషిలా ఎదిగివచ్చారు. సాధారణ చేనేత కుటుంబంలో జన్మించిన శ్రీహరిగారు మహామహోపాధ్యాయునిగా ప్రఖ్యాతిగాంచిన తీరును పరిశీలిస్తే, పేదరికాన్ని ఎదిరించి జ్ఞాన సంపదను సాధించే యుక్తి సమకూరుతుంది. అవరోధాలను అధిగమించి జీవితాన్ని గెలిచే తత్వం అవగతమవుతుంది. లక్ష్యసాధనామార్గంలో మునుముందుకు దూసుకుపోయే సంకల్పబలం సిద్ధిస్తుంది. **"కోహి సన్నిహిత శార్దూలాం గుహాం ధర్షయితుం**



**సమర్థహ"** పులిగుహలోకి ప్రవేశించడానికి ఎవరూ సాహసించరు. కానీ శ్రీహరిగారు ధృత్యున్నతోత్సాహంతో దుర్గమారణ్యంలోకి చొచ్చుకొని పోయి సంస్కృత వ్యాకరణ వ్యాఘ్రంపై స్వారీచేశారు.

నేను1992 లో హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ., తెలుగు చదువుతున్నరోజులు. ఏడుగురు ఆచార్యులతో హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ సప్తముఖీన బోధనావిలసితమై, సాహిత్య ఇంద్రచాపమై, అంతేవాసుల హృదయాల్లో జ్ఞానకాంతులను ప్రసరించేది. ఆచార్య రవ్వా శ్రీహరి గారు తెలుగు శాఖ అధ్యక్షులుగా ఉండేవారు. వృత్తిగతమైన నిబద్ధతకు , బోధనాపరమైన సమర్థతకు, పాలనాదక్షతకు నిలువెత్తు నిదర్శనం గురువుగారు. మాకు సంస్కృతం బోధించేవారు. కాకులు దూరని కారడవి లాంటి సంస్కృత సాహిత్యాన్ని, చీమలు దూరని చిట్టడవి లాంటి వ్యాకరణాన్ని తన బోధనా మహిమతో సుందరనందనోద్యాన వనంగా మార్చి అంతేవాసులకు భాషాఫలాలను పంచిపెట్టారు. శిష్యుల అవగాహనా స్థాయిని అర్థం చేసుకొని పాఠం చెప్పేవారు.

**'తన ఎదయెల్ల మెత్తన, శిష్యులన్న ఎడదం గల ప్రేముడి చెప్పలేని మెత్తన'** అన్నట్లు శ్రీహరిగారు శిష్యులపట్ల అపారమైన ప్రేమాభిమానాలను కనబరిచేవారు. క్లాసులో శ్రీహరి గారు సంస్కృత సూత్రాలు చెబుతుంటే, తరువాత చెప్పబోయే సూత్రాలను నేను అమితోత్సాహంతో అందించేవాడిని. బహుశా అందుకేనేమో గురువుగారు నా పట్ల ప్రత్యేకమైన వాత్సల్యాన్ని చూపించేవారు. ఒకసారి శ్రీహరి గారి దగ్గరకు భయం భయంగానే వెళ్ళి నిలబడ్డాను. ఏం కావాలి అని అడిగారు? మా ఉరు వెళ్ళాలి ఛార్జీకి డబ్బులు లేవు 200 రూపాయలు కావాలి సార్ అన్నాను. మా ఊరు గురించి, తల్లిదండ్రుల వృత్తి, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకొని, మారు మాట్లాడకుండా గురువు గారు 200 రూ.ఇచ్చారు. ఊరు వెళ్ళి వచ్చిన

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8 (44) హైదరాబాద్ జూన్ : 2023



తరువాత వారికి మళ్ళీ తిరిగి 200 ఇచ్చాను. అలా రెండు మూడు పర్యాయాలు వారు ఆర్థిక సహాయం చేశారు. డబ్బులు అవసర మైనప్పుడు గురువు గారు నడిచే ATM లాగా నన్ను ఆదుకున్నారు. రోజు రోజుకీ గురు శిష్యులమధ్య ప్రగాఢంగా అల్లుకుపోతున్న ఈ ఋణానుబంధాన్ని శాశ్వతంగా విచ్ఛిన్నం చేయాలని గురువు గారు భావించారనుకుంటాను. బాగా ఆలోచించి నెల నెల చిరుసంపాదనా మార్గాన్ని నాకు చూపించారు. వారం వారం ఆకాశవాణి హైదరాబాద్ లోప్రసారమయ్యే సంస్కృత పాఠం కార్యక్రమంలో విద్యార్థిగా నాకు మహదావకాశాన్ని కల్పించారు. శ్రీహరిగారు గురువుగా, నేను విద్యార్థిగా ఆకాశవాణి సంస్కృత పాఠం కార్యక్రమంలో పాల్గొనటం గొప్పఅనుభూతి. వారం వారం నాకు ఆకాశవాణి వారు డెబ్బయ్ ఐదు రూపాయిల చెక్ ఇచ్చేవారు. దాదాపు ఒక సంవత్సరకాలం పాటు ఆకాశవాణివారు అందించే పారితోషకంతో కొంచం దర్జాగా జీవించాను. కళ్ళల్లో వత్తులేసుకొని మనియార్డర్ కోసం ఆశగా ఎదురు చూసే బాధ మటుమాయమయింది. ఆకాశవాణి సంస్కృత పాఠం లో వారం వారం నా పేరు వినబడటం మూలంగా మాఊరిలో నాకు ఒకింత పరపతి లభించింది. వాడకే పరిమితమైన నా పేరు బ్రాహ్మణ వీధి వరకు విస్తరించింది. ఈ విధంగా గురువు గారు నాకు మహోపకారం చేశారు. **"కో గురుః శిష్యహితాయోద్యస్సతతం"** అని అన్నట్లుగా శిష్యుల శ్రేయస్సుపట్ల అనునిత్యం జాగరూకతతో వ్యవహరించే ఉత్తమ గురువు శ్రీహరి గారు.



విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ కన్యాశుల్కం నాటకం గురించి రాష్ట్రస్థాయిలో వ్యాసరచనల పోటీ నిర్వహిస్తున్నారు నీవు కూడా వ్యాసం రాసి పంపించు అని గురువుగారు నన్ను ఆదేశించారు. వ్యాసం పంపవలసిన ఆఖరు తేదీ కూడా దగ్గరకు వచ్చింది. వ్యాసం రాయడం ఇంకా పూర్తి కాలేదు. వ్యాసం చివరి పేజీలో తెలుగు శాఖ అధ్యక్షులు వ్యాసం 'నేనే రాశానని' సంతకం పెట్టి, ధ్రువీకరించాలి. గురువు గారు ఏదో ఊరు వెళుతున్నారని తెలుసుకొని హడావుడిగా వారి దగ్గరకు వెళ్ళి తెల్ల కాగితం ఇచ్చి సంతకం పెట్టమని అభ్యర్థించాను. వారు వ్యాసం ఏది అని అడిగారు. ఇంకా పూర్తికాలేదు అని బదులిచ్చాను. కాలస్పృహ, క్రమశిక్షణ లేకపోతే ఎలా ? అని మందలించారు. మరొకసారి ఇలాచేయవద్దని హెచ్చరించారు. ఖాళీ పేపర్ మీదా సంతకం పెట్టి, స్టాంప్ వేసి ఇచ్చారు. వ్యాస రచన పోటీలో నాకు ప్రథమ బహుమతి వచ్చింది. నిర్వాహకులు నాకు 5000 రూ విలువచేసే గ్రంథాలను బహూకరించారు. శిష్యుల శక్తి యుక్తులను అర్థం చేసుకొని తదనుగుణంగా ప్రోత్సహించి వారిని విజేతలుగా తీర్చి దిద్దే స్వభావం కలిగిన దేశికోత్తముడు శ్రీహరి గారు.

1992లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆంగ్ల శాఖ వారు ఏర్పాటు చేసిన సదస్సులో పాణిని గురించి, పాణిని సూత్రనిర్మాణ విశిష్టత గురించి దాదాపు ఒక గంట పాటు ఆంగ్లంలో ప్రసంగించి శ్రీహరి గారు అక్కడి ఆచార్యులనందరిని అబ్బురపరిచారు. ఆ సభకు గురువుగారు నన్ను వెంట బెట్టుకు తీసుకువెళ్లారు. చేకూరి రామారావు గారి లాంటి సుప్రసిద్ధ భాషాశాస్త్ర పండితులు గురువు గారి ప్రసంగం ఆద్యంతం విని అభినందించారు.

ఆ తరువాత నాలుగు సదస్సుల్లో గురువు గారితో పాటు వక్తగా, వారి సమక్షంలో మాట్లాడటం జీవితంలో మరిచిపోలేని మధుర జ్ఞాపకం. "కేయూరాణి నభూషయంతి పురుషం" అన్న భర్తృహరి శ్లోకార్థం మూర్తీభవించినట్లుగా భాసిల్లిన ఆచార్య రవ్వా శ్రీహరి గారు ఆధునిక శబ్ద శాసనుడు. భాషాపరశేషభోగి శ్రీహరిగారి శిష్యుడను అని చెప్పుకోవడ'మది గొప్ప తెలుంగునాడునన్'.



ISSN 2457-0796 UGC Care List Approved Journal
**మూసీ మాసపత్రిక** సంపుటి -26 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2023

# వినయం, విద్వత్తు కలగలిసిన మూర్తిమత్వం

**సంగిశెట్టి శ్రీనివాస్**, ఫోన్ : 994 922 0312

సాహిత్య పరంగా తెలియని విషయం తెలుసుకోవడానికి నిఘంటువులు, పదకోశాలు ప్రధాన వనరులు. కొన్ని వేల గ్రంథాలు అవలోకించి, విశ్వవిద్యాలయాలు, సంస్థలు, విద్వాంసులు కలిసి చేయాల్సిన పనిని తానొక్కడే సంవత్సరాల తరబడి కృషి చేసి పాఠకులకు పరిచయం చేసినవారు. తెలుగులో సూర్యారాయంధ్ర నిఘంటువు అత్యంత ప్రామాణికమైనదిగా ప్రసిద్ధి. అయితే ఈ నిఘంటువులో చేరని 36 వేల పదాలు సేకరించి 2004లో **'శ్రీహరి నిఘంటువు'**ని వెలువరించారు. ఇందులో తెలంగాణ మాండలికంలో ప్రసిద్ధి గాంచిన ఎన్నో పదాలు చోటు చేసుకున్నాయి. ఇవన్నీ చేసింది మొన్న (ఏప్రిల్ 21న) చనిపోయిన ప్రతిభా సంపన్నుడు ఆచార్య రవ్వా శ్రీహరి. **'శ్రీహరి నిఘంటువు'** తయారీకి ఆయన ఎనిమిదేండ్ల కాలాన్ని వెచ్చించాడు అంటే ఆయన దీక్షాదక్షత అర్థమవుతుంది. అంతకుముందు సంకేత పదకోశం, వ్యాకరణ పదకోశం (గ్రంథాలను తీర్చిదిద్దారు. రిటైరైన తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానం వారి కోరిక మేరకు **'తాళ్లపాక కవుల సంకీర్తనా వాఙ్మయం'** నిఘంటువుని నాలుగేండ్లు శ్రమించి తయారు చేశారు. దీనిని 2012లో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ విభాగం వారు అచ్చేశారు. ఇట్లా పదకోశాలు, నిఘంటువులు పాఠకులకు మార్గదర్శకాలుగా ఉంటాయి. అయితే సృజనాత్మక రచయితకు దక్కే గౌరవం, గుర్తింపు వీటి నిర్మాతలకు దక్కదు. ఇదే విషయాన్ని ఒక సారి శ్రీహరి సారుతో నేను ప్రస్తావిస్తే **"మనం చేసే పని పదిమందికి పనికొస్తుందా లేదా అనేదే ప్రధానం. మనకు గుర్తింపు వస్తుందా, లేదా అనేది ద్వితీయ ప్రాధాన్యత గల అంశం"** అని చెప్పారు.




తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రవ్వా శ్రీహరి సారు మార్గనిర్దేశనంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలు రూపుదిద్దుకున్నాయి. ఆ సమయంలో కమిటీలో సారుతో కలిసి పనిచేశాను, అట్లాగే తెలుగు అకాడెమీ తెలంగాణ సాహిత్య చరిత్ర గ్రంథాన్ని ప్రచురించాలని భావించినప్పుడు దాని ప్రధాన సంపాదక బాధ్యతలు కూడా శ్రీహరి గారికే అప్పగించారు. ఆయన సంపాదకత్వంలో అనేక సార్లు భేటీ అయి తెలంగాణ సాహిత్య చరిత్ర రాశాము. ఇందులోనూ నేను కూడా భాగస్వామి కావడం నా అదృష్టం. ఈ సమయంలో ఆయనను చాలా దగ్గరగా చూడడం జరిగింది. కటువైన విషయం చెప్పాల్సి వచ్చినపుడు సైతం మార్దవంగానే, ఎలాంటి ఆగ్రహం లేకుండా, ఒక్క అల్ప పదం వాడకుండా చెప్పడం ఆయనకు మాత్రమే సాధ్యం. తనకన్నా వయసులో చిన్నవారిని సైతం అండీ, గారూ అనే పదం లేకుండా ఎన్నడూ సంబోధించలేదు. ఎంతటి పండితుడో అంతకన్నా ఎక్కువ సహృదయుడు. ఎంతటి సహృదయుడో అంతటి విద్వత్తుగలవాడు. ఎంత విద్వత్తుందో అంతటి కార్యశీలి. ఎంతటి కార్యశీలో అంతటి తెలంగాణాభిమాని, అట్లా అని ద్రావిడ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్‌గా, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ విభాగం నిర్దేశకులుగా తన పని ద్వారా తెలుగువారందరి మన్ననలందుకున్నారు.




తెలంగాణ ఉద్యమం పురుడు పోసుకోక మునుపే నల్లగొండ జిల్లాకే ప్రత్యేకమైన పదాలను సేకరించి దానికి మాండలిక భాషా లక్షణాలను తెలుపుతూ విపులమైన పీఠికను రాశారు. ఇది నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం. గ్రంథంగా 1986లో వెలువడింది. ప్రాచీన కావ్యాల్లో చోటు చేసుకున్న తెలంగాణ మాండలిక పదాలను సేకరించి 'తెలంగాణ మాండలికాలు కావ్యప్రయోగాలు' అనే గ్రంథాన్ని ప్రచురించారు. ఇందులో దుద్దె దూప, కొంచబోవు, ఏరాలు, బొండిగ, బొక్క పదాలు, డు ప్రత్యయాంశాలు కావ్యాల్లో ఎట్లా వాడినారో రికార్డు చేసినాడు. తెలంగాణ భాషపై సాధికారికంగా మాట్లాడే విద్వత్తు సార్‌కు మాత్రమే ఉండడంతో అనేక సాహిత్య సభలకు భాషపై మాట్లాడేందుకు



మేము నిర్వహించిన అనేక సభలకు ఆహ్వానించాము. అందుకు తగ్గట్టుగానే ఆయన ప్రసంగాలు ఆక ట్టుకునేవి. తెలంగాణలో ఎవరైనా తమ మాటల్లో ముత్తెమంత, పిత్తెమంత అనే పదాలు వాడుతూ ఉంటారు. అయితే ఈ పదాలు కావ్యాల్లోనే ఉన్నాయని లెక్కగట్టి తేల్చి చెప్పేవాడు. 'ముత్తైమంత చక్కెర / మసాల అరువెవ్వరన్నా అడిగితే... దాని అర్థం, చాలా స్వల్ప మొత్తం కావాలనడం. అయితే జవాబుగా వాసనకు కూడా లేదు అని చెబుతారు. అంటే ముత్తెమంత (ముత్యమంత) కాదు కనీసం వాసనకు కూడా ఆ వస్తువు లేదు అని చెప్పడం. ఇది తెలంగాణ భాష సొబగు అని శ్రీహరి సారు ఆ సమావేశాల్లో చెప్పేవారు. భాషపైన ఆయనకున్న సూక్ష్మ దృష్టి, లోతైన అధ్యయనం, అపారమైన అనుభవం అర్థమవుతుంది.

పరిశోధకులకు కల్పతరువు లాంటి అలబ్ధ కావ్య పద్య ముక్తావళి (1983), తెలుగులో అలబ్ధ వాఙ్మయం (1983), గ్రంథాలు భావి పరిశోధకులు మార్గదర్శ కాలుగా ఉపయోగ పడుతున్నాయి. శ్రీహరి గారి వ్యాసాలు ఉదయ భారతి (1996), సాహితీ నీరాజనం (2008) పేరిట అచ్చయ్యాయి. వ్యాకరణం, పదకోశం, నిఘంటువు, భాష, పరి శోధన ఇట్లా పలు ప్రక్రియల్లో తెలుగు సాహిత్యాన్ని దాని ఘనతను సులభతరం చేసి పాఠకులకు అందజేసినాడు. ఒక్క తెలుగులోనే కాదు సంస్కృతంలోనూ రచనలు చేసినారు. కొన్ని తెలుగు కావ్యాలను సంస్కృతంలో తర్జుమా చేసినవారు. జాషువా మీది అభిమానంతో ఫిరదౌసి, గబ్బిలం కావ్యాలను అదే చంధస్సులో సంస్కృతంలో ఫిరదౌసి, 'తైలపాయికా' పేరిట అనువాదం చేశారు.


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**


వీటితో పాటు సంస్కృతంలో 'మాతృగీతమ్, సంస్కృత వైజయంతీ' అనే గ్రంథాలను వెలువరించారు. వీటికి కొనసాగింపుగా సి. నారాయణరెడ్డి ప్రపంచపది, అన్నమయ్య 'సూక్తిసుధా, వేమన శతకము, నరసింహ శతకములను తెలుగు నుంచి సంస్కృతంలోకి తర్జుమా చేసినాడు. ఇట్లా రెండు భాషల మధ్యన వారధి నిర్మించిన వాడు.

ఇంతటి ప్రతిభా సంపన్నుడు సామాన్య చేనేత కార్మిక కుటుంబంలో సెప్టెంబర్ ఏడు, 1943 నాడు నల్లగొండ జిల్లా అమ్మమ్మ ఇంట్లో మునిపంపులలో జన్మించాడు. తల్లిదండ్రులు రవ్వా వెంకటనర్సమ్మ, వెంకటనర్సయ్యలు. యాదగిరి లక్ష్మీ నృసింహుడి మీది భక్తితో చుట్టుప్రక్కల ప్రాంతాల వారు ఇట్లా నరసమ్మ, నరసయ్య పేర్లు పెట్టుకోవడం సాధారణ విషయం. ఈయన సొంత గ్రామం ఇప్పటి యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం, వెల్వర్తి, తెలుగు, సంస్కృతం భాషలను, సాహిత్యాన్ని అవలోడనం చేశారు. అందుకే ఏది రాసినా, ఏది చెప్పినా ప్రామాణికంగా ఉండేది. అత్యంత పేదరికంలో ఉండి ఫ్రీగా వసతి, భోజనం దొరుకుతుందనే ఉద్దేశ్యంతో యాదగిరిగుట్ట సంస్కృత పాఠశాలలో చేరిండు. అక్కడి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ వి.వి. పాఠశాలలో టీచ ర్ గా, సారస్వత పరిషత్తులో లెక్చరర్‌గా, ఉస్మానియా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీల్లో ఆచార్యులుగా, ద్రావిడ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్గా పనిచేసిండు. ఎక్కడ ఉద్యోగం చేసినా తనదైన ముద్రను వేశారు. వ్యక్తిగా అంతకు వందరెట్లు విద్యార్థులు, పరిశోధకులు, అంతేవాసుల అభిమానాన్ని చూరగొన్నారు. ఇటీవలే ప్రభుత్వ డిగ్రీకళాశాల లెక్చరర్ డాక్టర్ అహల్య, రవ్వా శ్రీహరి జీవితం సాహిత్యం అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నది. ఆ పరిశోధన గ్రంథం కూడా ప్రచురితమైనట్లయితే కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయి.

ఇంతటి గొప్ప పండితుడికి ఎప్పుడో పద్మశ్రీ అవార్డు రావాల్సి ఉండింది. సాహిత్య అకాడెమీ అవార్డు బాకీ ఉంది. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం శ్రీహరి గారి పేరును కేంద్ర ప్రభుత్వానికి పద్మశ్రీ కోసం ప్రతిపాదించాలి. అంతేగాకుండా తెలంగాణ ప్రభుత్వం ఆయన పేరిట ప్రతి సంవత్సరం ఒక సాహితీ వేత్తకు అధికారికంగా 'జీవిత సాఫల్య పురస్కారం'ని అందించాలి. యాదగిరిగుట్టలో ప్రభుత్వం నెలకొల్పిన సంస్కృత పాఠశాలను కళాశాల స్థాయికి పెంచి దానికి 'యాదగిరి గుట్ట రవ్వా శ్రీహరి సంస్కృత విద్యాపీఠమ్'గా దానికి పేరుంచాలి. వీటితో పాటు తెలుగు అకాడెమి గానీ, తెలంగాణ సామిత్య అకాడెమీ గాని ఆయన రచనలన్నింటినీ పునర్ముద్రించి (అముద్రితాలుగా ఉన్న వాటితో సహా) తెలంగాణ ప్రతిభను తెలుగు పాఠకులందరికీ తెలియజెప్పాల్సిన అవసరముంది.

(మన తెలంగాణ సౌజన్యంతో...)

# నా పరిష్కరణ గ్రంథాలను ఆవిష్కరించిన శ్రీహరి గారు

ఆచార్య వంగరి త్రివేణి, ఫోన్ : 995 1444 903

రాష్ట్రపతి అవార్డు 'ప్రతిభా పురస్కారం' గ్రహీత, మహామహో పాధ్యాయ, సంస్కృతాంధ్ర భాషల్లో పండితులు, అపార జ్ఞాన సంపన్నులు, లాక్షణికులు, సద్విమర్శకులు, నిఘంటు నిర్మాణ కర్త, పాఠ భేద పరిష్కర్త, వ్యాకరణ భాషాశాస్త్రవేత్త, అనువాదకులు, మాండలిక భాషా ప్రయోగ కర్త, పాఠ్యపుస్తకాల నిర్మాణ కర్త, గొప్ప సాహితీవేత్త, ఉత్తమ అధ్యాపకులు అయిన ఆచార్య రవ్వా శ్రీహరి గారికి నాకు ఎనలేని అనుబంధం ఉంది. అందులో కొన్ని సందర్భాలు పదేపదే గుర్తుకు వస్తుంటాయి. వారి పరిశోధనా, విమర్శనా దృక్పథాన్ని గుర్తు చేస్తుంటాయి.

జానపద కళారాధకులు కీ.శే. అచల పరిపూర్ణ నిర్మలానంద వంగరి నారసింహార్యులు మా పెద్దనాన్న గారు. ఆయన రచించిన "శ్రీ వామన చరిత్రం – చిఱుతల నాటకం (హరికథా)", "శ్రీ మార్కండేయ విలాసం (ఉత్తర భాగం)", "శ్రీ రామలింగేశ్వర శతకం", "భక్తితత్త్వ సంకీర్తనలు" నేను పరిష్కరించి ఆవిష్కరించాను. ఈ పుస్తకాల ఆవిష్కరణలో మా గురువర్యులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య మసన చెన్నప్ప, మా నాన్నగారు శ్రీ నారాయణార్యుల సలహాలు, సూచనలు ఎంతగానో తోడ్పాటును అందించాయి. ఆ సందర్భంలోనే మా నాన్నగారి సహకారంతో "అచల పరిపూర్ణ యోగి శ్రీనారసింహార్య" జీవిత చరిత్రను రచించారు. ఈ పుస్తకాలన్నింటిని 2007 జూన్ నెలలో రంగారెడ్డి జిల్లా (ప్రస్తుతం మేడ్చల్ మల్కాజ్ గిరి)లోని జగ్గంగూడలో గల శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఆచార్య రవ్వా శ్రీహరి గారు తమ కరకమలముచే ఆవిష్కరణ చేసినప్పుడు నాకెంతో మహదానందం కలిగింది.

ఈ విషయంలో శ్రీహరి గారు నన్ను చాలా ప్రశంసించారు. నేను పరిష్కరించినవి చిన్న పుస్తకాలే గాని, అవి క్రిమిద్రష్టం కాకుండా సాహితీలోకం వెలుగు చూస్తుండడం పట్ల ఆయన చాలా సంతోషం వ్యక్తం చేశారు. పల్లె మట్టిలో పుట్టిన అమూల్యమైన గ్రంథాలెన్నింటినో పరిష్కరించిన మహానుభావులు ఆయన. ఏ చిన్న మాటను పలికినా, ఏ చిన్న పుస్తకం దొరికినా ఆసాంతం పరిశీలించి వ్యాకరణ రూపాన్ని, చారిత్రిక, భౌగోళిక స్వరూపాన్ని నిర్ణయించగల సాధికారి. అదే ఒదుపుతో నిలపగల ధీశాలి కూడా.

మొదట ఈ పుస్తకాల ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా ఎవరిని ఆహ్వానిద్దామని ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య మసన చెన్నప్ప గారలు ఆలోచించినప్పుడు మా ముందు కనిపించిన మహోన్నత మూర్తి శ్రీహరి గారు ఒక్కరే. నేను అప్పుడప్పుడే నా ఎం.ఫిల్., పిహెచ్.డి పరిశోధనలను పూర్తి చేసుకొని తెలంగాణ విశ్వవిద్యాలయం



లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదవీ బాధ్యతలను చేపట్టాను. చాలా చిన్నదానిని, అప్పుడే సాహిత్య అధ్యాపన వృత్తిలో తొలి అడుగులు వేస్తున్న దానిని. నేను పరిష్కరించిన పుస్తకాల ఆవిష్కరణకు అంతటి గొప్ప పరిష్కరణవేత్త, వ్యాకరణ దిక్సూచి అయిన రవ్వా శ్రీహరి గారు వస్తారా అనే సంశయం నాలో కలిగింది. కాని నిగర్వి, నిరాడంబరులు అయిన ఆయన చాలా నిర్మొహమాటంగానే ఒప్పుకున్నారు.

ఆవిష్కరణ సభకు ఆహ్వానించడానికి హైదరాబాద్ లోని వారి ఇంటికి వెళ్లినప్పుడు నన్ను ఎంతో ఆప్యాయంగా పలకరించారు. అప్పటివరకు ఏ నిండు సభలో గాని, ఏ నిండు సదస్సుల్లో గాని దూరంగా చూసి వారి భాషణం పట్ల ప్రేరేపితురాలిని అయిన దానిని. అప్పుడే ఆ రోజే అలా ప్రత్యక్షంగా చూసినప్పుడు, ఆత్మీయంగా పలకరించినప్పుడు చెప్పలేని అనుభూతి నాలో కలిగింది. వారు అప్పటికే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటిలో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పంలో ఉపకులపతిగా బాధ్యతలు నిర్వర్తించారు కూడా. కాని వారి కుటీరం చూస్తే చాలా చిన్నదిగా, మొదటి గది అంతా కింద, మీద పుస్తకాలలో నిండి ఉంది. నేటితరానికి ఉన్న హోదా గర్వం, ఆడంబరత ఆయనలో కించిత్తు కూడా ద్యోతకం కాకపోవడం చాలా అబ్బురం అనిపించింది. మన ఇండ్లల్లో మన పెద్దనాన్నలు, చిన్ననాన్నలు ఎలా ఉంటారో ఆ రోజు వారి ఇంటిలో ఆయన చేరువలో ఉన్నప్పుడు అలా అనిపించింది. వెదికి వెదికి ఒక కాలనీలో చివరన ఉన్న వారి ఇంటికి వెళ్లినప్పుడు ప్రశాంతమైన

ఆదరణ లభించింది. ఆయన ఇంటి నిండా పుస్తకాలు చూసినప్పుడు తిక్కన గారి స్వగృహం గుర్తుకు వచ్చింది. కేతన దశకుమార చరిత్రలో తిక్కన గృహం నిత్యం బహు సాహిత్య సారస్వత సకల కళా శాస్త్ర పాండిత్యాలకు నిలయమై ఉండేదని చదివాము కదా! నిజంగా అలాంటి గృహాన్ని ప్రత్యక్షంగా తిలకించాను. సంస్కృతాంధ్ర కవులకు, వేద విహితులకు, లక్షణకారులకు, వ్యాకరణ వేత్తలకు, భాషావేత్తలకు, అధ్యాపకులకు, పరిశోధకులకు, ఛాత్రులకు నిలయంగా శ్రీహరి గారి గృహం ఉండడం నాకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగించింది. వారి ఇంట్లో పురాతనమైన చెక్క పెట్టెలు ఉన్నాయి. ఒక్కో పెట్టెకు ఒక్కో అక్షరం రాసి ఉంది. అకారాది క్రమంలో ఉన్న పెట్టెలను చూస్తే ఎంతో ముచ్చటేసింది. అందులో కాగితం ముక్కలు రెప రెపలాడుతూ కనిపించాయి. ఆయన గొప్ప భాషా పరిశీలకుడు కాబట్టి క్షేత్ర పర్యటనలో మోసుకొచ్చిన పదాలను, వాటి అర్థాలను రాసి ఆయా పెట్టెల్లో వేసేవారు. సాహిత్య సర్వస్వం అంతా ఒకే గూటిలో ఉన్నట్లు ఆనాడు శ్రీహరిగారి గృహం దర్శనమిచ్చింది. ఆ ఇల్లు ఇప్పటికి నా కళ్ళలో ఒక గీచిన చిత్రంగా కదలాడుతూనే ఉంది.

ఇక నేను పరిష్కరించిన పుస్తకాలను శ్రీహరి గారు ఆవిష్కరించినప్పుడు ఇంకా ఆ ఆనందం రెట్టింపైంది. అచలయోగి శ్రీ నారసింహార్య రచనా కాలాన్ని గూర్చి శ్రీహరి గారు తెలుపుతూ నాడు జనపదాల్లో జానపద కళలు వెల్లివిరిశాయని అన్నారు. ప్రతి గ్రామంలో వీధి వీధిన, వాడవాడన చిఱుతల ఆటలు ప్రదర్శింపబడేవని, పిన్నలు, పెద్దలు, యువకులు అందెలు గట్టి, చిందులు తొక్కేవారని ఆ విశేషాలతో ఆనందాన్ని పంచుకున్నారు. నాటి ప్రజలను చిఱుతల ఆటలు మంత్ర ముగ్ధుల్ని చేయడం, కళాకారులు తమ నైపుణ్యం ఉట్టి పడేటట్లు ఉత్సాహంతో చిఱుతల నాటకాలను ప్రదర్శించడం తాను కళ్ళారా చూసినట్లుగా పేర్కొన్నారు. తెలుగువారి సంస్కృతీ వికాసానికి తమవంతు యోగదానం (కంట్రిబ్యూషన్) జానపద కాళాకారుల వల్లే అందిందని విశ్వాసం ప్రకటించారు.

అచలయోగిగా శ్రీ నారసింహార్య పట్ల గౌరవాదరణలు ప్రదర్శించారు శ్రీహరి గారు. అలాగే అచల సిద్ధాంత అనుయాయురాలిగా నా పరిష్కరణ విధానాన్ని మెచ్చుకున్నారు. కవి గొలుసు రాతలో రాసిన ఒక్కో అక్షరాన్ని విడమరిచి వాటిలో గల వ్యాకరణ - ఛందో లక్షణాలను అనుశీలించడం అంత సులభమైన పని కాదన్నారు. కవి నాలుగు పుస్తకాలతో పాటు వారి జీవిత చరిత్రను సంగ్రహంగా రచించి ఆవిష్కరించినందుకు నన్ను గూర్చి సభలో తెలియజేశారు. ఇటువంటి పరిష్కరణ నేపథ్యం గల పరిశోధకులు అధిక సంఖ్యలో బయటకు రావాలని కోరుకున్నారు. అప్పుడే మన సాహిత్యం బహుముఖాలుగా వెలుగొందుతుందని అన్నారు.

శ్రీహరి గారు ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో కవి నారసింహార్య ప్రతిభను కొనియాడుతూ పోతన భాగవతంలో కథను ఆధారంగా చేసుకొని "శ్రీ వామన చరిత్రము - చిరుతల నాటకము"ను రచించారని అన్నారు. కథకు అనుగుణమైన పాత్రలను, పాత్రల ప్రవేశాలను, వాదములను, యుద్ధములను, వర్ణనలను అత్యంత సుందరంగా ప్రవేశ పెట్టారని అన్నారు. చక్కని దర్వులతో, పాటలతో పాఠకుల మనస్సును ఆకట్టుకున్నారని, కీర్తనలలోను, దర్వులలోను ప్రాస యతులను కూర్చి భావానుగుణంగా, రాగతాళ బద్ధంగా రచన చేశారని, ఈ నాటకం భక్తి, తాత్త్విక, ఆధ్యాత్మిక భావాలకు ఆలవాలమై అలరారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

"శ్రీ వామన చరిత్రము - చిఱుతల నాటకము"ను శ్రీ సద్గురుని, శ్రీ విఘ్నేశ్వరుని ప్రార్థనలతో ప్రారంభించారని అన్నారు. దేశీబాణీలో ఈ నాటకం నడిచినా కవి సంప్రదాయాన్ని పాటించాడనడానికి అనేక విషయాలు ప్రస్తావించారు. బలిచక్రవర్తి రంగ ప్రవేశం చేయడం, అతడు స్వర్గ లోకాన్ని వర్ణించడం, బృహస్పతికి ఇంద్రునికి సంవాదం జరగడం, అదితి కశ్యప బ్రహ్మల సంభాషణం, విష్ణుమూర్తికి అదితికి వాదం జరగడం, బలిచక్రవర్తికి వామనునికి మధ్య సుదీర్ఘంగా వాదం జరగడం, వామనుడు విశ్వరూపం ధరించడం, బలిచక్రవర్తి ఆ విశ్వరూపాన్ని వర్ణించడం, చివరకు ప్రహ్లాదుడు రావడం మొదలగు ఘట్టాలన్ని సభలోని ప్రేక్షకులకు చెబుతూ కళ్లకు కట్టినట్లుగా వర్ణించారు. ఈ నాటకంలోని వివిధ వర్ణనలను, సంవాదాలను చక్కటి బాణీల్లో దర్వులను ఉపయోగించి కవి రచనా నైపుణ్యాన్ని కొనియాడారు. అంతేగాక వృత్త, జాతి, ఉపజాతి


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

పద్యాలను ఉపయోగించి ఈ నాటకానికి విశిష్ట ఛందో వైవిధ్యాన్ని కలిగించారని కూడా ప్రశంసించారు. సీస పద్యాలను అలవోకగా ప్రయోగించినట్లుగా వివిధ సంవాదాలలో కన్పిస్తుందని, మచ్చుకు విష్ణుమూర్తికి, అదితికి మధ్య జరిగిన సంవాదంలోని ఒక సీస పద్యాన్ని చదివి వినిపించారు.




ఎన్నో దర్వులతో ఈ నాటకం ప్రదర్శన యోగ్యమైనదని, అందుకే కవి తన కాలంలో చిరుతల నాటకాలకు వంతలుగా వ్యవహరించి కళాభిరుచి గల యువకులకు నేర్పించి ఆయా జాతర్ల, తిరునాళ్ళ సమయంలో ప్రదర్శింపజేశారని గుర్తు చేశారు. సంస్కృతంలో వ్యాసమహర్షి, సంప్రదాయ చంపూ పద్ధతిలో భక్తపోతన ఎందరో వామన చరిత్రను తెలుగు వారికి అందించారని పేర్కొంటూనే దేశీ జానపద చిరుతల నాటక పద్ధతిలో రచించి ప్రదర్శింపజేసిన శ్రీ నిర్మలానంద వంగరి నారసింహార్యులు ధన్యులని అభివర్ణించారు.

ఇక "శ్రీ మార్కండేయ విలాసము (ఉత్తరభాగం) హరికథా రూపం" అనే పుస్తకం గూర్చి మాట్లాడుతూ పద్మశాలి వంశానికి మూలపురుషుడు మార్కండేయుడని, భక్తిపరులు – తత్త్వ సంపన్నులు – మహర్షి సంతతి గలవాడని వివరించారు. ఈ మార్కండేయ పురాణాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చని అన్నారు. పూర్వభాగంలో మార్కండేయుని జన్మ వృత్తాంతం ఉ ంటుందని, అల్పాయుష్షు గల మార్కండేయుడు శివలింగాన్ని పరమభక్తి భావంతో పూజించి దీర్ఘాయుష్షును పొందుతాడని పేర్కొన్నారు. ఉత్తర భాగంలో వస్త్ర నిర్మాణ విశిష్టత తెలుపబడిందని అన్నారు. ఇటువంటి ప్రాయోజిత ఘట్టాలు గల మార్కండేయ పురాణాన్ని తెలుగులోకి 'మారన' రచించారని, కవి శ్రీ నారసింహార్య అటువంటి రచనా కౌశలాన్ని చూపడం అంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. అయితే ఈ పురాణాన్ని జానపద కళారూపమైన హరికథలో మార్కండేయ విలాసము (పూర్వభాగం) చెర్విరాల బాగయ్య గారు రచించగా, ఈ పూర్వభాగం ఆధారంగానే శ్రీ వంగరి వేంకట నారసింహార్యులు ఉత్తరభాగాన్ని రచించారనే విషయాన్ని నా (త్రివేణి) నుంచి తెలుసుకున్న శ్రీహరి గారు చాలా ప్రశంసించారు. చెర్విరాల బాగయ్య గారు చేతి వ్రాతతో రాసిన ప్రతిని ఆనాడు నేను ఆచార్య కసిరెడ్డి గారికి అందజేశాను కూడా.




మార్కండేయుని కుమారులలో రెండవవాడు భావనాఋషి అనేక యుగాలు గడిచిన తర్వాత వైవస్వత మన్వంతర కాలారంభంలో ఈ సృష్టిలోని మానవులకు కొంతకొంత నాగరికత అలవడటం ప్రారంభమవుతున్న తరుణంలో వస్త్ర నిర్మాణం చేయు నిపుణుల కోసం గాలించాడని ఒక్కో సన్నివేశాన్ని విడమరిచి చెప్పారు. బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారం వస్త్ర నిర్మాణం చేయడానికి సంసిద్ధుడైనాడు. భావనాఋషి దేవలోకం వెళ్ళి శ్రీమన్నారాయణుని ప్రార్థించి భూలోకవాసులకు సరిపడు పద్మతంతు బీజాలను తీసుకొని తర్వాత కైలాసం వెళ్ళి పరమశివుని వద్ద వస్త్ర నిర్మాణ విద్యను తెలుసుకున్నాడని, తాను ఈ విద్యతో తయారు చేసిన వస్త్రాలను ప్రప్రథమంగా త్రిమూర్తులకు సమర్పించడం, వారి నుంచి అనేక వరాలను పొందడం వంటి సన్నివేశాలను వర్ణనాత్మకంగా కవి పద్య వైభవాన్ని కళ్లకు కట్టినట్లుగా శ్రీహరి గారు పేర్కొన్నారు. ఈ విధంగా పద్మంలోని తంత్రులతో వస్త్రాలు నిర్మించడంవల్ల అ వైకుంఠాధిపతి వీరికి 'పద్మశాలీ వర్గీయులు' అని నామకరణం చేసి ఆశీర్వదించాడనే శ్రేష్టమైన విషయం చెప్పి పద్మశాలి బంధు మిత్రులలో ఆత్మోన్నత్యాన్ని పెంపొందించారు.




భావనా ఋషి శతపుత్ర సంతానంలో భరత ఋషి సంతానంలోని వారే వంగరి వంశస్తులు. ఈ వంగరి వంశానికి చెందినవారు శ్రీ అ.ప. నిర్మలానంద వంగరి వేంకట నారసింహార్యులు గారని మా వంశ వివరాలు చెబుతుంటే ఆ రోజు శ్రీహరి గారు ఒక పురాణవేదిగా కనిపించారు. కవి తన ప్రతిభతో ఈ హరికథను రచించి కుల గౌరవాన్ని నిలబెట్టడమేగాక, అష్టాదశ పురాణాలలో



గల మార్కండేయ పురాణాన్ని హరికథగా మలిచి దేశీ సాహిత్యంలో ఈ రచనకు సుస్థిరతను కల్పించారని అన్నారు.

3. శ్రీ రామలింగేశ్వరస్వామి మీద భక్తితో శ్రీ నారసింహార్య ఒక శతకం రచించారని అన్నారు. మొదట కర్మయోగిగా ఉన్న కవి తదంతరం భక్తియోగంలోకి వచ్చి మూర్తి ఆరాధన ద్వారా గురు ఆరాధనలో పరిపూర్ణుడైనారని, ఈ తత్త్వానికి అనుగుణంగా తేటగీతి పద్యాలలో శ్రీరామలింగేశ్వర శతకం రచించారని అన్నారు. బ్రహ్మసత్యం – జగన్మిథ్య అన్న ఆదిశంకరుల సిద్ధాంతాన్ని పరిపూర్ణంగా విశ్వసించినవారు అచల పరిపూర్ణానంద యోగులు నారసింహార్యులని అన్నారు. వారు గీత పద్యాలలో తమ మనస్సులోని విశుద్ధభావాలను రమ్యగుణనిధీ సంగ! శ్రీ రామలింగ ! అనే మకుటంతో చెప్పినా మనలనందరినీ రమ్య గుణనిధీ సంగులను కమ్మంటున్నారని హితబోధ చేశారు. అలా అయితే మనమూ శ్రీరాముల మవుతాం, శ్రీ లింగమవుతాం. వెఱసి రామలింగాద్వైతు లమవుతామనే ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించారు.

శ్రీహరి గారు శ్రీ నారసింహార్య రచించిన భక్తితత్త్వ సంకీర్తనలను కూడా ఈ సభలోనే ఆవిష్కరించారు. కవి శ్రీ మద్రామదుగు శివరామ దీక్షితులు స్థాపించిన అచల సిద్ధాంతాన్ని ఆశ్రయించారని, అచల గురుబోధను తన తండ్రి గారైన శ్రీ వంగరి వేంకయ్యార్యులు నుండి స్వీకరించారని, సృష్టి రహస్యాన్ని ఛేదిస్తూ, జన్మ రాహిత్యాన్ని పొందాలని ప్రయత్నించారని అన్నారు. తర్వాత అ.ప. శ్రీ సత్యానంద గంజి నరేంద్రార్యులు నుండి పరిపూర్ణ గురు బోధను స్వీకరించి గురు స్థానాన్ని అలంకరించారని, అప్పుడే అచల గురు పీఠాన్ని అధిష్ఠించారని అన్నారు. తనను ఆశ్రయించిన వారిని శిష్యులుగా చేసుకొని గురు బోధ చేస్తూ తత్త్వ గీతాలను రాసినట్లుగా తెలిపారు.

ఆ రోజు ఆయన శ్రీ నారసింహార్యులు గారి చిరుతల నాటకం, హరికథ, పద్యాలు, కీర్తనలను ఆవిష్కరించడం నా జన్మ ధన్యతగా భావించాను. ఈ సభకు అధ్యక్షత బాధ్యతను ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి నిర్వర్తించగా, ప్రారంభకులుగా ఆచార్య మసన చెన్నప్ప వ్యవహరించారు. మా నాన్నగారు శ్రీ నారాయణార్యులు ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ఎంతగానో సహకరించారు.

తర్వాత చాలా సదస్సులలో వేదికల మీద శ్రీహరి గారు ఎప్పుడు కనిపించిన నన్ను గుర్తుపట్టి పరిష్కరణ గ్రంథాల పరాశక్తి తీసేవారు. ఒక సారి ఖైరతాబాద్ డిగ్రీ కళాశాలలో రామదాసు సాహిత్యానుశీలన మీద జరిగిన సదస్సుకు కీలకోపన్యాస కర్తగా విచ్చేశారు. ఆ సదస్సులో నేను "దాస సాహిత్యం – రామదాసు – ప్రభావం" అన్న అంశంపై పత్రసమర్పణ చేశారు. దాస సాహిత్యం మీద భారతీయ భక్తి ఉద్యమాల ప్రభావం ఎలా ఉందో తెలుపుతూ ఒక లక్షణయుతమైన పరిశోధన చేసి పత్ర సమర్పణ చేసినందుకు నా పట్ల ఆదరణ చూపారు. ఆ సభలోనే నాకు "నల్గొండ జిల్లా మాండలిక భాష స్వరూపం" పుస్తకాన్ని బహుకరించారు.

శ్రీహరి గారు నిగర్వియే కాని, పాఠ్య పరిష్కరణల విషయం వచ్చినప్పుడు తమ స్వరం పెంచేవారు. ఎందరో అధికారులుండగా అనేక పాఠ్య పుస్తకాల పునర్ముద్రణలో శ్రీహరి గారే ప్రణాళికను నిర్ణయించేవారు. ఒకానొక సందర్భంలో రామాయణ గాథ, శ్రీరాముడి వృత్తాంతం మీద సభ్యుల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తినప్పుడు నిక్కచిగా నిలబడి ఆ పరిష్కరణల స్వరూపాన్ని శ్రీహరి గారే విశ్లేషించి చూపేవారు. ఎందుకంటే తన వ్యాకరణ గురువు శ్రీమాన్ కె. కె. శఠకోప రామానుజాచార్య స్వామి చేత శ్రీరామ శబ్దంతో విద్యాభ్యాసాన్ని ప్రారంభించి, భాస్కర రామాయణంలో పాఠ భేదాలను పరిశీలించి, రంగనాథ రామాయణం పూర్వాపరాలు ఎరిగిన శ్రీహరి గారే ఆ రామ కథల మీద పూర్తి అధికారం కలిగి ఉంటారు కదా. సాహిత్య జీవితమంతా వ్యాకరణ భాష శాస్త్రాలకు ఏ విధంగా వెచ్చించారో, రాముడి పట్ల అదే విధేయత చూపారు. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండడం శ్రీహరి గారి నైజం.

చిద్విలాసంగా నడిచిన శ్రీహరి సాహిత్య విజయంతో ఆయనను అనేక పురస్కారాలు వరించి వచ్చాయి. వాటన్నింటితో పాటు 15 ఆగస్ట్ 2019 నాడు మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ మండలి, భారత ప్రభుత్వం రాష్ట్రపతి అవార్డు ప్రతిభా పురస్కారం, 5,00,000 రూ. నగదు పారితోషికాన్ని ప్రకటించి గౌరవించింది. ఆ ప్రకటన జాబితాలో నా పేరు రాష్ట్రపతి అవార్డు మహర్షి బాదరాయణ వ్యాస సమ్మాన్ యువ ప్రోత్సాహ పురస్కారాన్ని, 100,000 రూ. నగదు పారితోషికాన్ని కూడా ప్రకటించడం ఒక గొప్ప ఆత్మానుభూతిని కలిగించింది.

వారి స్మృతుల ప్రోదిలో కొన్నిజ్ఞాపక వీచికలు ఇవి. ఇంకా ఇటువంటి అనుబంధాలను ఎన్నింటినో నెమరు వేసుకుంటూనే ఈ సాహిత్య జీవనానికి మార్గాన్ని నిర్దేశించుకోవలసిన అవసరం నాకు ఎంతైనా ఉందని భావిస్తున్నాను.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2023

# రవ్వా శ్రీహరిగారి సంస్కృత అనువాదాల వైలక్షణ్యం

**డా. గంగిశెట్టి లక్ష్మీనారాయణ**, ఫోన్ : 949424 8348

మనిషి తను జీవిస్తున్న సమాజంలో తనకు కావాల్సిన అనేక వస్తువుల్ని ఇతరుల వద్ద నుంచి తీసుకొని, ఇతరులకు కావాల్సిన వస్తువుల్ని తను ఇస్తుంటాడు. ఈ విధానాన్నే వస్తుమార్పిడి అంటారు. ఒక భాషలో ఉన్న సాహిత్యాన్ని ఇతర భాషీయులకు కూడా అందించాలన్న సత్సంకల్పంతో మరొక భాషలోకి సాహిత్యరచనలు అనువదింపబడుతుంటాయి. ఈ అనువాదాల వలన పరస్పర భాషా సాహిత్యాల ఆదాన ప్రదానాలే కాకుండా జాతీయ సమైక్యత కూడా పల్లవించి దేశవృక్షం ప్రవర్ధితమవుతుంది.

నన్నయగారి ఆంధ్రమహాభారతంతో సంస్కృతం నుండి తెలుగులోకి కావ్యరచనల అనువాదం ప్రారంభం అయ్యింది. వెయ్యేళ్ళ వెలుగులు విరజిమ్ముతున్న తెలుగుసాహిత్యచరిత్రలో సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించబడిన రచనలు అధికంగానే ఉన్నాయి. కానీ తెలుగు నుండి సంస్కృతంలోకి అనువదించబడిన గ్రంథాల సంఖ్య చాలా తక్కువ. ఈ లోటుని భర్తీ చేస్తూ ఆధునికకాలంలో తెలుగు సాహిత్య సంపదని సంస్కృతసాహిత్యానికి అనువాదోపాయనంగా అందించిన ఘనత మహామహోపాధ్యాయ ఆచార్య రవ్వా శ్రీహరిగారికి దక్కుతుంది అనటం స్తవం కాదు వాస్తవం. 7-9-1943న రవ్వా వెంకట నరసమ్మ, రవ్వా నర్సయ్యలకు జన్మించిన సరస్వతీ స్వరూపం ఆచార్య రవ్వా శ్రీహరి బుధేంద్రులు.

ఆచార్య రవ్వా శ్రీహరి గారు వ్యాకరణం, నిఘంటు నిర్మాణం, పాఠపరిష్కరణ, పరిశోధన, సాహిత్యవిమర్శ, తెలుగు-సంస్కృతం అనువాదం మొదలైన ప్రధానక్షేత్రాలలో వ్యవసాయం చేసి ఆధునికతరానికి సాయం చేసిన బహుముఖభారతి. ఆచార్య రవ్వా శ్రీహరి గారు సి. నారాయణ రెడ్డి గారు రచించిన తెలుగు ముక్తకాలైన ప్రపంచపదులు అనే గ్రంథాన్ని ప్రపంచపదీ (1997) అనే పేరుతో సంస్కృతంలోకి అనువాదం చేశారు. ఖండకావ్యాలతో ఖండాంతరాలలో సైతం అఖండ కీర్తి ప్రతిష్ఠలు పొందిన గుర్రం జాషువా గారు రచించిన ఫిరదౌసి ఖండకావ్యాన్ని ఫిరదౌసీ(2000) అనే పేరుతో, గబ్బిలం ఖండకావ్యాన్ని తైలపాయికా(2002) పేరుతో సంస్కృతంలోకి అనువదించారు. తెలుగునాట దేశీయమైన పలుకుబళ్ళకు చిరునామాగా నిలిచే అన్నమయ్య సంకీర్తనల్లోని సూక్తులని సంస్కృతీకరించి అన్నమాచార్యసూక్తిసుధ(2006), అన్నమయ్య సుభాషితాలు(2014) అనే గ్రంథాలని అందించారు. తెలుగుసాహిత్యంలో తనదైన ముద్రని వేసిన శతకప్రక్రియలో సుప్రసిద్ధమైన వేమనశతకాన్ని (2010), నరసింహశతకాన్ని (2011) సంస్కృతంలోకి అనువదించారు.



**ప్రపంచపదీ**

తెలుగుతల్లిని రెండవ మారు జ్ఞానపీఠాలంకృతురాలిగా చేసిన మానవతావాద కవి డా. సి. నారాయణ రెడ్డి గారు. వీరు ప్రపంచపదులు (1992 ) గ్రంథాన్ని రచించారు. ఉర్దూ, పారశీక భాషలలో ప్రసిద్ధమైన రుబాయీలని ప్రపంచపదులుగా సి.నా.రె. అక్షరీకరించారు. ప్రపంచతత్త్వాన్ని ఆవిష్కరించడం వల్ల, పంచపాదాత్మకంగా రచించడం చేత, లోకతత్త్వ వ్యక్తీకరణం ప్రపంచితం అవడం వల్ల ప్రపంచపదులుగా సి.నా.రె. ముక్తక కవితలకి నామకరణం చేశారు. తెలుగులో రమణీయంగా ఉన్న ప్రపంచపదుల్ని ఆచార్య రవ్వా శ్రీహరి గారు సంస్కృతంలోకి అనువాదం చేశారు.

కృషి ఉంటే మనుషులే ఋషులవుతారు. కార్యసాధనలో ఎదురయ్యే అనేక సంఘర్షణల్ని తట్టుకున్నప్పుడే మనిషి విజయశిఖరాన్ని అధిరోహించగలుగుతాడు. చైతన్యం, ప్రేరణ, స్పందన అనే విషయాల త్రివేణీసంగమంగా జీవితం ఉంటుంది. ఈ భావనని ప్రపంచపదిగా మనోహరంగా మలిచారు సి.నా.రె

**"ఏ రాపిడి లేకుండా వజ్రం ఎలా మెరుస్తుంది?**
**ఏ అలజడి లేకుండా సంద్రం ఎలా నిలుస్తుంది?**
**నడిపించే చైతన్యం లేనిదె నడవదు ఈ సృష్టి**
**ఏ ప్రేరణ లేకుండా నాదం ఎలా పలుకుతుంది**
**ఏ స్పందన లేకుండా హృదయం ఎలా బతుకుతుంది?"**

ఈ ముక్తకాన్ని ఆచార్య రవ్వా శ్రీహరి గారు ఉదాత్తంగా సంస్కృతీకరించారు.

**"అన్తరా నిర్ఘర్షణం నను జ్వలతి వా వజ్రం కథమ్ ?**
**అన్తరా సంక్షుబ్ధతాం నను తిష్ఠతి త్వబ్ధిః కథమ్ ?**
**అన్తరా నను చేతనాం నహి వస్తుజాలం చలతి కించిత్ ?**
**అన్తరా చ ప్రేరణాం నను భవతి వా నాదః కథమ్ ?**

**అన్తరా చ స్పందనం నను జీవతి తు హృదయం కథమ్ ? "**

మూలంలో ఉన్న శ్రవణ సుభగత్వాన్ని, భావగంధాన్ని ఆచార్య రవ్వా శ్రీహరి గారు చక్కగా సంస్కృతీకరించారు. 'లేకుండా' అనే భావాన్ని చెప్పడం కోసం 'న భవతి' అనకుండా 'అన్తరా' అనే అవ్యయాన్ని అన్ని పాదాలలో ఆదిలో ప్రయోగించి ఉపపదకారక విభక్తిని సైతం పరిచయం చేశారు.

తీవ్రమైన కార్యదీక్షాతత్పరత మనిషిని మనీషిగా పరివర్తింప జేస్తుంది. కష్టాన్ని ఇష్టంగా భావిస్తే విజయం వరిస్తుంది. కార్యసాధకుడు కష్టాన్ని స్ఫూర్తిమంతంగా భావించాలే తప్పా, బాధాకరవిషయంగా భావించరాదని సి.నా.రె బోధించాడు.

**కరగనిదే కొవ్వొత్తికి కాంతి ఎలా పుడుతుంది?**
**చెక్కనిదే శిలకడుపున శిల్పమెలా పుడుతుంది?**
**ఫలితం అందేది తీవ్రపరిణామంలోనె సుమా?**
**మరగనిదే నీరు ఎలా మబ్బు రూపు కడుతుంది?**
**నలగనిదే అడుగు ఎలా నటన రక్తి కడుతుంది?**

మూలంలో అక్షరాల అల్లికలో ఉన్న సి.నా.రె. ప్రతిభకి తగినవిధంగా ఆచార్య రవ్వా శ్రీహరి ఈ ముక్తకాన్ని సంస్కృతంలోకి అనువాదం చేశారు.

**దీపవర్తో ద్రవీభావం వినా దీప్తిర్భవతి కిమ్ ?**
**శిలాగర్భే తక్షణేన తు వినా శిల్పం భవతి కిమ్ ?**
**ఫలప్రాప్తిర్మానవానాం గాఢపరిణతిమూలికా**
**జలధివారిషు కిరణతాపం వినా మేఘో భవతి కిమ్ ?**
**శిక్షణం పదయోశ్చ బహుళం వినా నృత్యం భవతి కిమ్?**

అలతి అలతి సంస్కృతపదాలతో అనువాదం సాగటం వల్ల సంస్కృతభాషావిషయకంగా సామాన్యపరిచయం ఉన్నప్పటికీ విషయం సులభంగా అర్థం అవుతుంది.

ఈ ఉత్తమ అనువాదానికై ఆచార్య రవ్వా శ్రీహరి గారు 2001లో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డుని అందుకున్నారు.

**ఫిరదౌసీ**

కవిహృదయగత సంవేదనకి సారస్వతరూపం ఫిరదౌసి. మాట తప్పిన గజినీమహమ్మదు, ఫిరదౌసి, షానామాల ప్రస్తావన ఉండే చిన్న కథని జాషువా గారు మాడు ఆశ్వాసాలలో 168 పద్యాలతో ఫిరదౌసి ఖండకావ్యంగా రచించారు. ఆచార్య రవ్వా శ్రీహరి గారి అనువాదంలో నాలుగు సర్గలు 166 శ్లోకాలు ఉన్నాయి. కావ్యకథాను కూలంగా జాషువా గారు చేసిన మార్పుల్ని యథామూలకంగా ఆచార్య రవ్వా శ్రీహరి గారు అనువాదం చేశారు.

తెలుగులో ఉండే పదాలకు యథాతథానువాదం కాకుండా భావానువాదపద్ధతిని ఆచార్య రవ్వా శ్రీహరి గారు ఆశ్రయించారు. ఉదాహరణకి ముద్దుముచ్చట - హర్షవాగ్భిః (2-10), పండ్లు నూరినట్లు- క్రుధేవ (2-3) అని భావాన్ని ఆశ్రయించి అనువాదం చేశారు.

**తైలపాయికా**

తెలుగుసాహిత్యంలో సందేశకావ్యాలవరుసలో అగ్రస్థానంలో నిలిచే ఖండకావ్యం గబ్బిలం. అరుంధతీసుతుడి ఆవేదనకి అక్షరరూపం గబ్బిలం. ఆచార్య రవ్వా శ్రీహరి గారి సంస్కృతానువాద కృతి స్వీకర్త శ్రీ పేర్వారం రాములు గారు.

**వాని రెక్కల కష్టంబు లేని నాఁడు**
**సస్య రమ పండి పులకింప సంశయించు**
**వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు**
**భోజనముఁ బెట్టు వానికి భుక్తి లేదు.**

ప్రపంచానికి అన్నం పెట్టే వాని కడుపే నిండడం లేదని జాషువా ఆర్ద్రతతో చెప్పిన ఈ పద్యాన్ని రవ్వా శ్రీహరి గారు చక్కగా అనువాదం చేశారు.

**భుజాశ్రమో నాస్తి యదా తు తస్య**
**న సస్య లక్ష్మీః ఫలితుం సమిచ్ఛతి**
**శ్రాన్త్వా సదా భూరి జనాయ నిత్యం**
**దదాతి భుక్తిం స తు భుక్తిహీనః**
**కసరి బుసకొట్టు నాతని గాలిసోక**
**నాల్గు పడగల హైందవ నాగ రాజు**

అన్న జాషువా గారి పద్యభాగాన్ని ఆచార్య రవ్వా శ్రీహరి గారు పదబంధశోభతో

**"తస్య వాయుస్తు సరతి చేత్ ఫూత్కరోతి**
**ఫణచతుష్టయహైందవనాగరాట్ తు"** అంటూ అద్వితీయంగా అనువాదం చేశారు.

తెలుగులో ప్రసిద్ధమైన సీసం, ఆటవెలది, తేటగీతి ఛందస్సులని ఆచార్య రవ్వా శ్రీహరి గారు సంస్కృతంలోనూ ప్రయోగించారు. సంస్కృతం వారికి తెలుగు సీసపద్యపు నడకని పరిచయం చేశారు వీరు.

**అన్నమాచార్యసూక్తిసుధ, అన్నమయ్య సుభాషితాలు**

ఆంధ్రపదకవితా పితామహుడైన అన్నమయ్య 32వేల సంకీర్తనల రాశిని రాసి, వాసి కెక్కిన ఘనుడు. తాళ్ళపాక కవుల సూక్తుల్ని చక్కగా ప్రోది చేసిన ఆచార్య రవ్వా శ్రీహరి గారు సంస్కృతంలోకి వాటిని అనువాదం చేశారు. సంస్కృతవాఙ్మయంలో అపారమైన సూక్తిసుధానిధి దాగి ఉంది. అన్నమయ్య జీవితానుభవ సారంతో చెప్పిన సూక్తుల సంస్కృతీకరణ అన్నమాచార్య సూక్తిసుధ, అన్నమయ్య సుభాషితాలు గ్రంథాల్లో చూడవచ్చు. అన్నమయ్య దేశీయమైన పలుకుబళ్ళని ఆచార్య రవ్వా శ్రీహరి గారు సంస్కృతభాషకి

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8 53 హైదరాబాద్ జూన్ : 2023

తగినవిధంగా అనువాదం చేశారు. అన్నమాచార్య సూక్తి సుధలో కేవలం సంస్కృత సూక్తుల అనువాదం ఉంది. ఆయా సంపుటాల ప్రకారం అనువాద సూక్తులని ఇచ్చారు. అన్నమయ్య సుభాషితాలలో సంస్కృత అనువాదం మరియు మూలం రెండూ ఇవ్వడం వల్ల దేహళీదీపదత్త న్యాయం లాగా రచన చక్కగా శోభిస్తోంది. అకారాదిలో చేర్చబడ్డ అన్నమయ్య సూక్తులకు సంస్కృతానువాదం ఉంది.




**పాపము సేయకుంటేనే బహు తపము (2-241)**
**అనాచరణం తు పాపస్య తపశ్చర్యేవ కేవలం**

**ముంజేతి కంకణానికి కద్దమా ? (17-44)**
**మణిబంధే కంకణం తు దర్పణం కిమపేక్షతే ?**

సంస్కృతసాహిత్యంలో నిలవదగ్గ ఆభాణకాలుగా అనేక సూక్తుల్ని ఆచార్య రవ్వా శ్రీహరి గారు సంస్కృతీకరించిన తీరు శ్లాఘనీయం.

**వేమన శతకమ్**

తెలుగులోకి సంస్కృత, ప్రాకృత, కన్నడాల నుండి ప్రవేశించిన శతక ప్రక్రియ, ఇంతింతై వటుడింతై అన్నట్లు విషయ విస్తృతితో స్వతంత్ర ప్రక్రియా గౌరవస్థానాన్ని పొందింది.

ఆచార్య రవ్వా శ్రీహరి గారు తెలుగులో జీవనానుభవసారాన్ని కాచి వడ పోసిన వేమన పద్యాలని “సంస్కృత వేమన శతకమ్” అనే పేరుతో అనువాదం చేశారు. ఆచార్య రవ్వా శ్రీహరిగారు 3,000 కు పైచిలుకు లభిస్తున్న వేమన పద్యాలలో 150 పద్యాల్ని ఎంచుకొని వాటికి సంస్కృతానువాదం చేశారు. అంతేకాక తాను రచిస్తున్న సంస్కృత శ్లోకానికి మూలమైన తెలుగు పద్యాన్ని కూడా అక్కడే చేర్చి ప్రచురించారు. ఇందువల్ల మూల, లక్ష్య భాషలు రెండూ తెలిసినవారికి అనువాద శ్లోకాల రచన ఏవిధంగా జరిగిందో తెలిసే అవకాశం ఉంది. రవ్వా శ్రీహరి గారి సంస్కృత అనువాదం యథాతథానువాదంగా కాకుండా భావానువాదంగా సాగింది. మూల రచయిత చెప్తున్న ఉపమానాల్ని మాత్రం మార్చకుండా సంస్కృతంలోకి అనువాదం చేశారు. వేమన శతకంలో రెండు పాదాలలో భిన్న అంశాలు చెప్పబడతాయి. మూడవ పాదం ఆ రెండింటికీ సమన్వయపరుస్తూ చెప్పే సారాంశం. నాల్గవపాదం సంతకం.




**చిప్పఁబడ్డ స్వాతి చినుకు ముత్యంబాయె**
**నీటఁబడ్డ చినుకు నీటఁగలిసె**
**ప్రాప్తి గలుగుచోట ఫలమేల తప్పురా**
**విశ్వదాభిరామ వినురవేమ**

ఈ పద్యంలో మొదటిపాదం ఆలుచిప్పలో పడ్డ వర్షపుచుక్క ముత్యమైందని భావం, రెండవపాదం నీటిలో పడ్డ వర్షపు చుక్క నీరులో కలిసిపోయిందని భావం, ఈ రెండు పాదాల్ని సమన్వయ పరుస్తూ వేమన రాసి పెట్టిన చోట రావాల్సిన ఫలితం తప్పకుండా వస్తుందని చెప్తూ నాల్గవ పాదంలో విశ్వదాభిరామ వినురవేమ అని సంతకం చేశాడు వేమన.




అద్భుతమైన మూలరచనాశైలిని భంగపరచడం ఇష్టంలేని రవ్వా శ్రీహరిగారు

**“శుక్తిపతిత బిందురిహ భవేన్మౌక్తికం**
**నీరపతితమేవ లీయతేఽత్ర**
**ఫలతి ఖలు చ కర్మ ప్రాప్తావశ్యం తు**
**విశ్వదాభిరామ విద్ధి వేమ!”**

అంటూ అనువదించారు. మకుటంలో కూడా “వినుర” అనే పదానికి విద్ధి అనే సంస్కృత సమానార్థకపదం ప్రయోగించి మిగతా మకుటాన్ని మొత్తం అలాగే ఉంచారు.

**“చెప్పులోని రాయి చెవిలోని జోరీగ**

**కంటిలోని నలుసు కాలిముల్లు"** అన్న పద్యపాదాన్ని

**"పాదకంటకం చ పాదుకాప్రస్తరః**

**నేత్రధూళిశ్రోతమక్షికే చ"** అన్న దగ్గర మూలంలోని వరుస మనకు కనిపించదు.

మూలంలో చెప్పు - చెవి, కంటి - కాలు అని అన్న శ్రవణ సుభగత్వాన్ని (sonority) మాత్రం పట్టుకున్నారు. ఈ శ్లోకంలో అనువాదకుడు అనుసరించిన క్రమం వల్ల యతి కూడా చేకూరి శ్రవణ సుభగత్వానికి కారణమైంది.

తెలుగులో వేమన ఆటవెలదుల తోటలో జీవితసారమనే పువ్వులు పూయించాడు.ఆటవెలది దేశీయఛందస్సు. సంస్కృత అనువాద శ్లోకరచన చేసే సందర్భంలో అనుష్టుప్ లోకి ఆటవెలదుల్ని మార్చడం జరుగుతుంది. పరిమాణం దృష్ట్యా రెండు భాషలలోనూ ఇవి తక్కువ కలిగిన ఛందస్సులు. కానీ రవ్వా శ్రీహరిగారు తెలుగువేమన శతకంలో ఆటవెలది ఛందస్సులో సాధింపబడిన నడకని దేశంలో ఉన్న సంస్కృతభాషా పరిచయస్థులకు తెలియజేయాలన్న ఉద్దేశ్యంతో ఆటవెలదిలోనే రచించడం విశేషం. సంస్కృత శ్లోకరచనలోకి తెలుగు ఛందస్సును జొప్పించడం స్వాగతించదగిన విషయం.

**నరసింహ శతకమ్**

తెలుగుసాహిత్యంలో ప్రసిద్ధిని పొందిన శతకాలలో శేషప్పకవి రచించిన నరసింహశతకం అగ్రస్థానంలో నిలిచే రచన. అనేక సామాజిక అంశాలకి సారస్వతమాధ్యమం ద్వారా శాశ్వతత్వం కల్పించబడింది.

తెలుగులో ఉన్న భూషణవికాస! శ్రీధర్మపురి నివాస! దుష్టసంహార! నరసింహ! దురితదూర! అని ఉన్న మకుటాన్ని సంస్కృతానువాదంలో సీసపద్య ఛందస్సులోనే అనువాదం చేస్తూ రవ్వా శ్రీహరి గారు అలాగే ఉంచారు. కారణం శేషప్ప కవి సంబోధనలతో సహా మకుటాన్ని సంస్కృతంలో రచించడమే. ఎక్కడైతే సంస్కృతపదాలు లోకప్రసిద్ధాలుగా ఉన్నాయో వాటిని అలానే ఉందారు ఆచార్య రవ్వా శ్రీహరి గారు. సంస్కృతభాషాభిజ్ఞులు తెలుదులో ఉన్న సీసపద్య సౌరభాన్ని ఈ శతకం ద్వారా ఆఘ్రాణించగలుగుతారు.

సీ. తల్లిగర్భము నుండి ధనము తేఁడెవ్వఁడు
వెళ్లిపోయెడినాఁడు వెంటరాదు
లక్షాధికారైన లవణ మన్నమె కాని
మెఱుఁగు బంగారంబు మ్రింగఁబోఁడు
విత్త మార్జనఁ జేసి విఱ్ఱవీఁగుటె కాని
కూడఁబెట్టిన సొమ్ము తోడరాదు
పొందుగా మఱుఁగైన భూమిలోపలఁ బెట్టి
దానధర్మము లేక దాఁచి దాఁచి
తే.తుదకు దొంగల కిత్తురో దొరల కవునో
తేనె జుంటీఁగ లియ్యవా తెరువరులకు?
భూషణవికాస! శ్రీధర్మపురి నివాస!
దుష్టసంహార! నరసింహ దురితదూర!

ప్రసిద్ధమైన ఈ పద్యాన్ని ఆచార్య రవ్వా శ్రీహరి రమణీయంగా అనువదించారు.

**సీ. మాతృగర్భాత్ కోऽపి నానయతి విత్తం తు**
**ప్రాణయానే నానుయాతి తచ్చ**
**కోటీశ్వరోऽపి వా ఖాదతి లవణాన్న**
**మేవ, హేమ నైవ గిరతి జగతి**
**సంపాద్య ధనమథ గర్వితో భవతి చ**
**నైవానుభవతి తద్విత్తమేవ**
**భూరి ధనం తత్తు భూమౌ వినిక్షిప్తం చ**
**దానధర్మాన్ వినా గూఢమేవ**
**తే. భవతి రాజ్ఞోऽథ చోరస్య వా భవేత్తు**
**దదతి భ్రమరాశ్చ పథికాయ మధురసం ను**
**భూషణవికాస! శ్రీ ధర్మపురి నివాస!**
**దుష్టసంహార! నరసింహ! దురితదూర!**

ఆచార్య రవ్వా శ్రీహరి గారి సంస్కృతానువాదాలు సహృదయులు తమ హృదయమంజూషలో దాచుకోదగ్గ సారస్వతోపహారాలు. సంస్కృతాంధ్రభాషల సాహిత్యవారధిగా ఆచార్య రవ్వా శ్రీహరి గారి సంస్కృతానువాదసాహిత్యం విలసిల్లుతోంది. **జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః** అని భర్తృహరి అన్నట్లు మహామహోపాధ్యాయ ఆచార్య రవ్వా శ్రీహరి గారు చేసిన అనుపమానమైన వరివస్యద్వారా సంస్కృతాంధ్రాలు తెలిసిన వారు ఉన్నంత కాలం తమ కీర్తికాయంతో జీవించే ఉంటారు. ఎంతటి చిన్నవారినైనా మిత్రులుగా భావించే వారి సహృదయత అనుభవైకవేద్యం. సంస్కృతాంధ్ర భాషాసాహిత్యాలకి వారి కొండంత పురస్కృతి ఉన్నా తమ ఇంటి పేరుకు తగ్గట్లుగా రవ్వంతగా భావించే హృదయవైశాల్యం వారి నిసర్గలక్షణం. అనంతలక్ష్మీ వల్లభులైన ఆచార్య రవ్వా శ్రీహరి గారు 21-4-2023న ఆ పరాత్పరుడైన శ్రీహరి సాయుజ్యాన్ని పొందారు.

**ఉపజీవ్య గ్రంథాలు**

1. శ్రీహరి, రవ్వా (1997) ప్రపంచపదీ, వరరుచి పబ్లికేషన్స్, హైదరాబాదు.

2. శ్రీహరి, రవ్వా (2000). ఫిరదౌసీ, హైదరాబాదు.

3. శ్రీహరి, రవ్వా (2001). తైలపాయికా, హైదరాబాదు.

4. శ్రీహరి, రవ్వా ( 2010). వేమన శతకమ్, హైదరాబాదు.

5. శ్రీహరి, రవ్వా (2011), నరసింహశతకమ్, హైదరాబాదు.

6. శ్రీహరి, రవ్వా (2014), అన్నమయ్య సుభాషితాలు, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

7. జాషువా, గుఱ్ఱం (2008). గబ్బిలం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.

8. యాదగిరి, కె. (ప్ర.సంపా) (2017). శ్రీహరివిజయం, ఆచార్య రవ్వా శ్రీహరి పంచసప్తతి అభినందనసమితి, హైదరాబాదు.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8 (55) హైదరాబాద్ జూన్ : 2023

# అజరామర నిఘంటువు ఆచార్య రవ్వా శ్రీహరి

డా. మహేందర్ కట్నూరి ఫోన్ : 901 844 7209

తెలుగు సాహిత్యం నవీన గుణాలను పుణికి పుచ్చుకుని, ప్రపంచీకరణ ప్రాపంచిక దృక్కోణాలను, అలవర్చుకొని వికసస్తున్నా మూలాలు చెక్కుచెదరకుండా సాహిత్య శ్రేష్టత కోసం కృషిసల్పే మహాకవులను తెలుగుభాషా నూతన ఒడిలో దాచుకుంటది.. నిలుపుకుంటది..!

నిఘంటు నిర్మాణ కృతికర్తగా, సంస్కృత సాహితీ వేత్తగా, కవిగా, విమర్శకుడిగా, మహామహోపాధ్యాయుడిగా, సునిశిత పరిశోధకుడిగా, బహుభాషావేత్తగా, అనంత అనన్యసామర్థ్యమూర్తిగా, ఆధునిక భాషా సాహిత్యానికి ఎనలేని సేవచేసి లక్షలాది పేజీల తెలుగు సాహిత్యాన్ని రాసి, తెలుగు అక్షరపులవడాన్ని పరిపుష్టి చేసిన రవ్వా శ్రీహరి తెలుగు భాషా సాహితీ వికాసంలో చిరస్మరణీయులు ప్రాతఃస్మరణీయులు...

వేలాది శిష్యగణానికి ప్రత్యక్ష గురువుగా, లక్షలాది విద్యార్థులకు గురుస్థానీయులుగా, 50 వసంతాల జీవనసాహితీ ప్రవాహంలో జీవద్భాషకు సంజీవినైన రచన – రవ్వా శ్రీహరి గారిది. అతిసాధారణ కుటుంబంలో జన్మించి అనంత లోకాలకేగే చివరిశ్వాస వరకు. సాహితీ సృజనా పరిశోధనకై పరితపించిన భాషా తపస్వి.










**సృజనాప్రస్థానం**

సంస్కృతంలో, తెలుగులో ఉపమానాలకీ, వర్ణనలకీ లోటులేదు. కానీ సంస్కృతానికి, తెలుగు భాషకూ ఉన్న అనుబంధం గురించి చెప్పడానికి ఏ ఉపమానమూ చాలదు. ఈ రెండు భాషల కోసం కొన్ని దశాబ్దాలుగా శ్రమిస్తున్న పండితుడు ఆచార్య రవ్వా శ్రీహరి. రచనా ప్రక్రియలో మాత్రం తెలుగు రచనలకు పెద్దపీట వేసి 50 వరకు గ్రంథాలను వెలువరించారు. సంస్కృతంలో 25 పుస్తకాలు రచించారు. నల్లగొండ జిల్లా, నెల్వరికి చెందిన ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన శ్రీహరి కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి స్థానం వరకు ప్రయాణించిన ప్రతిభాశాలి. పరిశోధన, సృజన, విమర్శ, అనువాదం, నిఘంటు నిర్మాణం వంటి రంగాల మీద తనదైన ముద్రవేశారు. లఘు సిద్ధాంత కౌముది, అలబ్ధ కావ్య పద ముక్తావళి, సాహితీ నీరాజనం, తెలుగు కవుల సంస్కృతానుకరణలు, వాడుకలో అప్రయోగాలు వంటి పుస్తకాలు (తెలుగు) రాశారాయన. సంస్కృతంలో ప్రపంచ పదీ, మాతృగీతం, సంస్కృత వైజయంతి (వ్యాస సంపుటి) వంటివాటిని వెలువరించారు. మాండలికాల మీద శ్రీహరి కృషి వెలకట్టలేనిది. తెలంగాణ మాండలికాలు, అరె భాషా నిఘంటువు, నల్లగొండ జిల్లా ప్రజల భాష, శ్రీహరి నిఘంటువు ఎంతో పేరు తెచ్చిపెట్టాయి. ఆయన రూపొందించిన సంస్కృత న్యాయదీపిక ఒక అద్భుత రచన, సంస్కృత సూక్తి రత్నాకరం కూడా అలాంటి ఉత్తమ గ్రంథమే. మహాకవి గుర్రం జాషువా 'పిరదౌసి', తైలపాయికా పేరుతో 'గబ్బిలం' కావ్యాలను సంస్కృతంలోకి అనువదించారు. వేమన శతకాన్ని కూడా సంస్కృతంలోకి అనువదించి మహోపకారం చేశారు. సంకీర్తనాచార్యుడు అన్నమాచార్య మీద శ్రీహరి కొత్త వెలుగును ప్రసరింపచేశారు. అన్నమాచార్య సూక్తి సుధ, అన్నమయ్య భాషా వైభవం, అన్నమయ్య పదకోశము ఇందుకు తార్కాణం.

**నిత్య విద్యార్థి**

సంస్కృత గ్రంథాలను సైతం పరిష్కృతం చేయగల మేధావి అయినప్పటికీని నిత్య విద్యార్థుల పరణంలో, పరిశోధనలో ఒదిగిపోయే వ్యక్తిత్వ జ్ఞానం ఉన్న బహుభాషావేత్త రవ్వా శ్రీహరిగారు.




మహా మహోపాధ్యాయ, కవి పండితులు, నిఘంటు నిర్మాతలు, గుణ గరిష్టులు, ఆచార్య వరిష్ఠులు, సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలలో పండితులు, నిగర్వి, నిరాడంబరులు ఆచార్య రవ్వా శ్రీహరి గారు. సామాన్య కుటుంబం నుండి వచ్చి అసాధారణ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి భాషామతల్లి సేవలో జీవనయానం కొనసాగించిన బహుముఖ ప్రజ్ఞాశీలి ఆచార్య రవ్వా శ్రీహరి గారు.

యాదగిరి లక్ష్మీనృసింహ సంస్కృత విద్యాపీఠం నుండి దిద్దుకున్న సంస్కృత భాషాతిలకం ఉపకులపతి పీఠమెక్కి విద్యా ప్రభలు పంచింది. ఎం.ఏ. (తెలుగు), ఎం.ఎ. భాస్కర రామాయణం – విమర్శనాత్మక పరిశీలన అంశంపై పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టాను పొందిన ప్రతిభ వారిది. ఆంధ్ర సారస్వత పరిషత్ ఓరియంటల్ కళాశాలలో ఉపన్యాసకులుగా, ఉపన్యాసక వృత్తిలోకి అడుగిడినారు. సీనియర్ తెలుగు పండితుని నుంచి ప్రొఫెసర్ దాకా ఆదర్శవంతమైన అద్భుతమైన బోధన చేసిన ఆచార్యులు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా, ద్రావిడ యూనివర్సిటీ ఉపాధ్యక్షులుగా, హైదరాబాద్ లోని తెలుగు విశ్వవిద్యాలయం ఇన్ చార్జ్ ఉపాధ్యక్షులుగా పనిచేసిన పరిపాలనా దక్షత వీరిది. రవ్వా శ్రీహరి గారు వివిధ విశ్వవిద్యాలయాల లోని విద్యా సంఘాలతో లెక్కకు మిక్కిలి పదవులు నిర్వహించిన ఘనత వీరిది. శ్రీహరి గారు అనగానే మనకు గుర్తొచ్చేది శ్రీహరి నిఘంటువు. తెలుగు సారస్వత క్షేత్రంలో నిలిచిపోయే అనేక అంశాలను అనుశీలించారు. తెలుగు నిఘంటువులున్నంత కాలం, సూర్యరాయాంధ్ర నిఘంటువుతోపాటు శ్రీహరి నిఘంటువు' కూడా నిలిచిపోతుందని పరిశోధకుల అభిప్రాయం.

**మరొక అద్భుత గ్రంథం సంకేత పదకోశం.**

దీనిలో మనకు కావల్సినన్ని వ్యాకరణ, తర్క, మీమాంస, జ్యోతిష, అలంకార, ఆయుర్వేద మొదలైన శాస్త్రాలకు సంబంధించిన పదాల కూర్పు జరిగింది. రెండవ ముద్రణలో మరిన్ని అంశాలను చేర్చి పాఠకులకు ఆసక్తిని కలిగించారు. పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమయ్య కీర్తనల్లోని అచ్చ తెలుగు పదాలను, క్లిష్టమైన భాషాంశాలను, భక్తి భావ సంపన్నతను, సంగీత ప్రావీణ్యతను, భాషా ప్రయోగ చతురతను ఎన్నింటినో అన్నమయ్య పదకోశంలో వివరించిన విజ్ఞానవంతులు ఆచార్యులు.

తెలంగాణా భాషా ప్రాచీనతను, ప్రామాణికతను ఎత్తి చూపిన శ్రీహరిగారి రచన తెలంగాణా మాండలికాలు – కావ్య ప్రయోగాలు. తెలంగాణాలో వాడుకలో వున్న ఎన్నో పదాలకు అర్థాలను తెల్పినారు. నల్లగొండ జిల్లా ప్రజల భాషణలు.. మాండలిక పదకోశం నిర్మించినారు. వ్యాకరణ పదకోశము, వాడుక తెలుగులో అపప్రయోగాలు, లఘుసిద్ధాంత కౌముది, పాణినీయ అష్టాధ్యాయి తెలుగు అనువాదం సహితం సంపుటాలు, సంస్కృత రచనలలో సంస్కృత సూక్తి ముక్తావళి సంస్కృత న్యాయాలు, సంస్కృతం నీతి రత్నాకరం, సంస్కృత న్యాయదీపిక.

**అనువాదాలు**

సి.నారాయణరెడ్డి ప్రపంచపదులు, జాషువా ఫిరదౌసి, గబ్బిలం, వేమన శతకం, శేషప్ప నరసింహ శతకం, మాతృగీతం, స్వీయరచనలు, సంస్కృతీ వైజయంతితోపాటు అనేక రచనలకు సంపాదకత్వం వహించిన కవి పండితులు, భాషావేత్త. వీరి సాహిత్య వ్యాసాలు చాలావరకు పరిశోధనాత్మకమైనవి, ఆలోచనాత్మకమైనవి. రవ్వాగారి గ్రంథాలలో ప్రామాణికత, శాస్త్రీయత స్పష్టంగా గోచరిస్తుంది. తెలుగులో భాషా సాహిత్యానికి సంబంధించిన వీరి రచన ఉభయభారతి. ఇందులో తెలుగు, సంస్కృతం భాషా సాహిత్యాలకు వ్యాసాలు, వ్యాకరణ సంబంధితాలున్నాయి. తెలుగు కవుల సంస్కృతానుకరణలు, తెలుగులో అలబ్ధ వాఙ్మయం, భాస్కర రామాయణం – విమర్శనాత్మక పరిశీలనము (సిద్ధాంత గ్రంథము). శ్రీహరిగారి రచన భాషా విశేషాంశాలు, వ్యాకరణ నంబంధితాలు, సాధికారతతో చెప్పి పరిశోధకులకు, భాషా ప్రియులకు అనేక విషయాలు తెల్పి ఇంకా తెల్పవలసిన అనేకం ఉన్నాయంటూ భావి పరిశోధకులకు వదిలివేసినారు.

నల్లగొండ జిల్లాలోని వలిగొండ మండలం వెలువర్తిలోని నిరుపేద చేనేత కుటుంబంలో 5 మే 1943న రవ్వా వేంకట నరసమ్మ, నరసయ్య దంపతులకు జన్మించినారు. అమ్మమ్మ తాతయ్యల ప్రోత్సాహంతో భువనగిరిలో 5వ తరగతి వరకు చదివినారు. తల్లిగారి మరణంతో చదువుకు అవాంతరం ఏర్పడింది. ఆర్థిక ఇబ్బందుల వల్ల తండ్రి శ్రీహరి గారిని చదివించలేనని తెలియజేశారు. దినపత్రికలోని యాదగిరి దేవస్థానము సంస్కృత విద్యాపీఠం ఉచిత చదువును భోజనాల్ని కల్పిస్తారని తెల్సుకొని అక్కడ చేరిన ఆచార్యుల వారి జీవితం మలుపు తిరిగింది. అక్కడ నుండి బయలుదేరి ఉన్నత చదువులు, ఉన్నతోద్యోగాలు నిర్వర్తించిన ఉభయభాషా ప్రౌఢి.




ఆచార్య శ్రీహరిగారి పంచశతి (75 సంవత్సరాలు) పురస్కరించు కొని 'శ్రీహరి విజయం' పుస్తకం వేయడం జరిగింది. దీనిలో అనేక వ్యాసాలు సాహితీవేత్తల అభిప్రాయాలు, రచనలు వీరి సంబంధిత సాహిత్య విశేషాంశాలు పొందుపరచబడినాయి.

అనువాదం, సంకలనం, విమర్శ, పరిశోధన, నిఘంటువు నిర్మాణం వీరి ప్రతీ అక్షరం వినూత్నం, వీరీ విశేష కృషికి పురస్కారాలు వెతుక్కుంటూ వచ్చాయి. సంస్కృతి విద్యాపీఠ్ తిరుపతి వారి మహామహోపాధ్యాయ, కేంద్ర సాహిత్య అకాడమి వారి పురస్కారం (అనువాద రచనకు), తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కారం, జాషువా సాహిత్య పురస్కారం. న్యూజెర్సీ అమెరికా వారి బ్రౌన్ పురస్కారం, సౌశీల్య పురస్కారం, పరవస్తు చిన్నయసూరి జాతీయ పురస్కారం లాంటి చాలా పురస్కారాలు పొందినారు.



ఆచార్య రవ్వా శ్రీహరిగారంటే నడిచే విజ్ఞాన సరస్వం. వీరి గురించి రాయటం ఒడవని ముచ్చట. ఇలాంటి మహానుభావులపై అత్యంత ఇష్టంతో, జాగరూకతతో అల్లుడిని అంటూ అనల్పమైన "శ్రీహరిగారి తెలుగు రచనలు - సమగ్ర పరిశీలన" పైన డా.సి. యాదగిరి, ఆచార్య సాగి కమలాకరశర్మగారి వద్ద పరిశోధన చేసి, పట్టాను పొంది తెలుగు ఉపాధ్యాయులు కాకున్నా డా. యాదగిరి గారు తమ పరిశోధనలో ఎన్నో విషయాలను తేటతెల్లం చేసినారు. ఇంకా రవ్వాగారి మీద చాలా పరిశోధనలు రావాల్సి ఉంది.

ఆచార్య రవ్వా శ్రీహరి గారి కలం నుండి ఇంకా ఎన్నో రావాల్సి ఉండేది. అనారోగ్య కారణాల వలన ఆయన తుదిశ్వాస విడిచి పోవడం తెలుగు భాషకు ఏనాటికి పూడ్చలేని లోటనే చెప్పాలి... భౌతికంగా సమాజాన్ని విడిచిపోయినా.. సాహితీ చిరస్మరణీయులు రవ్వా శ్రీహరి గారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని సాహిత్యాక్షర నివాళి ఘటిస్తున్నాము.

---

## రవ్వా శ్రీహరి విబుధుడు



తీర్త్వా సంస్కృత సాహిత్య సాగరం కృతకృత్యతామ్ ।
గతవంతం గురుం నౌమి రవ్వా శ్రీహరి పండితమ్ ॥

వైయాకరణమేవాహుః ప్రథమం పండితం జనాః ।
సోఽయం వ్యాకరణజ్ఞేష్వప్యాద్యః శ్రీహరి పండితః ॥

విద్యా దదాతి వినయమితి సూక్తిం కృతార్థతామ్ ।
గమయన్నయమాచార్యో వినీతో విద్యయా బభౌ ॥

సోఽయమాత్మ గుణోపేతః సదాచారో జితేంద్రియః ।
రవ్వా వంశాంబుధేస్సోమః శ్రీహరిర్భాతి శాంతిధీః ॥

విశాల హృదయస్యాసౌ శఠగోపస్య సద్గురోః ।
కృపయైవ మహాభాష్యం నిగూఢం సమధీతవాన్ ॥

సదైవ శాస్త్రే సాహిత్యే కృతభూరి పరిశ్రమః ।
మహామహోపాధ్యాయత్వ మగమద్విబుధాగ్రణీః ॥

విరచయ్య బహూన్ గ్రంథాన్ విద్వల్లోక సమాదృతాన్ ।
లేభే నిరుపమాం ఖ్యాతిం కవిపండిత మండలే ॥

ఆంధ్రే సంస్కృత వాణ్యాం చ స్థితా నైకవిధాః కృతీః ।
మనోజ్ఞైరనువాదైస్స్వై రకరోత్ విశ్వవిశ్రుతాః ॥

సస్మితం మధురం చైవ భాషణం యస్య ధీనిధేః ।
జనానాహ్లాద యత్యార్యం తం నమామ్యహమ్ ॥

శ్రీ వేంకటేశ్వరాస్థానే కుప్పం విద్యాలయే తథా ।
సేవాం నానావిధాం కృత్వా ధన్యోఽభవదసౌ సుధీః ॥

డా. సముద్రాల లక్ష్మణయ్య

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8 (58) హైదరాబాద్ జూన్ : 2023

# మహామహోపాధ్యాయులు – ఆచార్య రవ్వా శ్రీహరి గారు

ఆచార్య కరిమిండ్ల లావణ్య ఫోన్ : 98984 10244



సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలలో పండితులు, మహామహోపాధ్యాయ బిరుదాంకితులు, ప్రాచీన కావ్యభాషకు సంబంధించిన వ్యాకరణంలోను, ఆధునిక మాండలిక భాషలకు సంబంధించి భాషాశాస్త్రంలో ఎంతో కృషి చేసిన విద్వాంసులు ఆచార్య శ్రీహరిగారు. సంప్రదాయ వ్యాకరణాన్ని ఆధునిక భాషా శాస్త్రాన్ని అధ్యయనం చేసి సమదృష్టితో బోధన చేసిన వారు ఆచార్య రవ్వా శ్రీహరిగారని, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డిగారంటారు. శబ్ద, అర్థ శాస్త్రాలు తెలిసిన మహామహోపాధ్యాయులు.

వయస్సులో, సాహిత్యంలో చాలా చిన్నదాన్నైన నాకు వీరి మార్గదర్శనం ఎంతో తోడ్పాటునందించింది. నేను 2013 నవంబర్‌లో కాళోజి ప్రస్థానం–సాహిత్య పరిమళం అనే అంశంపై కాళోజీతో కలిసి తిరిగిన, సామాజిక సాహిత్య అధ్యయనం చేసిన 60 మందితో జాతీయ సదస్సును తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్‌లో నిర్వహించాను. ఈ సదస్సు నిర్వహణ తర్వాత తెలుగు అకాడమికి ప్రచురణార్థం వ్యాసాలు పంపినపుడు అక్కడ గౌరవ సలహాదారుగా ఆచార్య రవ్వా శ్రీహరిగారున్నారు. వారు సంపాదకులుగా ఉంటారని తెలుగు అకాడమి సమన్వయకర్తలుగా ఉన్న డిప్యూటీ డైరెక్టర్ డా. ఎస్. భూపాల్ రెడ్డిగారు, శ్రీవిద్యగారు చెప్పినపుడు మహా ఆనందం కలిగింది. ఆచార్య శ్రీహరిగారు తూర్పు మల్లారెడ్డిగారిని కూడా పుస్తక ప్రచురణ సమగ్రంగా రావడానికి సహకరించమని చెప్పినారు. అలా వారితో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది. మూడు విభాగాలుగా చేసి, ఏ విభాగంలో ఏ వ్యాసం చేర్చాలో ఆసాంతం చదివి, తగు సూచనలు ఇచ్చారు. అపుడే నాకు అన్నమయ్య నవ్వులు, నా సాహితీ జీవనయానం ఈ రెండు పుస్తకాలు ఇచ్చారు. నేనపుడు అన్నమయ్య నవ్వుల మీద పుస్తకమేమిటి? అనుకున్నాను. ఆలోచిస్తే సూక్ష్మ అధ్యయనం వల్లే ఈ పుస్తకం రాయగలిగాడనిపించింది.

అన్నమయ్య ఒక్కొక్క అంశాన్ని ఎంతో సూక్ష్మాతిసూక్ష్మంగా పరిశీలించిన ప్రజ్ఞావంతుడు. శ్రీహరి సారు కూడా అంతే. అన్నమయ్య తిక్కనకు మించిన నవ్వులను, వాటి భేదాలను సుమారు 240 భేదాలను పేర్కొన్నారు. మాటల్లో, వలపుల్లో, సిగ్గుల్లో, చూపుల్లోని నవ్వులు సూక్ష్మాతిసూక్ష్మంగా పరిశీలిస్తే కాని అర్థం కాదంటారు శ్రీహరిగారు. తక్కువ మాట్లాడి, ఎక్కువగా ఆలోచించే, రాసే, చదివే వారిలో కూడ కవుల్లో ఉన్న అంతరానంద ఆహ్లాద హృదయాన్ని ప్రత్యేకంగా పట్టుకున్నవారు.

శ్రీహరి నిఘంటువు నిర్మాణం తరువాత అంతటి నిఘంటువు తయారుచేయటం చాలా కష్టంతో కూడుకున్న పని. ఎంతో సమయం, ఎంతో మేధాశక్తి వినియోగం అయితే తప్ప చేయలేని పని అది. చాలా చిన్న వయస్సు నుండే కొత్తగా ఆలోచించటం, చదవటం, రాయటం అలవాటు చేసుకున్న శ్రీహరి సార్ రచనలు తెలుగు సాహిత్యంలో ప్రామాణిక కరదీపికలు. తెలంగాణ వారైనందుకు తెలంగాణ మాండలికాలు – కావ్య ప్రయోగాలు, నల్లగొండ జిల్లా ప్రజల భాష, నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం వంటి గ్రంథాలు రాసి, భావి పరిశోధకులకు, అధ్యాపకులకు కావలసినంత సాహిత్య సామగ్రిని వాడుకోమని తయారు చేసారు. భాషావేత్తలు, నిఘంటు నిర్మాణకర్తలు కలిసి ఒక యజ్ఞం వలె చేయాల్సిన పనిని శ్రీహరిగారొక్కరే చేయటమనేది చాలా గొప్ప విషయం. అందుకే ఆచార్య నిత్యానందరావుగారిలా అంటారు – "ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృత సరోవరంలో నిర్నిరోధంగా, స్వేచ్ఛగా విహరించే తెలుగు రాజహంస, అపశబ్ద మాలిన్యం సోకని స్వచ్ఛస్ఫటికం. జాషువా, ఫిరదౌసి, గబ్బిలం, కావ్యాల సోయగాలను, డా. సి. నారాయణరెడ్డి ప్రపంచపదులను ధర్మపురి శేషప్ప శతకాన్ని సంస్కృతంలో ప్రకటించి విశ్వజనీనం చేశారు. ఫిరదౌసిలోని 166 పద్యాల్లో జాషువా కుప్పలు పోసిన తెలుగు పలుకుబళ్ళను, కరుణవీరాన్ని ఏ మాత్రం పొల్లు పోకుండా సంస్కృతీకరించడంలో రవ్వా శ్రీహరి కృతకృత్యులయ్యారు.

# నాన్నతో నా జ్ఞాపకాలు

**రవ్వా రమేశ్ కుమార్** మినియా పోలీస్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, ఫోన్ : +1(612) 802-5657

మా నాన్నతో నాకు ఎన్నో జ్ఞాపకాలు, అనుభవాలు ఉన్నాయి. వాటిని ఈరోజు మీతో పంచుకుంటాను. మేము ముగ్గురము అన్నదమ్ములం. మా నాన్నకు మా పేర్లు పాణిని, వరరుచి, పతంజలి అని పెట్టాలని ఉండేదని విన్నాను. కాని ఎందుచేతనో నా పేరు రమేశ్‌కుమార్, పెద్ద తమ్ముడు శివకుమార్ అని పెట్టారు. చిన్నతమ్ముడి పేరు మాత్రం పతంజలిగా పెట్టారు. అందరిలో నేను పెద్దవాడిని. చిన్నప్పుడు బాగా అల్లరి చేసేవాడిని. స్కూల్ లేనప్పుడు ఇంట్లో ఉంటే అల్లరి చేస్తానని నాన్న తనతోపాటు నన్ను ఆర్ట్స్ కళాశాలకు తీసుకొని వెళ్ళేవారు. నాకు అప్పుడు పది, పన్నెండేళ్ళ వయస్సు అనుకుంటాను. నాన్న, ప్రొ. లాలేగారు, నేను ఆర్ట్స్ కళాశాల వెనకభాగంలో ఉన్న టీకొట్టులో టీ తాగింది ఇంకా గుర్తుంది. నాన్న, ప్రొఫెసర్ లాలేగారు సంస్కృతంలో సంభాషణ నాకు ఏమీ అర్థమయ్యేది కాదు.

ఇక్కడ మీకు ఇంకొక్క విషయం చెప్పాలి. నా పదేళ్ల వయస్సు నుంచి నాన్న నాకు ప్రతిరోజు ఉదయం ఒక పద్యమో/ శ్లోకమో నేర్పేవారు. అలా నాకు ఒక 50 పద్యాలు, శ్లోకాలు కంఠస్థంగా వచ్చేవి. అలాగే నాన్న నాకు పాణిని సూత్రాలు అఇఉణ్, ఋలుక్, ఏఓఙ్, ఐఔచ్, హయవరట్, లణ్, ఞమఙణనమ్, ఝభఞ్, ఘఢధష్, జబగడదశ్, ఖఫఛఠథచటతవ్, కపయ్, శషసర్, హల్ (ఇతి మహేశ్వరాణి సూత్రాణి అణాది సంజ్ఞార్థాని). నాన్న చిన్నతనంలో నేర్పించి నాతో సురభారతి సంస్థ మీటింగ్‌లో చెప్పించినారు. ఆ మీటింగ్‌లో అల్లాడి కుప్పుస్వామిగారు, ప్రొ. కమలగారు, ప్రొ. ముదిగంటి గోపాలరెడ్డిగారు ఉన్నారు. వారందరు నన్ను బాగా మెచ్చుకొని ఇంకా బాగా చదవాలని ఆశీర్వదించారు. క్రమేణ ఇంజనీరింగ్ విద్యాభ్యాసంతో చదువుకొన్న కొంచెం సంస్కృతం కూడా మరచిపోయాను.

మా నాన్నకు మహాభాష్యాంతం వ్యాకరణం నేర్పిన గురువర్యులు శ్రీమాన్ కోయిల్ కందాళై శఠకోప రామానుజాచార్యులు, బ్రహ్మశ్రీ ఖండవల్లి నరసింహశాస్త్రి, శ్రీమాన్ అమరవాది కృష్ణమాచార్యులను నాన్న ఒక మునిత్రయంతో పోలుస్తారు. అదేవిధంగా మేము ప్రొ. లక్ష్మణమూర్తి, భాగవతం రామారావు, నాన్నను మునిత్రయంగా భావిస్తాము. నా యాభై ఏళ్ళ జీవితకాలంలో నాన్న లక్ష్మణమూర్తిగారిని, భాగవతం రామారావు గారిని గుర్తు చేయని రోజు లేదంటే అతిశయోక్తి కాదు.

మా నాన్నగారి పాండిత్యము మా ముగ్గురు అన్నదమ్ములకు అబ్బలేదేమో గాని, వారు నేర్పిన క్రమశిక్షణ, వినయవిధేయతలు,



సంస్కారం అబ్బినాయని నేను భావిస్తాను. మా బంధువులకు, మిత్రులకు నాన్నంటే ఒక ప్రత్యేక గౌరవముండేది. నాకు ఊహ తెలిసినప్పటి నుండి నాన్నకు చదవడం, వ్రాయడం, ఉపన్యాసాలు ఇవ్వడం, విద్యార్థులతో సంభాషించడం గాక వేరే అభిరుచులు చూసి ఎరుగను. నాన్న మనస్తత్వము చాలా సున్నితమైంది. ప్రతి విషయాన్ని చాలా సూక్ష్మంగా ఆలోచిస్తారు. వారి నోటినుండి ఒక పరుషమైన వాక్యము నా జీవితంలో చూసి ఎరుగను. వారు విద్యార్థులనందరిని మీరు అని సంబోధిస్తుంటే చిన్నప్పుడు అర్థం కాలేదు. కాని ఇప్పుడు అర్థమయింది.

నాన్న జీవితమంతా తెలుగు, సంస్కృతాంధ్ర సాహిత్యాలకు ధారపోసారు. ఏనాడు ఏ అవార్డు గాని, పదవి గాని ఆశించలేదు. నిస్వార్థమైన సేవ చేసారు. నాన్న చివరి నాలుగైదు సంవత్సరాలు అల్జీమర్స్ వ్యాధి వల్ల కొంత జ్ఞాపకశక్తిని కోల్పోయారు, లేదంటే ఆయన కలం నుంచి మరెన్నో సాహిత్య గ్రంథాలు వెలువడి ఉండేవి. ఉద్యోగరీత్యా మేం ముగ్గురం అన్నదమ్ములం అమెరికాలో ఉన్నా, ప్రతి సంవత్సరం మేము ఒక రెండు నెలలు అమ్మనాన్నలతో గడిపే సమయం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చేది.

నాన్న మా మధ్యలో లేకున్నా వారు చేసిన సేవ, వారు వెలువరించిన గ్రంథాలు, శ్రీహరి నిఘంటువు, పాణిని అష్టాధ్యాయి, అన్నమయ్య పదకోశం వంటివి చిరకాలం ఉంటాయి. అటువంటి మహానుభావునికి జన్మించిన మేము అదృష్టవంతులమని నా భావన.

కమలాకరశర్మగారు మాకు ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, భగవంతుడు మా నాన్న ఆత్మకు శాంతిని ప్రసాదించమని కోరుతూ..... ధన్యవాదాలు

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 8 (60) హైదరాబాద్ జూన్ : 2023

# సంస్కృతంలో లేని శాస్త్రం లేదు (ముఖాముఖి)

**నిర్వహణ : ఆచార్య పిల్లలమర్రి రాములు , ఫోన్ : 924 652 6627**

**సంస్కృత సాహిత్య పరిచయం ఏమాత్రం లేని కుటుంబం నుండి వచ్చిన మీరు ఈ సంస్కృతాన్ని ఎందుకు అధ్యయనం చేయాలని అనుకున్నారు?**

సంస్కృత అధ్యయనం కేవలం యాదృచ్ఛికం. నేను అంతకు ముందు భువనగిరిలో ఇంగ్లీష్ చదువే చదివేవాణ్ణి. అక్కడ ఐదవ తరగతి ముగించుకున్నారు. ఈ సెలవుల్లో మా ఇంటికి వెళ్ళాను. అప్పుడు మా అమ్మగారు గర్భిణి. తరువాత కొద్దిరోజులకు ప్రసవమయ్యి ఒక ఆడబిడ్డను కన్నది. కానీ, ఆ బిడ్డ చనిపోయింది. తరువాత సూతి రోగమొచ్చి ఆమె మరణించింది. అటువంటి పరిస్థితుల్లో నాకు ప్రతీ నెల డబ్బు పంపించి చదివించే స్థోమత మా నాన్న గారికి లేకుండె. నాకేమో ఏదో చదువుకోవాలని ఉంది. ఇంగ్లీషు చదువు చదవాలంటే దానికి డబ్బు కావాలి. అందువల్ల నేనేం చేసినానంటే, భువనగిరికి దగ్గరలోనే యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ఉంది. ఆ దేవస్థానం వాళ్లు సురవరం ప్రతాపరెడ్డి, మందుగుల నర్సింహా రావు మొదలైనటువంటి వారి ప్రేరణ చేత అక్కడ సంస్కృత విద్యాపీఠాన్ని నెలకొల్పినారు. ఆ విద్యాపీఠంలో ఒక ఐదేళ్ళు చదువుకుంటే ఉస్మానియా యూనివర్సిటీ ఎంట్రన్స్ పరీక్షకు పోవచ్చు. అక్కడ చేరినటువంటి విద్యార్థులకు ఫీజు లేకుండా భోజనంపెట్టి, సంస్కృతం అధ్యాపనం చేస్తారు. అధిక సౌకర్యం ఉంది గనుక అందులో చేరాను. చేరిన తరువాత మూడు నెలలకు ఒక పరీక్ష జరిగింది. ఆ మూడు నెలల పరీక్షలో నేను జవాబులు చాలా బాగా చెప్పగలిగిన. అప్పుడు మౌలిక పరీక్షలే. కప్పగంతుల లక్ష్మణ శాస్త్రిగారు హైద్రాబాద్ నుండి వచ్చేవారు. వచ్చి మమ్మల్ని పరీక్షించేవారు. ఆ పరీక్షలో నేను బాగా చెప్పినాను. అమరకోశము, శబ్దాలు వంటివి ఆ మొదటి మూడునెలల్లో చెప్పినటువంటివి నేను బాగా చెప్పినాను. అయన నన్ను మెచ్చుకొని, ఒక నువ్వు ఇక్కడే చదువుకో అని నన్ను ప్రేరేపించినారు. ఇది నా సంస్కృత అధ్యయనానికి ఒక ప్రాతిపదిక.

తర్వాత నేను డిగ్రీ చేరడాని కోసం హైదరాబాద్ వచ్చాను. సీతారాంబాగ్లో 'వేదాంత వర్ధిని' సంస్కృత కళాశాల తెలంగాణ ప్రాంతంలో చాలా ప్రాచీనమైన కళాశాల. శఠగోప రామానుజాచార్య స్వామి వారని ఆయన సర్వమూ త్యాగం చేసి ఆ పాఠశాలని నడిపించారు. అక్కడ చేరి రెండు నెలలు చదువుకున్నాను. ఆ రెండు నెలలు సాహిత్యమే చదివినాను. మాకు వ్యాకరణ అధ్యాపనం చేసే ఆచార్యులు, స్వామివారికి (ప్రిన్సిపాల్ని మేము స్వామివారిని పిలిచేవాళ్ళం) "ఈయన వ్యాకరణం బాగా నేర్చుకుంటున్నారండి. వ్యాకరణమే అప్షనల్గా తీసుకుంటే బాగుంటుంది. ఈ సాహిత్యమెందుకు, అది అందరు చదువుతున్నారు. శాస్త్రం ఎవ్వరూ చదువరు కనుక అతను వ్యాకరణం చెందితే బాగుంటుంది" అని చెప్పినారు. అప్పుడు నేను వ్యాకరణం తీసుకున్నాను.

**ఆ రోజుల్లో సంస్కృత భాష అనేది బ్రాహ్మణులకు సంబంధించింది. ఈ నేపథ్యంలో బ్రాహ్మణేతరులైన మీతో ఎవరైనా బ్రాహ్మణులు స్పర్థ వహించారా?**

నాకు మొట్టమొదట సంస్కృత అధ్యాపకులు కేరళ సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. వారు కేరళ నుండి వచ్చినారు. మద్రాసులో ఉన్న మైలాపూర్ సంస్కృత కళాశాలలో 'శిరోమణి' పాసయ్యారు. ఇక్కడ శాస్త్రుల విశ్వనాథ శర్మ గారని, శివంపేట వాస్తవ్యులు, గొప్ప విద్వాంసుడు. వారు కూడా అక్కడ చదువుకున్నారు. వీరిద్దరూ అక్కడ సహాధ్యాయులు. ఆయనను సెలవుల్లో విశ్వనాథ శాస్త్రి ఇంటికి తీసుకొని వచ్చినారు. వచ్చాక లక్షణశాస్త్రిగారికి, సురవరం ప్రతాపరెడ్డి గారికి పరిచయం చేస్తే, మీరు ఇక్కడే అధ్యాపకులుగా ఉండండి. మేం పాఠశాల పెడుతున్నాం అన్నారు. వారి దగ్గర నేను 'రామ' శబ్దం ప్రారంభించినాను. తరువాత నేను బాగా చదువుతూ ఉంటే, ఆయన తక్కిన విద్యార్థులందరి మీద కంటే (నేను బ్రాహ్మణేతరుణ్ణి అయినా) నా మీద ప్రేమ చూపించేవారు. నాతోపాటు ఐదారుగురు వచ్చినారు మా ఊరివాళ్లు. అయితే మూడు నెలల తరువాత పరీక్షలో నెగ్గకపోతే వాళ్లను ఇంటికి పంపించేసినారు. చివరికి నేనొక్కణ్ణే మిగిలినాన్నమాట. నేను అందరికంటే బాగా చదువుతుండడంవల్ల కేరళ సుబ్ర హ్మణ్యశాస్త్రి నన్ను బాగా ప్రోత్సహించినారు. తోటి విద్యార్థులు కూడా నన్ను ప్రేమించినారేగాని, నాన్ బ్రాహ్మిన్ అనే తేడా చూపించలేదు. విద్యా విషయకమైన స్పర్థ కొద్దిగా ఉండేది. కానీ ఈ కుల విషయమైన స్పర్థ మాత్రం ఉండేది కాదు. భోజనాల సమయంలో మాత్రం మమ్మల్ని విడిగా కూర్చోబెట్టేవారు. అక్కడ బ్రాహ్మణులకు ఒకటి, అలాగే వైష్ణవులకు ఒకటి తినే స్థలాలు వేరుగా ఉండేవి. ఈ స్మార్తులను కూర్చోబెట్టిన దగ్గర, వారు తిన్న తరువాత మమ్మల్ని కూర్చోబెట్టి భోజనానికి లేపేవారు. నాకు పెద్దగా బాధ అనిపించకపోయేది. ఎందుకంటే వాళ్లు నన్ను ఎంతో ప్రేమతో చూస్తున్నారు. బాగా చదువుతున్నానని ప్రోత్సహిస్తున్నారు. దీంతో వివక్ష అనే భావనకు తావు లేదనిపించింది. అదొక ఆచారం. ఆ ఆచార పద్ధతి ప్రకారం వేం నడుస్తున్నామని మాకు అనిపించిందంతే.

**ఆ భాషలోని జ్ఞానమంతా కూడా బ్రాహ్మణ సంస్కృతికి సంబంధించిందే. ఆ జ్ఞానాన్ని పేద ప్రజానీకం, ఉత్పత్తి కులాలు, అతిశూద్ర కులాలు చదువుకోవడం వల్ల ప్రయోజనమేమిటి?**

సంస్కృతంలో లేని శాస్త్రం లేదు. పొలిటికల్ సైన్స్ నేర్చుకోవాలన్నా సంస్కృతంలో ఉంది. కాని సంస్కృతం అనేసరికి మన పాఠశాలల్లో, కళాశాలల్లో కావ్యాలు, నాటకాలు, ఏవో కొన్ని అలంకార శాస్త్ర గ్రంథాలు ఇవి మాత్రమే చెబుతారు. కాని ఇంకా మూడింతల సాహిత్యముంది. వైద్యశాస్త్రం, ఖగోళశాస్త్రం, భూగర్భశాస్త్రం ఇలా ఎన్నో శాస్త్రాలున్నాయి. 'సమరాంగణ సూత్రధార' అనే భవనాలు కట్టించే శాస్త్రముంది. అయితే ఈ టెక్నికల్ నాలెడ్జ్‌ను పక్కకు పెట్టేశారు. దాని అధ్యయన అధ్యాపనాలు లేనే లేవు. ఒకతను యూనివర్సిటీలో పొలిటిక్స్ చెబుతాడు. మన దేశంలో పొలిటికల్ సైన్స్ ఎట్లా ఉండే దనేది ఆయనకు తెలీదు. కాబట్టి అది చెప్పడు. అన్ని దేశాలలో ఎలా ఉండిందో అది చెబుతాడు. మెడిసిన్ చదువుతున్న పిల్లలకు మన దేశంలో పూర్వకాలంలో మెడిసిన్ ఎట్లుండిందో కనీసం పరిచయం చేయట్లేదు. సంస్కృతంలో అన్ని శాస్త్రాలు ఉన్నాయి. చివరికి చౌర్యశాస్త్రం కూడా ఉంది. మొన్న ఆడయార్ లైబ్రరీ నుంచి 'ధర్మ చౌర్య రసాయనం' అన్న గ్రంథాన్ని తెప్పించినాడు. అలాగే నీతిశాస్త్రం ఉంది. అసలు ఎన్ని నీతి వాక్యాలు, ఎంత చప్పటివి ఉన్నాయి! ఇలాంటివి అందరు చదవదగినవి. నిరాదరణ చెయ్యడం వల్ల అది తప్పిపోయింది.

**మీరు రూపొందించిన శ్రీహరి నిఘంటువు ఉద్దేశం ఏమిటి?**

నేను ఈ నిజాం కళాశాలలో, సారస్వత పరిషత్తు కళా కాలలో తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు చెప్పేవాడిని. అప్పుడు కొన్ని పదాలకు అర్థాలు తెలియకపోతే సూర్యారాయాంధ్ర నిఘంటువు చూచేవాడిని. శబ్దరత్నాకరము చూచేవాడిని. అపుడే నాకు తెలియనటువంటి అర్థాలు, తెలియనటువంటి పదాలు కనిపించక పోయేవి. ఆ పదాలన్నింటిని రాసుకోవడం మొదలుపెట్టాను. ఎన్నో ఏళ్ళ నుంచి ఇలా వేల పదాల జాబితా తయారు చేసినాను. ఇవి అన్నీ కలిపి ఒక నిఘంటువు వేస్తే బాగుంటుంది కదా అనే దృష్టి నాకు వచ్చింది. అలాగే జానపద సాహిత్యం మీద నా మిత్రులు చేసిన పరిశోధనలు చదువుతుండేవాడిని. వాటిలో మంచి మంచి పదాలు, అచ్చమైన తెలుగు వాసన ఉన్న పదాలు కనిపించేవి. అవి చూస్తే నిఘంటువులో ఉండకపోయేవి. అలా సూర్యరాయాంధ్ర నిఘంటువులో లేని పదాలు, అలాగే మనకు జానపద సాహిత్యంలో దొరికిన పదాలు... వీటన్నింటినీ కలిసి ఒక నిఘంటువుగా కూర్చినా నన్నమాట. తెలంగాణ వ్యవహారంలో ఉన్న పదాలు, మాండలిక పదాలు కూడా అందులో చేర్చినాను. అన్నమయ్యలోని పదాలు అందులో చేర్చినాను. ఆ తరువాత అన్నమయ్యకే ప్రత్యేకించి ఒక నిఘంటువును రాశాను. అట్లే ఈ నల్లగొండ జిల్లా మాండలిక పదకోశాలు, అట్లే తెలంగాణ మాండలికాలు ప్రాచీన కావ్యాలలో ఏ రకంగా ఉపయోగించిన్రు అనేది కూడా చాలా విశిష్టమైన పరిశీలన. అంటే ఈ ప్రాచీన పదాలు, ఈ తెలంగాణ మాండలిక పదాలు ఏ సందర్భాల్లో వాడేదన్నదాన్ని బట్టి మనం ఆ రచయితల ప్రాంతాలను గుర్తించవచ్చు. పాల్కురికి సోమనాథుడు చాలాకాలం పాటు తెలంగాణ వాడు కాదు అనే చర్చ ఉండేది. అట్లే పోతనను గురించి కూడా తెలంగాణ వాడు కాదు, ఒంటిమిట్టవాడు అన్నప్పుడు, పోతన ఈ మాండలిక పదజాలాన్ని ఉపయోగించిన తీరును బట్టి ఆయన తెలంగాణ ప్రాంతం వాడేనన్నది గుర్తించగలిగాం.

పోతనను గురించి 'తెలంగాణ మాండలికాలు–కావ్య ప్రయోగాలు' అనే పుస్తకంలో ఇచ్చినాను. పోతన 'ఉరుకు' అంటాడు. 'ఉరుకు' తెలంగాణ పదము. ఆంధ్ర ప్రాంతంలో పరుగెత్తు. ఈ 'పరుగెత్తు' కంటే 'ఉరుకు' సులభం. మూడు అక్షరాలే ఉన్నాయి. అక్షరాలు పోనివ్వండి, ఒక పదమైతే ఫరవాలేదు. 'పరుగెత్తు' రెండు పదాల సమ్మేళనం. పోతన మూడు నాలుగు చోట్లా 'ఉరుకు' అనే వాడినాడు. అట్లాగే పొద్దులు అంటారు. పొద్దులు అంటే ప్రసవ దినాలు. ప్రసవించే దినాలను పొద్దులు అంటారు. ('ఆమెకు ఇపుడు పొద్దులు'). పోతన చాలా చోట్ల 'పొద్దులు' అని వాడతాడు. "నీళ్ళాడు పొద్దులయ్యే' అంటాడు. ఇలా ఎన్నో నేను పోతనలో గమనించాను.

**సంస్కృత సాహిత్యాన్ని జనంలోకి తీసుకెళ్ళడంలో మీ పరంపర నేడు ఎట్లా కొనసాగుతున్నది?**

శాస్త్ర గ్రంథాలను కొంతమంది తెలుగులోకి తెచ్చే కృషి చేస్తున్నారు. చేసేవాళ్ళు ఉన్నారు. అయితే నాదేమో వ్యాకరణం గనక ఇది అందరికీ కొంత అవసరం కూడా. వేదాంతం ఉందనుకోండి, అందులో కృషి చేసిన పండితులు ఉన్నారు. కాని వాళ్ళను అందరూ పట్టించుకోరు. కాని నేను చేసేది వ్యాకరణం అయ్యేసరికి అటు లింగ్విస్టిక్స్ విద్యార్థులకూ, తెలుగు విద్యార్థులందరూ దీన్ని రిఫర్ చేసుకోడానికి వీలవుతుంది. అలంకారశాస్త్రం పైన పుల్లెల శ్రీరామ చంద్రుడు చేసిన సేవ చాలా గొప్పది. సంస్కృతంలో ఉన్న అలంకార శాస్త్రాలు మనకు అవసరం. వాటన్నింటిని కూడా ఆయన అనువదించాడు. బేతవోలు రామబ్రహ్మంగారు సంస్కృత నాటకాలను, వాటన్నింటిని కొన్ని వ్యాఖ్యానాలతో తెలుగులోకి తీసుకొని వచ్చినారు. కొందరు అలంకార శాస్త్ర గ్రంథాలు, కొందరు వేదాంత గ్రంథాలు ఈ విధంగా తెస్తూనే ఉన్నారు.

**ఇన్నేళ్ళ మీ సుదీర్ఘ ప్రయాణం మీరు ఏం అనుకున్నారో అదే పద్ధతుల్లో కొనసాగిందా?**

నేను ఒకటనుకుంటే ఇంకొకటి జరిగింది. అసలు నేను సంస్కృత లెక్చరర్ కావాల్సి ఉంటిని. కానీ తెలుగుశాఖలో సెలెక్టు అయినాను. అప్పట్నించి చదువుకున్న సంస్కృతాన్ని వదలకూడదు. మరచి పోయేంతవరకు పోకూడదు అనేది ఒకటి నా మనసులో ఉన్నదన్న

మాట. కనుక దాంట్లో కూడా కృషి చేస్తూనే ఉన్నాను. ఇటు తెలుగు సంస్కృతం రెండు నా కళ్ళ మాదిరిగా చూచుకుంటూ రెండింటిలో వీలైనంత వరకు కృషి చేస్తూ వచ్చినాను. నిఘంటువుల మీద పని ఒక్కరూ చేసేది కారు. అశేమో చాలా గొప్పగా ఉంది. అసలు ఇప్పుడున్న నిఘంటువుల్లో చేరని పదాలన్నీ చేర్చి తెల్లవారేవరకు ఓ నిఘంటువు ఏర్పరచాలన్న కోరిక ఉంది. కాని దానికి విడిగా ఒక సంస్థ ఉండి కృషి చేయాలి. ఆదునిక సాహిత్య పదాలన్నీ కూడా రావాలి. ఇంగ్లీషు భాషలో రూపొందే ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీవాళ్లు ఎప్పుడొచ్చిన పదం అప్పుడు రిజిష్టరు చేస్తారు. చేసి సంవత్సరం కాగానే 'ఈ సంవత్సరం చేరిన పదాలు ఇవి' అని ఇస్తుంటారు. మనకు ఎక్కడిదా స్పృహ?!

**తెలుగు అధ్యయనం గాని, సంస్కృత అధ్యయనం గాని భవిష్యత్ తరాలు ఎట్లా చేస్తే బాగుంటుంది?**

మౌలికమైన సంస్కృతాన్ని తెలుగువాళ్లు నేర్చుకోవాలి. అందులో పెద్ద శాస్త్రాలని చదవాలని కాదు. దానివల్ల ఆధునిక తెలుగుకు ఏ చేయొచ్చనే ఆలోచనలు వస్తాయి. లింగ్విస్టిక్స్ శాఖ వైపు కూడా దృష్టి పెట్టి, చదువుకుంటే భాషా విషయకంగా ఇంకా కొత్త అంశాలెన్నో చెప్పడానికి అవకాశం ఉంటుంది. నేను పెద్దగా లింగ్విస్టిక్స్ చదువుకోలేదు. చదువుకొని ఉండి ఉంటే తెలుగులో భాషా పరమైన పరిశోధనలు కూడా చేయగలిగి ఉండేవాణ్ణి. అలాగే ఇప్పటి తరం వారు వ్యుత్పత్తి కలగడానికి ప్రాచీన సాహిత్యాన్ని తప్పక చదువు కోవాలి. ఇప్పటి రచయితల్లో రచనోత్సాహము బాగానే ఉంది. కానీ, వివిధ శాఖలకు సంబంధించిన సాహిత్యాన్ని కూడా వాళ్లు చదవాలి. దేన్ని వదిలిపెట్టకూడదు. ప్రాచీన సాహిత్యం, ప్రబంధాలు, వచన సాహిత్యాలను ఆధునిక సాహిత్యంతో కలిపి చదువుకుంటే వాళ్లకు కొత్త ఊహలు కూడా రావడానికి అవకాశం ఉంది.

(ఆంధ్రజ్యోతి దినపత్రిక సౌజన్యంతో..)

(ఈ ఇంటర్వ్యూ ఆచార్య రవ్వా శ్రీహరి గారి చివరి ఇంటర్వ్యూగా గుర్తింపబడింది)



**మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు**

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షష్ఠ్యబ్దిపూర్తి... షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

**చిరునామా**

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట,
హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2023-2025
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month




From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

**Printed, Published and Owned by : B.Anantha Laxmi, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.**
**Published at H.No.3-4-245/1, Lingampally, Hyderabad - 500 027. Telangana**
**Editor : Dr.Sagi Kamalakara Sharma**